PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 55 | విజయవాడ, బుధవారం 25 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 25 September 2024 | Rs

బ్యాంకింగ్‌లో భయాలు..!

తగ్గుతున్న డిపాజిట్లు

పెరుగుతున్న రుణాల జారీ

మార్కెట్లు, ఎంఎఫ్‌ల్లో పెట్టుబడుల ఎఫెక్ట్

ఇతర నిధుల సమీకరణపై దృష్టి

7

చెస్ ఛాంపియన్స్‌కు ఘన స్వాగతం

- చెన్నైలో గుకేశ్ సహా ప్రజ్ఞానంద, వైశాలి, శ్రీనాథ్‌లకు కూడా..



8

'మూడోవంతు' నిబంధనపై సందిగ్ధం

గుబులురేపుతున్న 33 శాతం క్రాప్ డ్యామేజీ రూల్

జిఓలో లేని ఆ నిబంధన

స్పెషల్ రిలీఫ్‌కు కూడా వర్తిస్తుందని భాష్యాలు

అమలైన పక్షంలో పరిహారం కోల్పోనున్న వేలాది రైతులు



కృష్ణా జిల్లాలో ఇటీవల వరదలకు దెబ్బతిన్న వరి పైరును చూపుతున్న రైతులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఇటీవలి భారీ వర్షాలు, వరదల వలన పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయం ప్రకటించగా, దీనికి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డిఆర్‌ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) నిబంధనలు వర్తిస్తాయా లేదా అనే సందేహాలు బయలు దేరాయి. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ రూల్స్ ప్రకారం పంట నష్టాలకు అందించే పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ)కి రైతులు అర్హత పొందాలంటే తప్పనిసరిగా క్రాప్ డ్యామెజి 33 శాతం (సుమారు మూడవ వంతు లేదా మూడింట ఒక వంతు), అంతకంటే ఎక్కువ జరిగినట్లు ప్రభుత్వ అధికారులు నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో నిర్ధారణ కావాలి. పంట నష్టం 33 శాతానికంటే తక్కువ అని ఎన్యూమరేషన్‌లో పేర్కొంటే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రాదు. ఎన్యూమరేషన్‌కు శాస్త్రీయ కొలబద్దలేమీ లేవు. తనిఖీ అధికారులు కంటితో చూసి వేసే అంచనాలే ప్రాతిపదిక. అది కూడా పొలాలన్నీ చూసే అవకాశం ఉండదు. ఉజ్జాయింపుగా సర్వే నెంబర్లు బట్టి రికార్డు చేస్తారు. కాగా ఆగస్టు, సెప్టెంబర్‌లో ఊహించని విధంగా అనూహ్య స్థాయిలో భారీ వర్షాలు, వరదలొచ్చాయని, బాధితులకు ప్రత్యేక ఆర్థిక సాయం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ వివరాలను ఈ నెల 17న ప్రకటించారు. దానికి సంబంధించి జిఒఎంఎస్ నెం.13 సోమవారం విడుదలైంది. ఆ ఉత్తర్వుల్లో గతంలో ఏ ఐటెంకి ఎంత పరిహారం, ఇప్పుడు ఎంత ఇస్తున్నామన్న వివరాలు ఉన్నాయి. పెంచి ఇస్తున్న స్పెషల్ రిలీఫ్‌కు గతంలో మాదిరిగా ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ రూల్స్ వర్తిస్తాయా లేదా అన్న విషయాన్ని పేర్కొనలేదు. ఇంతకుముందు ఇచ్చిన ప్రతి జిఓలోనూ క్రాప్ డ్యామేజి 33 శాతం జరిగి ఉండాలని స్పష్టం చేశారు. తాజా ఉత్తర్వుల్లో ప్రత్యేక రిలీఫ్ అన్నారు తప్ప ఇన్‌పుట్ సబ్సిడీ అని తెలపలేదు.

కేంద్రం నిధులివ్వాలంటే...

ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఈ తడవకే ఈ స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ వర్తిస్తున్నందున, డ్యామేజి 33 శాతం ఉండాలన్న నిబంధన వర్తించ కపోవచ్చని కొంత మంది అధికారులు అభిప్రాయపడుతున్నారు. కేంద్రం నుంచి నిధులు రావాలంటే ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ రూల్స్ తప్పకుండా పాటించాలని, 33 శాతం క్రాప్ డ్యామేజి రూల్ వర్తించి తీరాలని చెబుతున్నారు. సహాయం పెంచారంతేనని, గత నిబంధనలన్నీ తూచ అమలవుతాయని మరికొంత మంది వ్యాఖ్యానిస్తున్నారు.

చాలా మందికి రాదు

33 శాతం క్రాప్ డ్యామేజి నిబంధన వర్తిస్తే వరదల వలన పంట నష్టపోయిన రైతుల్లో చాలా మందికి సర్కారు ఇచ్చే కొద్ది పాటి పరిహారం సైతం అందదు. వ్యవసాయ, ఉద్యానవన పంటలన్నీ కలుపుకొని 5.67 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని ముఖ్యమంత్రి, ప్రభుత్వ అధికారులు తొలుత ప్రకటించారు. అలాగని కేంద్ర బృందాలకు నివేదికలు ఇచ్చారు. తుది గణాంకాలదగ్గరకొచ్చేసరికి నష్టపోయిన విస్తీర్ణం 3 లక్షల ఎకరాలకు తగ్గిందని సమాచారం. నష్టం తగ్గుదలకు '33 శాతం డ్యామేజి రూల్' ప్రధాన కారణమని తెలుస్తోంది. సిఎం ప్రకటించిన ప్రత్యేక రిలీఫ్‌నకు 33 శాతం డ్యామేజి రూల్ వర్తింపజేస్తున్నారని తెలుస్తోంది.

కాలేజీల్లో ఎన్‌ఆర్‌ఐ కోటా పెద్ద మోసం !

- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : కాలేజీల్లో ఎన్‌ఆర్‌ఐ కోటా కింద అడ్మిషన్లు అనేది పెద్ద మోసమని, దీన్ని వెంటనే ఆపాల్సి వుందని సుప్రీం కోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. పంజాబ్ రాష్ట్రంలో అండర్‌గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఎన్‌ఆర్‌ఐ కోటా నిర్వచనం పరిధిని విస్తరించాలని పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దానిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీల్ చేసింది. ఆ అప్పీల్‌ను మంగళవారం సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఎన్‌ఆర్‌ఐల అంకుల్స్, ఆంటీలు, కజిన్లతో సహా దూరపు బంధువులందరినీ 15శాతం ఎన్‌ఆర్‌ఐ కోటా కిందకు చేరుస్తూ ఆగస్టు 20న ఆప్ ప్రభుత్వం తీసుకున్న చర్యను పంజాబ్, హర్యానా హైకోర్టు సెప్టెంబరు 10న కొట్టివేసింది. 'ఇది డబ్బు సృష్టించే యంత్రం తప్ప మరొకటి కాదు.' అని ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. "అన్ని పిటిషన్లను కొట్టివేయాలి. ఈ ఎన్‌ఆర్‌ఐ బిజినెస్ అంతా మోసం తప్ప మరొకటి కాదు. దీనికి వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఇకపై చట్టానికి ప్రాధాన్యతనివ్వాలి." అని బెంచ్ స్పష్టం చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనదని పేర్కొంది. మూడు రెట్లు ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులకు వీరి వల్ల కాలేజీల్లో అడ్మిషన్లు దొరకవని పేర్కొంది. విదేశాల్లో స్థిరపడిన వారి బంధువులనే ఒకే ఒక కారణంతో మెరిట్ అభ్యర్థులను పక్కకు తోసి వారికి ప్రవేశాలు కల్పించడాన్ని ఇక ఎంత మాత్రమూ అనుమతించరాదని చంద్రచూడ్ స్పష్టం చేశారు. ఈ ఎన్‌ఆర్‌ఐ కోటా వ్యాపారాన్ని తక్షణమే నిలుపుచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని బెంచ్ సూచించింది.

20 నామినేటెడ్ పోస్టులు భర్తీ

- 16 టిడిపి, మూడు జనసేన, ఒకటి బిజెపికి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి కూటమి ప్రభుత్వం మంగళవారం 20 కార్పొరేషన్లకు నామినేటెడ్ ఛైర్మన్లు, మెంబర్లను ప్రకటించింది. ఈ జాబితాలో 16 టిడిపికి, మూడు జనసేనకు, ఒకటి బిజెపికి ఛైర్మన్ పోస్టులు దక్కాయి. వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఎపి ఛైర్మన్‌గా (శాప్) అనిమిని రవినాయుడు, ఎపి హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా బత్తుల తాత్యబాబు, ఎపి షెడ్యూల్డ్ తెగల సహకార ఆర్థిక సహకారం (ఎపి ట్రైకార్) బొరగం శ్రీనివాసులు, ఎపి మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా దామచర్ల సత్య, సీడ్ ఎపి (ఉపాధి కల్పన అండ్ ఎంటర్ ప్రైజ్ డెవలప్‌మెంట్ సొసైటీ) దీపక్‌రెడ్డి, 20 సూత్రాల పాయింట్ ఫార్ములా ఛైర్మన్ లంకా దినకర్ (బిజెపి), ఎపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా కర్రోతు బంగార్రాజు, ఎపి స్టేట్స్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా మన్నె సుబ్బారెడ్డి, పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి సంస్థకు నందం అబద్దయ్య, ఎపి టూరిజం డెవలపమెంట్ కార్పొరేషన్‌కు నూకసాని బాలాజి, ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్‌గా కొనకళ్లనారాయణ, వైస్ ఛైర్మన్‌గా పిఎస్ మునిరత్నం, ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పీలా గోవింద సత్యనారాయణ, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పిల్లి మాణిక్యాలరావు, ఎపి రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలికి పీతల సుజాత, ఎపి మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు తమ్మిరెడ్డి శివశంకర్ (జనసేన), రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్‌కు తోట మెహర్ సుధీర్ (జనసేన), ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎపిటిపిసి) వజ్జాసుబ్బారావు, ఎపి టౌన్ షిప్ మౌలిక సదుపా యాల అభివృద్ధి కార్పొరేషన్ (ఎపి టిడ్కో) ఛైర్మన్‌గా వేములపాటి అజయ్‌కుమార్ (జనసేన)లను నియమించారు. రెండో లిస్ట్ ఈ నెల 25, 26న వెలువడే అవకాశముంది.

ఆదాయం లేని నీటి సరఫరా రద్దు

- కేంద్రం ఆదేశాలతో పట్టణాల్లో రాష్ట్రం కసరత్తు
- కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో ఆదాయంలేని నీటి సరఫరాను తగ్గించాలని, దీనికి వీలుగా ప్రతి చోటా కనీసం రెండు వేల ట్యాపులు పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) పథకంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మూడేళ్లపాటు కొనసాగే ఈ కమిటీలో విదేశీ నిపుణుడిని కూడా నియమించనున్నారు. నగరాల్లో నీటి వనరులు, సరఫరా అవకాశాలపై క్షేత్రస్థాయిలో కమిటీ పరిశీలిస్తుంది. ఆదాయం లేని నీటి సరఫరాను తగ్గించేందుకు అవసరమైన విధివిధానాను రూపొందిస్తుంది. అన్ని నగరాల్లోనూ అదాయంలేని నీటి సరఫరాను తగ్గించేందుకు (100 శాతం కుళాయిలు, మీటర్లు) అవసరమైన ప్రణాళికను కమిటీ రూపొందించనుంది. ఈ కమిటీకి ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఛైర్‌పర్సన్‌గా ఉండనున్నారు.

పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ కో ఛైర్మన్‌గా, పబ్లిక్ హెల్త్ ఇఎన్‌సి కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మెంబరు సెక్రటరీగా వ్యవహరించనున్నారు. విజయవాడ, విశాఖ కార్పొరేషన్ల చీఫ్ ఇంజనీర్లతో పాటు ఐఐటి తిరుపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ నరసమ్మ, ఎపియుఐఎఎంఎల్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్, పిపిపి ఎక్స్‌పర్ట్ షాలేమురాజు, ఎన్‌సిపిఇ లిమిటెడ్ ఎమ్‌డి డాక్టర్ ఎస్‌ఎం సుభానీ సభ్యులుగా ఉండనున్నారు. వీరిని కమిటీ నామినేట్ చేసుకునే అవకాశం కల్పించారు.

ఉచిత ఇసుక హామీ తక్షణ అమలు కోసం 4న రాష్ట్రవ్యాపితంగా ఆందోళన

- సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇసుకను ఉచితంగా ఇస్తామంటూ ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలని కోరుతూ అక్టోబర్ 4వ తేది రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. సెప్టెంబర్ 23, 24 తేదీలలో విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశం ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించింది. దీనిలో భాగంగా ఇసుకపై చేసిన తీర్మానానికి సంబంధించిన అంశాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక లభించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, అందరికీ ఇసుక అందుబాటులోకి తేవాలని, అవినీతిని అరికట్టి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. వీటి సాధన కోసం అక్టోబర్ 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు దీక్షలు ప్రదర్శనల రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రజలకు సిపిఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. భవన నిర్మాణాలు చేసుకునే వారిపై అధిక భారం లేకుండా చూడాలనీ తీర్మానంలో కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతి వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందని పేర్కొన్నారు. అనేక కారణాలతో పాటు ఇసుక సమస్యపై ఆగ్రహంతో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించారని, ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. వందరోజుల పాలనలో ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందని పేర్కొన్నారు. అనేకచోట్ల ఇసుక లభించడం లేదని, రవాణా ఛార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేట్లు తగ్గించలేదని తెలిపారు. కొన్నిచోట్ల మరింత పెరిగాయని, ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నదని, ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు పలుచోట్ల ఇసుకపై పెత్తనం చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పదేపదే బహిరంగంగా హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రాలేదని తెలిపారు. ఇసుక కొరత, అధిక రేట్ల వల్ల భవన నిర్మాణరంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కొరవడుతోందని, ఇళ్ల నిర్మాణాలు చేసుకునే చిన్న, మధ్యతరగతి వర్గాలపై భారం పడుతుందని వివరించారు. ఇసుక ఆన్లైన్ విధానం ప్రవేశపెడుతున్నామని ప్రకటించించినా ప్రభుత్వ ప్రకటనలకు, హామీలకు, ఆచరణకు పొంతనలేదని, ధరల్లో తీవ్ర వ్యత్యాసం కనబడుతోందని తెలిపారు.

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సిట్ చీఫ్‌గా సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



తిరుమల లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు అవశేషాలు వున్నాయని ఏకంగా సిఎం చంద్రబాబు నాయుడే ఇటీవల ప్రకటన చేయడంతో ఈ అంశంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. టిటిడి తయారు చేసే లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీలో కల్తీపై విచారణకు ప్రత్యేక విచారణ బృందం (సిట్)ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిట్ చీఫ్‌గా గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠిని నియమించింది. అలాగే సిట్‌లో విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్‌జెట్టి, కడప ఎస్‌పి హర్షవర్ధన్‌తో పాటు మరికొందరు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు సభ్యులుగా వుండనున్నారు.

పౌరసేవలు సులభతరం

- ఆర్‌టిజిఎస్ ద్వారా మెరుగైన సేవలు
- పాలనలో వేగంపై అధికారులతో సిఎం చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఆర్‌టిజిఎస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజలకు సత్వర సేవలు అందించడానికి ఆర్‌టిజిఎస్ (రియల్ టైమ్ గవర్నన్సె సొసైటీ)ను అన్ని శాఖలు సమర్ధవంతంగా వినియోగించు కోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు . మంగళవారం ఉదయం ఆయన రాష్ట్ర సచివాలయంలోని ఒకటో బ్లాక్‌లో ఉన్న ఆర్‌టిజిఎస్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సిఎస్, డిజిపి సహా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.పాలనలో వేగం పెంచడం కోసం ఆర్‌టిజిఎస్‌ను ఉపయోగించు కోవడంపై సమీక్షించారు ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ అధార్, స్కూల్ అడ్మిషన్ డేటా, రేషన్‌కార్డుల్లో పేర్ల నమోదు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్ల వంటి కార్యక్రమాలు ప్రజలకు ఆటోమేటిక్‌గా అందేలా విధానాలు రూపొందించాలని సూచించారు. పారిశుధ్యం, ట్రాఫిక్, ప్రమాదాలు, నేరాలు, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పంటకాలువల నిర్వహణ, అగ్రికల్చర్, వరదలు, భారీ వర్షాలు, విపత్తులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలోల రియల్‌టైం గవర్నెన్స్ ద్వారా ఎలా పనిచేయాలనే అంశంపైనా ప్రణాళిక రూపొందించాలని అన్నారు.. సిసి టివి కెమెరాలు, డ్రోన్లు వంటి వాటి ద్వారా డేటా విశ్లేషణ, ప్రభుత్వ సేవలు అందజేత, రియల్‌టైమ్‌లో సమస్యలపై ప్రభుత్వం స్పందించే విధానం అందుబాటులోకి వస్తే ప్రజలకు సత్వర సాయం అందుతుందని సిఎం అభిప్రాయపడ్డారు. రియల్ టైం గవర్నెన్స్ ద్వారా పౌరసేవలు, ప్రభుత్వ కార్యక్రమాలు చేటప్టడంపై 100 రోజుల్లో ప్రత్యేక ప్రాజెక్టు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

సెకీ ఒప్పందం ఉన్నా కొత్తగా సోలార్ ప్లాంట్లు

- త్వరలో 3,750 మె.వాకు టెండర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం గత ప్రభుత్వం సెకీ నుంచి అదానీ నుండి విద్యుత్ తీసుకునేందుకు ఒప్పందం చేసుకుంది. పాత ఒప్పందం ప్రకారం ఈ నెల రావాల్సిన ఈ విద్యుత్ వచ్చే ఏడాది నుంచి జనవరి నుంచి అందనుంది. ఆ ఒప్పందం అలా ఉండగానే ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం మరో 3,750 మెగావాట్ల కు ప్రైవేట్ సోలార్ పెట్టుబడీదారుల నుంచి విద్యుత్ తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ విషయం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కేంద్రప్రభుత్వం పథకం పిఎం సూర్యఘర్ ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకంలో భాగంగా అవసరమైన చోట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు.

దీనికి సంబంధించిన టెండర్లను అన్ని డిస్కంల తరపున ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిసిపిడిసిఎల్) సిద్ధం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 3,750 మెగావాట్ల విద్యుత్‌కు టెండర్లు పిలవాలని విద్యుత్‌శాఖ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సుమారు 6,600 వ్యవసాయ ఫీడర్లు, 19లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్‌శాఖ ప్రస్తుతం రూపొందిస్తున్న క్లీన్ ఎనర్జీ ముసాయిదాకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిన తరువాత ఈ దిశలో చర్యలు తీసుకోనున్నారు. ఈ ముసాయిదాలో సోలార్, విండ్ వంటి ప్రైవేటు ఉత్పత్తి సంస్థలకు ప్రోత్సాహకాలు, రాయితీలు, భూముల కేటాయింపు ఎలా చేయాలనే అంశాలను పొందుపరచనున్నారు.

సెకీ సంగతేంటి?

వ్యవసాయ విద్యుత్ కోసం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) నుంచి వచ్చే విద్యుత్‌ను ఏం చేయాలనేది ఇంకా తేలలేదు. గత వైసిపి ప్రభుత్వం సెకీ నుంచి 7వేల మెగావాట్ల విద్యుత్‌ను తీసుకొనేందుకు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. అదానీ రెన్యూబల్ ఎనర్జీ నుంచి సెకీకి అందించే ఈ విద్యుత్‌ను రాష్ట్ర డిస్కంలకు అందించేలా త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. పాతికేళ్ల పాటు యూనిట్ రూ.2.49లకు ఈ విద్యుత్ అందించాలనేది ఒప్పందం. ఈ ఒప్పందం ప్రకారం ఈ నెల నుంచి 3వేల మెగావాట్లు సరఫరా కావాల్సి ఉంది. 2025లో మరో 3వేల మెగావాట్లు, 2026లో మరో వెయ్యి మెగావాట్ల చొప్పున డిస్కంలకు అందాలి. అయితే రాజస్థాన్, గుజరాత్‌లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానించే ప్రక్రియ పూర్తికాలేదు. దీంతో ఈ నెల రావాల్సిన విద్యుత్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి అందిస్తామని సెకీ డిస్కంలకు తెలిపింది. 3వేలకు బదులు వెయ్యి మెగావాట్లే అంది స్తామని చెప్పింది. 2026లో 3వేలు, మిగతా 7లో



శ్రీలంక ప్రధానిగా హరిణి అమరసూర్య

- 24 ఏళ్ల తర్వాత మహిళకు పట్టం

కొలంబో : శ్రీలంక కొత్త ప్రధానిగా హరిణి అమరసూర్య (54) మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలి ప్రధాని సిరిమావో బండారు నాయకె తర్వాత 24ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం మళ్లీ ప్రధాని పదవిని ఒక మహిళ చేపట్టారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాజీనామా చేసిన ప్రధాని దినేష్ గుణవర్ధనె స్థానంలో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) నాయకురాలైన హరిణితో అధ్యక్షుడు దిసనాయకె ప్రమాణ మిగతా 7లో

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదం

- ఎస్‌ఎంఎస్-1లో ఒలికిన లిక్విడ్ మెటల్
- ఉద్యోగికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



తీవ్రంగా గాయపడ్డ మల్లేశ్వరరావు

స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఎంఎస్ - 1 ల్యాడిల్ ప్రిపరేషన్ బే ప్రాంతంలో కదులుతున్న స్టీల్ ట్రాన్స్‌పర్ కారు నుంచి లిక్విడ్ స్టీల్ మెటల్ బయటకు ఒలికిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న డిపార్టుమెంట్ సీనియర్ మేనేజర్ (ఆపరేషన్స్) సిహెచ్.మల్లేశ్వరరావుపై ఆ లిక్విడ్ పడటంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆయన శరీరం మొత్తం కాలిపోవడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. 90 శాతం గాయాలవ్వడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఏడాది క్రితం ఇదే ప్రాంతంలో శ్రీనివాస్ అనే కార్మికుడూ గాయపడ్డారు. 19 రోజులపాటు మృత్యువుతో పోరాడి పరిస్థితి విషమించి ఆయన ప్రాణాలు విడిచారు. అప్పట్లోనే భద్రతపై ఉక్కు కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. కొంత కాలంగా స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులు, ఉద్యోగుల సంఖ్య తగ్గడం, భద్రతా ప్రమాణాలు కొరవడడం వంటి కారణాలతో ప్రమాదాలు పెరుగుతున్నాయని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి తెలిపారు. ఇప్పటికైనా ప్లాంట్‌లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలని, సేఫ్టీపై నిఘా పెంచాలని డిమాండ్ చేశారు.

వైసిపికి మరో షాక్

- రాజ్యసభ సభ్యత్వానికి ఆర్ కృష్ణయ్య రాజీనామా

7

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ తొలగింపు

- న్యాయ పోరాటం చేస్తా : గజ్జల లక్ష్మి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి నుండి గజ్జల లక్ష్మిని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా కమిషన్ ఛైర్మన్ పదవీకాలం గత నెలతోనే ముగిసిందంటూ ప్రభుత్వం మెమో ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ తీరును మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గజ్జల లక్ష్మి తప్పుపట్టారు. తనకు పదవీకాలం 2026 మార్చి 15 వరకు వున్నా అక్రమంగా, అర్థాంతరంగా తొలగించారని, రాష్ట్ర ప్రభుత్వంపై న్యాయ పోరాటం చేస్తానని ఈ మేరకు మంగళవారం ఆమె మీడియాకు తెలిపారు.

వేర్వేరు కంపెనీలకు 50 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వేర్వేరు కంపెనీలకు 50 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్ యువరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 50 ఎకరాలకు సంబంధించి 203 ప్లాట్లలో 198 ప్లాట్లను నేరుగా కేటాయించారు. రెండు ఈ వేలం ద్వారా కేటాయింపులు జరిపారు. మూడు ప్లాట్లను అద్దె పద్ధతిలో ఇచ్చినట్లు అందులో పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

చింతల్ నార్ అడవుల్లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని చింతల్‌నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతవాగు నది ఒడ్డున ఉన్న అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌నార్ పోలీస్ స్టేషన్ క్యాంప్ ముకరం నుంచి డిస్ట్రిక్ట్ ఫోర్స్, డిఆర్‌జి, బస్తర్ ఫైటర్, 206 కోబ్రా వాహిని సంయుక్తంగా.. మావోయిస్టు పార్టీ వ్యతిరేక ఆపరేషన్ కోసం కర్కన్‌గూడ పరిసర ప్రాంతాలకు వెళ్లారు. చింతవాగు నది ఒడ్డున ఉన్న అడవిలో తారసపడిన మావోయిస్టులకు పోలీసులకు మధ్య సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందగా, సంఘటనాస్థలంలో భారీ మొత్తంలో మావోయిస్టు డంప్‌ను పోలీసులు గుర్తించారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి-కడప అర్బన్

వైఎస్‌ఆర్ జిల్లా మైదుకూరులో తొమ్మిదేళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.నాలుగు లక్షల జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు రెండవ ఎడిజె కోర్టు జడ్జి జిఎస్ రమేష్ కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల మేరకు.. ఆస్తి వివాదం నేపథ్యంలో కడపలోని లక్ష్మి భవన్ హోటల్ యజమాని ముద్దంశెట్టి వెంకటసుబ్బయ్య (63)ను ఆయన చిన్న కుమారుడు శివప్రసాద్, పెద్ద కోడలు సుప్రజ, ఆమె సోదరుడు మైలారం జగన్నాథ్ కలిసి 2014లో హతమార్చారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ప్రత్యేక హోదా పిటిషన్లపై కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి :

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లలో తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇదే తరహాలో గతంలో దాఖలైన పిటిషన్లతో ఈ పిటిషన్‌ను జతచేసి ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని రిజిస్ట్రీని డివిజన్ బెంచ్ ఆదేశించింది. విచారణను అక్టోబరుకు వాయిదా వేసింది. లోక్‌సభలో నాటి ప్రధాని ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ వేసిన పిల్‌ను జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. చట్ట సభలో ఇచ్చిన హామీకే దిక్కులేకపోతే ఎలాగని, ఎంపిలు, ఎమ్మెల్యేలు ఇస్తున్న హామీలు అమలు కావడం లేదని పాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

భూములు ఇచ్చాక ఉపాధి ఎలా ఉంది?

రాజధాని రైతులను ప్రశ్నించిన ప్రపంచబ్యాంకు బృందం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'రాజధానిలో భూములు ఇచ్చిన తరువాత మీ ఉపాధి ఎలా ఉంది ? ప్రభుత్వం ఇచ్చే కౌలు సరిపోతుందా ? భూమిలేనివారు ఇప్పుడేమి చేస్తున్నారు ? ముంపు ప్రాంతమని తెలిసింది ? ఇటీవల కురిసిన వర్షాలకు వరద వచ్చిందన్నారు ఏమైంది ? 'అంటూ ప్రపంచబ్యాంకు ప్రతినిధులు రైతులను ప్రశ్నించారు. రూ.15 వేల కోట్ల నిధుల కేటాయింపులో భాగంగా అమరావతి రాజధాని పరిధిలో రైతులతో ప్రపంచబ్యాంకు బృందం ప్రతినిధులు మంగళవారం భేటీ అయ్యారు. తొలిసారి పెద్దరైతులతో చర్చించిన అనంతరం రెండోసారి దళిత రైతులతోపాటు, అమరావతి జెఎసి నాయకత్వంతోనూ సమావేశమైంది. తుళ్లూరు సిఆర్‌డిఏ కార్యాలయంలో సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో అమరావతికి సంబంధించి పలు కీలక అంశాలపై ప్రపంచబ్యాంకు ప్రతినిధులు రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అయితే సమావేశానికి ఎంపిక చేసిన వారినే ఆహ్వానించారు. 10 మందితో కూడిన ప్రపంచబ్యాంకు బృందంలో ముగ్గురు తెలుగు వారు కూడా ఉన్నారు. బృందం ప్రశ్నలకు రైతులు కూడా వారికి తెలిసిన సమాచారాన్ని తెలిపారు. వరదపై అడిగిన ప్రశ్నలకు ఎన్నడూ లేనంత వర్షం కురవడంతో పాటు అక్కడక్కడ అడ్డుకట్టలు పడటంతో నీరు నిలిచిందని, అయితే వెంటనే బయటకు వెళ్లిపోయిందని రైతులు జవాబు ఇచ్చారు. పాలవాగు, కొట్టేళ్లవాగులో తూటుకాడ, గుర్రపుడెక్కను తొలగిస్తే నీటి ప్రవాహం సవ్యంగా సాగిందని వివరించారు. తొలుత ఇచ్చిన మాస్టర్‌ప్లాను ప్రకారం కాలువలు నిర్మించి ఉండే ఈ సమస్య ఉండేది కాదని తెలిపారు. భూమి, ఉపాధి తదితర ప్రశ్నలకు జవాబిస్తూ పొలాలు ఇచ్చిన తరువాత ఉపాధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో శిక్షణ ఇప్పించారని, దీనివల్ల కొంత ఉపాధి దొరుకుతోందని చెప్పారు. కుటీర పరిశ్రమలకు ప్రభుత్వం కూడా రుణం ఇస్తామందని, చదువకున్న వారికైతే రూ.25 లక్షల వరకూ ఇస్తామన్నారని ప్రపంచబ్యాంకు ప్రతినిధులకు తెలిపారు. అలాగే తమకు పట్టా భూముల రైతులతో కౌలు ఇచ్చారని, అందులో లోపాలు జరిగాయని గత ఐదేళ్లలో విచారణకు ఆదేశించడంతో కొంత కౌలు నిలిపేశారని వివరించారు. అయితే రైతులకు ఇచ్చిన చోటే తమకూ భూములను లాటరీ పద్ధతిలో కేటాయించారని స్పష్టం చేశారు. ఇక్కడ ఎకరం అమ్ముకుంటే బయట ప్రాంతాల్లో రెండు నుండి మూడు ఎకరాలు కొనుగోలు చేసుకున్నామని వివరించారు. అభివృద్ధి చెందిన తరువాత కొంత ధర పెరిగిందనీ చెప్పారు. ఈ సారి తెలుగు ప్రతినిధులు కూడా ఉండటంతో క్షేత్రస్థాయికి సంబంధించిన అంశాలనే ఎక్కువగా ప్రస్తావించారు. వీటిల్లో జీవనం, ఉపాధి కోసం ఏమిచేస్తున్నారనే విషయాలను ఎక్కువగా అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని పనులూ నిలిపేయడంతోపాటూ అనేక ఇబ్బందులకు గురిచేసిందని పేర్కొన్నారు. రైతులపై ఎక్కడికక్కడ కేసులు పెట్టి వేధించడంతో తాము అనివార్యంగా జెఎసి ఏర్పాటు చేసుకున్నామని, దీనిలో వేర్వేరు కమిటీలు పెట్టుకుని కేసులు, ఆర్థిక అంశాలను సవ్యంగా నెరవేర్చుకున్నామని చెప్పారు. హైకోర్టులోనూ పెద్దఎత్తున కేసులు దాఖలు చేశామని, వాటిల్లో ఎక్కువ శాతం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతులకు అనుకూలంగా తీర్పులు వచ్చాయని చెప్పారు. మూడు రాజధానుల ప్రకటన ఇక్కడ రైతుల్లో ఆందోళనను కలిగిందని పేర్కొన్నారు. రైతు ప్రతినిధుల తరుపున నీరుకొండ రైతు మాదల వాసు ప్రపంచబ్యాంకు బృందానికి అన్ని వివరాలూ తెలిపారు. చర్చ జరుగుతుండగానే జెఎసి ప్రతినిధులు వారు చెప్పాల్సింది చెప్పి బయటకు వచ్చేయగా అక్కడే ఉన్న కొంతమంది రైతులతో ప్రపంచబ్యాంకు బృందం సభ్యులు వేర్వేరుగా మాట్లాడారు. సిఆర్‌డిఏ అదనపు కమిషనర్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కారుణ్య నియామకాలపై ఉపముఖ్యమంత్రి ఆరా..



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్ సంస్థల్లో పనిచేసే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉద్యోగులు, వాటి పరిధిలో ఉండే ఉపాధ్యాయులు మరణిస్తే వారి వారసులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలిచ్చే ప్రక్రియపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా నియామకాల్లో జాప్యం, నిబంధనలపై వివరాలు అధికారుల నుంచి తీసుకున్నారు. మరణించిన ఉద్యోగులు పంచాయతీరాజ్ సంస్థల పరిధిలో ఉండటంతో వారి వారసులకు అదే సంస్థలో నియమించాల్సి ఉంటుందని, ఖాళీలు తక్కువగా ఉండటంతో కారుణ్య నియామకాలు ఆలస్యం అవుతున్నాయని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పిఆర్ సంస్థల్లో కారుణ్య నియామకాల జాబితాలో వేచి చూస్తున్న వారికి జిల్లా కలెక్టరు కామన్ పూల్‌లో ఉన్న ఖాళీల్లో అవకాశం కల్పించే అంశంపై చర్చించారు. ఈ దిశగా నియామకాలు చేపట్టే అంశంపై సాధారణ పరిపాలన శాఖతో చర్చించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనరుకు డిప్యూటీ సిఎం దిశా నిర్దేశం చేశారు.



కేసు కొట్టివేత అనంతరం సిపిఎం, సిఐటియు నాయకులు

గంగవరం పోర్టు కార్మికులపై అక్రమ కేసు కొట్టివేత

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అదానీ గంగవరం పోర్టు కార్మికులపై పెట్టిన అక్రమ కేసును విశాఖ జిల్లా 8వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు మంగళవారం కొట్టివేసింది. గంగవరం పోర్టు నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, సంస్థలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలని, అక్రమంగా తొలగించిన యూనియన్ నాయకులను విధుల్లోకి తీసుకోవాలని, కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన 2016 డిసెంబర్ 9న పోర్టు వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్మికుల పోరాటానికి సిపిఎం, సిఐటియు నాయకులు అండగా నిలిచారు. ఆందోళనకారులపై అప్పటి టిడిపి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయించింది. సిపిఎం జిల్లా నాయకులు ఎం.జగ్గునాయుడు, డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, సిఐటియు జిల్లా నాయకులు కెఎం.శ్రీనివాసరావు, ఎస్.రామారావు, ఎస్.జ్యోతీశ్వరరావు, బి.ఢిల్లీరావు, గంగవరం పోర్టు యూనియన్ నాయకులు కారి అప్పారావు, కె.భూలోక, కె.మహేష్ సహా 18 మందిపై 2017లో తప్పుడు కేసులు బనాయించింది. కేసు పూర్వాపరాల పరిశీలన, వాదప్రతివాదనల అనంతరం 8వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఈ కేసును కొట్టివేశారు. కార్మికుల తరపున ఈ కేసును ప్రముఖ న్యాయవాది జి.సీతామహాలక్ష్మి వాదించారు. ఇప్పటికైనా అదానీ గంగవరం పోర్టు కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఇతర నేతలు డిమాండ్ చేశారు. మిగిలిన అక్రమ కేసులనూ ఎత్తివేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

దేశ రాజకీయాల్లో ఆణిముత్యం సీతారాం

- ఏచూరి సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సంతాప సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, వేదికపై లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యార్థి దశ నుంచి అస్తమించే వరకు ఎత్తిన ఎర్రజెండాను దించకుండా ప్రజా సమస్యలపై పోరాడిన ధీరోదాత్తుడు సీతారాం ఏచూరి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభను గుంటూరు జిల్లా సిపిఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సభకు సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డబ్బు సంపాదన కోసమే రాజకీయాల్లోకి వస్తున్న నేతలు ఉన్న ఈ రోజుల్లో జీవితాంతం నిరాడంబరంగా ఉంటూ ప్రజా పోరాటాలకు ప్రాధాన్యత ఇచ్చిన ఏచూరి లాంటి ఆణిముత్యాలు రాజకీయాల్లో అత్యంత అరుదు అని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఆయన తన చివరి ప్రసంగంలో కూడా తనకు కులాలు, మతాలు లేవని, తన కుమారుడు కేవలం భారతీయుడు మాత్రమేనని గట్టిగా చెప్పారన్నారు.

దేశంలో గత పదేళ్లుగా మతతత్వ ధోరణలను పెంచి పోషిస్తున్న పాలకులకు ధీటుగా లౌకిక వాద శక్తులను కూడగట్టడంలో సీతారాం ఏచూరి కీలక భూమిక పోషించారని కొనియాడారు. అన్ని మతాలు కలిసి ఉండాలని, ప్రజాస్వామ్యం బలపడాలని కోరుకున్న మహానేత ఏచూరి అని అన్నారు. తాజాగా కేంద్రం ప్రతిపాదించిన జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికి దెబ్బతగులుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన అనివార్యం అయిన తరువాత విభజన చట్టంలో రాష్ట్ర ప్రజల తరుపున పార్లమెంటులో పోరాడిన వ్యక్తి కూడా ఏచూరియేనని తెలిపారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ప్రసంగిస్తూ... 1977 నుంచి 2024 మధ్య భారత రాజకీయాలలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు.

కామన్ మినిమమ్ ప్రోగ్రాం రూపకల్పనలో కీలక భూమిక పోషించి 2004లో యుపిఎ-1 ప్రభుత్వంలో ప్రజలకు తోడ్పడే అనేక చట్టాల రూపకల్పనకు కృషి చేశారన్నారు. ఉపాధి హామీ, అటవీ హక్కుల పరిరక్షణ, ఆర్‌టిఐ, ఆహార భద్రత, విద్యా హక్కు చట్టాల రూపకల్పనలో ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ సభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జనచైతన్యవేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, విరసం అధ్యక్షులు సిఎస్ఆర్ ప్రసాద్, ప్రజాగాయకుడు రమణ తదితరులు ప్రసంగించారు.

కౌలు రైతుల నష్టపరిహారం విషయంలో సిఎం ఆదేశాలను అధికారులు అమలు చేయాలి

- నష్టపరిహారం, బీమా కౌలు రైతులకే ఇవ్వాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరదల్లో నష్టపోయిన కౌలు రైతులకే పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను అధికారులు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. మంగళవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు పంట నష్ట పరిహారాల్లో ఇ-క్రాప్, వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పేర్లను నమోదు చేయాలని ఆదేశాలు ఇస్తే వాటిని స్వాగతించామని తెలిపారు. అయితే తమ సంఘాలు వరద ప్రాంతాల్లో సర్వే చేయగా, అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. కృష్ణాలోని ఆముదాలపల్లి గ్రామంలో 550 ఎకరాల ఆయకట్టు ఉంటే దానిలో 480 ఎకరాల్లో పంట నష్టపోయిందని పేర్కొన్నారు. 350 మంది రైతులు ఉన్నారని, సిసిఆర్‌సి కార్డులు 40 మందికి మాత్రమే వచ్చాయని తెలిపారు. భూ యజమాని కాకుండా, సిసిఆర్‌సి కార్డు లేకుండా ఇ-క్రాప్‌లో గానీ, నష్టపరిహారాల్లో గానీ వాస్తవ సాగుదారుడి పేరు ఒక్కటంటే ఒక్కటి కూడా లేదని తెలిపారు. కౌలు రైతులు అడిగితే యజమాని అనుమతి లేకుండా రాయొద్దని ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారని వివరించారు. అలాగే కొయ్యగూరపాడు, అరిపిరాల, ఆరుగోలను గ్రామాల్లోనే ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. ఒక గ్రామంలో రైతు ఉండడని, ఆయన విజయవాడలో వ్యాపారం చేసుకుంటూ ఉంటే ఆయన పేరుతో పరిహారం రాశారని తెలిపారు. చేదుర్తిపాడులో మొత్తం కౌలు రైతులే ఉన్నారని, ఒక్కరి పేరు కూడా ఇ-క్రాప్‌లో నమోదు కాలేదని పేర్కొన్నారు. పెదపారుపూడి మండలం మోపర్రులోనూ దెబ్బతిందని అక్కడ కూడా కౌలు రైతుల పేరుతో పరిహారం రాయలేదని పేర్కొన్నారు. ఇక్కడ 20 ఎకరాలు కౌలుకిచ్చిన యజమాని పరిహారం తన పేరుతో రాయించుకుంటున్నాడని అన్నారు. అలాగే బాపట్ల, గుంటూరు, ఎన్‌టిఆర్, పశ్చిమగోదావరి, కాకినాడ జిల్లాల్లో నిర్వహించిన సర్వేలో ఇలాంటి అంశాలే వెలుగులోకి వచ్చాయని వివరించారు. దీంతోపాటు పంట నష్టపరిహారం పెంచాలని కోరారు. కంద, అరటి, తమలపాకుల తోటలకూ ఇప్పుడు ప్రకటించిన పరిహారం సరిపోదని తెలిపారు. ప్రభుత్వ అధికారులు స్పందించి సిఎం ఆదేశాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

వారాంతపు సెలవులివ్వాలి

- ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లోకో పైలెట్లకు తప్పనిసరిగా వారాంతపు సెలవులు మంజూరు చేయాలని, రన్నింగ్ కార్మికులకు 8 గంటలు పని వేళలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్లతో ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ) డిమాండ్ చేసింది. విజయవాడ డివిజనల్ మేనేజరు (డిఆర్ఎం) కార్యాలయం ఎదుట ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్ నరసింహులు, విజయవాడ డివిజనల్ అధ్యక్షులు ఎం వెంకటేశన్, ఎజిఎస్ జి వెంకటేశ్వర్లు, డివిజనల్ సెక్రటరీ కె రామకృష్ణ, ఎజిఎస్ వైఎన్ బాబు, విజయవాడ బ్రాంచ్ ఛైర్మన్ రవిరాజ, కమిటీ సభ్యులు ఎ శివకుమార్ మాట్లాడుతూ.. రాత్రిపూట విధులు వరుసగా రెండు రాత్రులకు మాత్రమే పరిమితం చేయాలని, హెడ్ క్వార్టర్స్ నుంచి దూరంగా ఉండే సమయాన్ని 48 గంటలకు కుదించాలని డిమాండ్ చేశారు. రైల్వేలో దీర్ఘకాలంగా ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని నేతలు పేర్కొన్నారు. విజయవాడ డివిజన్‌లో అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న రైల్వే కార్మికులకు మానవత్వం మరిచి సిక్ మెమో కూడా ఇవ్వడం లేదని, ఫలితంగా లోక్ పైలెట్ల కార్మికులు, కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నేతలు అందజేశారు.



సచివాలయంలో మంత్రుల సబ్‌కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

వరద బాధితులకు నేడు పరిహారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు తీవ్రంగా నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పరిహారం విడుదల చేయనుంది. విజయవాడ కలెక్టరేట్ నుంచి సిఎం చంద్రబాబు పరిహారాన్ని నేరుగా బాధితుల ఖాతాల్లోకి జమచేయనున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, బుడమేరు వరదలకు విజయవాడలో పలు ప్రాంతాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 16 జిల్లాల్లో ఆస్తులకు, పంటలకు నష్టం వాటిల్లింది. నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందజేయడానికి ప్రభుత్వం ఎన్యూమరేషన్ పూర్తి చేసింది. అర్హులైన బాధితులందరికీ నేరుగా వారి ఖాతాల్లోనే ప్రభుత్వం పరిహారం నగదును జమ చేయనుంది. వరదల్లో నష్టపోయిన వాహనాలకు బీమా చెల్లింపు కార్యక్రమం కూడా ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు.

శ్రీలంకలో విజయం వామపక్షాలకు శుభపరిణామం : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

శ్రీలంకలో ఎర్రజెండా రెపరెపలు వామపక్ష పార్టీలకు శుభపరిణామమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. దేశంలో వామపక్ష శక్తులను అంతమొందిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు ఆక్షేపనీయమని, వ్యక్తులను తుదముట్టించవచ్చేమో గాని, రాజకీయ సైద్ధాంతిక వ్యవస్థను నాశనం చేయడం ఎవరి తరం కాదన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్యభవన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోపాలను ఎత్తి చూపినందుకు వామపక్ష తీవ్రవాద ముద్ర వేసి అంతమొందిస్తామని అమిత్ షా చెప్పడం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేయడమే నన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు మాట్లాడుతూ గతంలో 14 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు హంద్రీనీవా ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని.. నేటికీ శ్రీశైలం నుండి పోతిరెడ్డిపాడు ద్వారా ఎందుకు నీరు వదలడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నగర కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు ఐక్య పోరాటాలు



ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1321వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎస్ఎంఎస్ - 2 తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రానున్న రెండు నెలలూ ఉద్యమాలను ఉధృతం చేయనున్నామన్నారు. ఉక్కు కర్మాగార సంక్షోభానికి కేంద్ర బిజెపి విధానాలే కారణమని తెలిపారు. ప్లాంట్‌కు నిధులు కేటాయించి సంక్షోభం నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. కర్మాగారం వల్ల లక్షలాది మంది బతుకుతున్నారని, ప్రయివేటీకరణ చేయడం దారుణమని అన్నారు. దీక్షల్లో నాయకులు కడిమి రాజబాబు, జె నరేష్ కుమార్, చీకటి శ్రీనివాస్, జగదీష్, కరణం పైడిరాజు, వరప్రసాద్, సతీష్, ఇందల శివ కుమార్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సనాతన ధర్మం జోలికి రావద్దు

- పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో అపవిత్రం జరిగితే వైసిపి నాయకులు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. జగన్ నియమించిన టిటిడి బోర్డులో తప్పు జరిగిందని ల్యాబ్ రిపోర్టులతో సహా విషయం బయటకు వచ్చినా దబాయించడం వైసిపి నేతలకు అలవాటుగా మారిందన్నారు. పంది కొవ్వు చాలా ఎక్కువ ధర ఉంటుందని, దాన్ని సాధారణ నెయ్యిలో ఎలా కలుపుతారని లడ్డూ అపవిత్రతపై హైకోర్టు మాజీ ఎఎజి పొన్నవోలు సుధాకర్ అవహేళనగా మాట్లాడటం సరికాదన్నారు. సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే హిందువులంతా కలిసికట్టుగా మాట్లాడాలని, మౌనం వహిస్తే అది భవిష్యత్తరాలను నాశనం చేస్తుందని హెచ్చరించారు. ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా మంగళవారం విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆలయం మెట్లను కడిగి శుభ్రం చేశారు. పసుపు రాశారు. దుర్గమ్మ దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడుతూ సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే కచ్చితంగా మాట్లాడతామన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాణాలిచ్చేందుకైనా సిద్ధమని తెలిపారు. సనాతన ధర్మంపై ఇష్టానికి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గతంలో దుర్గగుడిలో వెండి సింహాలు మాయమైన సందర్భంగా ఆ విషయాన్ని అప్పటి వైసిపి నాయకులు అవహేళన చేస్తూ మాట్లాడారని, ఆ వెండి సింహాలతో మేడలు, మిద్దెలు కట్టుకుంటామా అంటూ మాట్లాడడం చాలా బాధ కలిగించిందని తెలిపారు.

పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష ఎందుకు? : వైసిపి

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష ఎందుకు చేశారో చెప్పాలని వైసిపి డిమాండ్ చేసింది. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో వైసిపి నాయకులు పోతిన మహేష్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. పవిత్రమైన తిరుపతి ప్రసాదాన్ని రాజకీయంలోకి సిఎం చంద్రబాబు లాగితే, దానికి వంత పాడేందుకు పవన్‌కల్యాణ్ దీక్ష చేశారని విమర్శించారు. పవన్‌కల్యాణ్‌కు హిందూ ధర్మంపైనే అవగాహన లేదని అన్నారు.

నలుగురు ఐఎఎస్‌లకు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నలుగురు ఐఎఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 1626ను మంగళవారం విడుదల చేసింది. పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎన్ యువరాజ్‌కు పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ డిపార్టుమెంట్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. మార్క్‌ఫెడ్ ఎండిగా పనిచేస్తున్న మనజీర్ జిలానీ సమూన్‌ను సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ప్రస్తుతం అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎండి వీరపాండియన్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగించింది. ఆర్‌అండ్ఆర్ ప్రాజెక్టు, అడ్మినిస్ట్రేటర్ కమిషనరు ఎస్ రామసుందర్‌రెడ్డిని పోలవరం ఇమ్మిగ్రేషన్ ప్రాజెక్టు అదనపు బాధ్యతలు కేటాయించారు. ఏపి ఫైబర్‌నెట్ ఎండిగా పనిచేస్తున్న కె దినేష్‌కుమార్‌కు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సిఇఓగా అదనపు బాధ్యతలు అప్పజెబుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త మద్యం షాపుల నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అక్టోబరు ఒకటి నుంచి అమలులోకి రానున్న నూతన మద్యం పాలసీకి అనుగుణంగా కొత్త మద్యం షాపుల నోటిఫికేషన్ విడుదలకు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ కసరత్తు ముమ్మరం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో 3,736 మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో నడిచేటట్లు కొత్త పాలసీ తయారైన విషయం తెలిసిందే. ఈ షాపుల్లో పదిశాతం షాపులను కల్లుగీత వృత్తిదారులకు రిజర్వేషన్ చేశారు. రిజర్వేషన్ల కోటాలోని మద్యం షాపులను ఎక్కడెక్కడ కేటాయించాలన్న అంశంపై రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ కసరత్తు చేస్తోంది. కల్లుగీత వృత్తి కులాల జనాభా ఏయే జిల్లాల్లో ఏ మేరకు ఉన్నారనే అంశంపై సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు. కల్లుగీత వృత్తి కులాల జనాభా ప్రాతిపదికనే మద్యం షాపులను ఎక్సైజ్‌శాఖ షాపులను రిజర్వు చేయనుంది. రాష్ట్రంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడిపేలా గత ప్రభుత్వం చేసిన చట్టం స్థానంలో దాన్ని సవరించి ఆర్డినెన్స్ తెచ్చేందుకు రాష్ట్ర కేబినెట్ ఇటీవలే ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ ఆర్డినెన్స్ ఆమోదం కోసం సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ వద్దకు పంపనుంది. గవర్నరు నుంచి ఆమోదం రాగానే కొత్త షాపుల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు.

రివర్ కన్జర్వేటివ్ పరిధిలోకి బుడమేరు!

- 'కృష్ణా'కు ఉప నదిగా పేర్కొనే అవకాశాల పరిశీలన
- విజయవాడలో సర్వే పూర్తి



ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

విజయవాడ నగరంలోని 32 డివిజన్లను ముంచెత్తిన బుడమేరును రివర్ కన్జర్వేటివ్ యాక్టు పరిధిలోకి తీసుకొచ్చే అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ చట్ట నిబంధనల ప్రకారం నదీ గర్భంలో ఏ రకమైన కట్టడాలకూ, సాగు చేసుకోవడానికీ అనుమతి ఉండదు. దీని పరిధిలో చేపలు పట్టుకునేందుకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే బుడమేరులో అక్రమణల తొలగింపునకు, భవిష్యత్తులో ఆక్రమణలను నివారించేందుకు ఈ చట్టం ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం దృష్టికి జలవనరుల శాఖ తీసుకెళ్లింది. జలవనరుల శాఖలో పెద్ద వాగుగా మాత్రమే గుర్తించబడిన బుడమేరును రివర్ కన్సర్వేటివ్ యాక్టు పరిధిలోకి తీసుకురావడం కుదరదు. ఈ నేపథ్యంలో కృష్ణా నదికి ఉప నదిగా చూపడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై ఆ శాఖ సర్వే నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా బుడమేరు పరీవాహక ప్రాంతం నుంచి ఏటా వస్తున్న నీటి ప్రవాహంలో కృష్ణా నదికి ఎంత మళ్లించబడుతోందనే అంశంపై అధికారులు సర్వే నిర్వహించారు. దీనిపై నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో బుడమేరుతోపాటు ఉభయగోదావరి జిల్లాల్లోని రామిలేరు, ఎర్ర కాలువ, తమ్మిలేరు, గుండేరు, కొల్లేరు సరస్సు ప్రత్యేక చట్ట పరిధిలో ఉన్నాయి. ఆక్రమణల తొలగింపు, నియంత్రణలో కొల్లేరు సరస్సు కాంటూరు పరిధిలో ఉన్నాయి. రివర్ కన్జర్వేటివ్ యాక్టుతోనే ఎక్కువగా నియంత్రణ చేయవచ్చని జలవనరుల శాఖాధికారులు చెబుతున్నారు.

అక్రమణల తొలగింపా? ప్రత్యామ్నాయ మార్గమా?

బుడమేరు ఆక్రమణలు తొలగించి నగరాన్ని వరదలు ముంచెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై జలవనరుల శాఖ, విజయవాడ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, సర్వే, రెవెన్యూ విభాగాలు సర్వే పూర్తి చేశాయి. విజయవాడ నగర పరిధిలో 8.9 కిలోమీటర్ల మేర బుడమేరు ప్రవహిస్తోంది. దీని వెడల్పు అత్యల్పంగా 90 మీటర్లు, అత్యధికంగా 180 మీటర్లు ఉండాలి. దీని పరిధిలోని మొత్తం 202 ఎకరాల విస్తీర్ణంలో 70 ఎకరాలు అక్రమణలకు గురయ్యాయి. దీనిలో సుమారు మూడు వేల అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు.

దీనికి అదనంగా మధ్యకట్టపై మరికొన్ని నిర్మాణాలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణల తొలగింపునకు తీసుకొచ్చిన హైడ్రా తరహాలో బుడమేరు ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. అయితే, వేలాది కుటుంబాలను తొలగించే క్రమంలో తలెత్తే సమస్యలు తలనొప్పిగా మారతాయని భావించి ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారిస్తోంది. విజయవాడ నగరంలో ఇళ్ల మధ్య నుంచి బుడమేరు ప్రవహిస్తోంది. దీన్ని మళ్లించడానికి తాజాగా గొల్లపూడి ఎత్తిపోతల పథకం కాల్వ, జక్కంపూడిలోని పాముల కాల్వను 30 తూముల వరకు పొడిగించే ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుకు తీసుకొస్తోంది. కృష్ణా జిల్లాలో పెనమలూరు, కంకిపాడు, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, పెదపారుపూడి, నందివాడ మండలాల మీదుగా బుడమేరు ప్రవహించి ఏలూరు జిల్లా కైకలూరులో కొల్లేరు సరస్సులో కలుస్తుంది. అది పొంగిన సమయంలో ఆయా మండలాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. పొలాలు, ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. ముంపు నివారణ చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కట్టలు పటిష్టం చేయడం, ఛానలైజేషన్ చేయడం వంటి వాటిపై నివేదికలు రూపొందిస్తోంది. కొల్లేరు సరస్సును కూడా ఉప్పుటేరు వరకు ఛానలైజేషన్ చేసి అక్కడ రెగ్యులేటర్ నిర్మించి సముద్రంలో కలపాలనే ప్రతిపాదనలు ఎన్నో ఏళ్లుగా ఉన్నాయి. దీనిని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

వరద బాధితులపై దౌర్జన్యం సరికాదు

- కుమ్మరిపాలెం వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటన



కుమ్మరిపాలెం వరద బాధితులతో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు, పక్కన సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ) : వరదలో మునిగిపోయిన కొన్ని ప్రాంతాలను గుర్తించకపోవడం సరికాదని, న్యాయం చేయాలని కోరిన బాధితులపై పోలీసులు దౌర్జన్యం చేయడం శోచనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. దీనికి టిడిపి, బిజెపి కూటమి ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాలన్నారు. వరద బాధితులందరి పేర్లు నమోదు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ కుమ్మరిపాలెం, భవానీపురం కృష్ణాకరకట్ట ప్రాంత వరద బాధితులను బాబూరావుతోపాటు సిపిఎం విజయవాడ పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు తదితరులు మంగళవారం పరామర్శించారు. ఆయా ప్రాంతాల్లోని వరద బాధితులతో మాట్లాడారు. ఓ వైపు కృష్ణానది, మరోవైపు బుడమేరు వరదలతో 38వ డివిజన్ పూర్తిగా మునిగినా, దానిని ముంపు ప్రాంతంగా ప్రభుత్వం, అధికారులు గుర్తించలేదని సిపిఎం నేతల ఎదుట బాధితులు వాపోయారు. స్థానిక శాసనసభ్యులకు ఈ విషయం ముందే చెప్పినా పట్టించుకోలేదని, గత్యంతరం లేక ఆందోళన చేస్తే పోలీసులతో దౌర్జన్యం చేయించడం అన్యాయమని ఆవేదన వెలిబుచ్చారు. బాబురావు, సత్యబాబు మాట్లాడుతూ.. వరద వచ్చి 24 రోజులైనా బాధితులకు ఇంకా న్యాయం చేయకపోవడం శోచనీయమన్నారు. వరద ప్రాంతాల గుర్తింపులో యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వరద బాధితులందరికీ న్యాయం చేయాలని, అందరి పేర్లూ నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ సాయం అందరికీ అందించాలని డిమాండ్ చేశారు.

రథానికి నిప్పు

- అనంతపురం జిల్లా హనకనహాల్‌లో ఘటన

ప్రజాశక్తి -కణేకల్లు

అనంతపురం జిల్లా కణేకల్లు మండలం హనకనహాల్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి రామాలయ రథానికి మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో రథం పాక్షికంగా దెబ్బతిన్నది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హనకనహాల్ గ్రామ రామాలయం వద్ద రథాన్ని ఉంచేందుకు ప్రత్యేకంగా ఓ షెడ్డును ఏర్పాటు చేసి అందులో ఉంచారు. సోమవారం అర్ధరాత్రి రథానికి మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు గమనించి మంటలు ఆర్పివేశారు. అప్పటికే రథం ముందుభాగం కొంత కాలిపోయింది. గ్రామంలో అలజడి సృష్టించేందుకే రథానికి నిప్పుపెట్టారా..? లేక ప్రమాదవశాత్తు ఘటన జరిగిందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కలెక్టర్, ఎస్‌పి పరిశీలన

విషయం తెలుసుకున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్‌పి జగదీష్, కళ్యాణదుర్గం డిఎస్‌పి రవిబాబు, ఆర్‌డిఒ రాణి సుస్మిత, రూరల్ సిఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధు తహశీల్దార్ ఫణి కుమార్ హనకనహాల్ గ్రామంలో పర్యటించారు. నిప్పుపెట్టిన రథాన్ని పరిశీలించారు. ఘటనకు సంబంధించి వివరాలను సేకరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రథానికి నిప్పుపెట్టిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని చెప్పారు.

నిందితులను శిక్షించాలి : సిపిఎం

ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేసి, నిందితులను శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఓ ప్రకటనలో కోరారు. రథం కాలిపోయిన ఘటనలో ఎలాంటి రాజకీయ కారణాలు లేవని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజన, రైతుసంఘం నాయకులు

'బడిదేవర' మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలకు జారీ చేసిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని సమీప గ్రామాల గిరిజనులు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యాన గిరిజనులు తొలుత స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ర్యాలీగా జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని, అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ... బడిదేవర కొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని అటవీశాఖ అధికారులు గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేశారని చెప్పారు. అదే కొండపై గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం లీజు అనుమతులు ఎలా జారీ చేసిందని ప్రశ్నించారు. ఒక వైపు గిరిజనులకు జీవనోపాధి కోసం పోడు పట్టాలిచ్చి మరోవైపు గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. 2017లో ఇచ్చిన మైనింగ్ అనుమతులు రద్దు చేసి ఇప్పుడు రెవెన్యూ భూమిగా మార్చి కాంట్రాక్టర్‌కు అనుమతులు మంజూరు చేయడం దుర్మార్గమన్నారు. ఇచ్చిన అనుమతులు రద్దు చేయకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బంటు దాసు, మండల నాయకులు పాలమిట్ట రాము పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ఫొటోగ్రాఫర్ల ధర్నా

ప్రజాశక్తి - దెందులూరు (ఏలూరు జిల్లా)

ఎన్నికల విధులు నిర్వహించిన తమకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పలువురు ఫొటోగ్రాఫర్లు మంగళవారం ఏలూరు జిల్లా దెందులూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్లు మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ పనులు ఎన్నికల సందర్భంగా నిర్వహించామని తెలిపారు. ఒక్కో ఫొటోగ్రాఫర్‌కు రూ.65 వేల వరకు బకాయిలు రావాల్సి ఉందన్నారు. వృత్తిపై ఆధారపడి జీవించే తమకు ఇది చాలా పెద్దమొత్తమని, తమ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

ఎపిటిఎఫ్ నాయకత్వానికి ఓడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) నాయకత్వానికి ఆన్ డ్యూటీ (ఓడి) సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సర్వీసెస్ కార్యదర్శి పోలా భాస్కర్ జిఓ ఇచ్చారు. ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన హృదయరాజు, చిరంజీవికి ఈ ఏడాది చివరి వరకూ ఓడి వర్తించనున్నట్లు అందులో పేర్కొన్నారు.

మెప్మా ఎంఓగా రామాంజనేయులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెప్మా పరిపాలనా అధికారిగా రామాంజనేయులును మరో ఏడాదిపాటు కొనసాగించనున్నారు. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య విద్య విభాగానికి చెందిన రామాంజనేయులు ఇప్పటికే మెప్మా పరిపాలనాధికారిగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. దీన్ని మరో ఏడాది కొనసాగించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టిడిపి కార్యాలయంపై దాడి కేసులో విచారణకు హాజరైన దేవినేని, తలశిల

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసిపి నేతలు తలశిల రఘురాం, దేవినేని అవినాష్ మంగళవారం పోలీసుల ఎదుట హాజరయ్యారు. గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ సిఐ కార్యాలయంలో వీరిరువురు విచారణకు వచ్చారు. సుమారు ఐదు గంటలపాటు వారిని విచారించారు. అనంతరం రూరల్ సిఐ శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ గత విచారణలో వారు చెప్పిన అంశాల్లో కొన్ని సందేహాలు ఉండటంతో వాటిని నిర్ధారించుకోవడానికి విచారణ చేశామని, అయితే వారి చెప్పే వివరాలు పొంతన లేకుండా ఉన్నాయని తెలిపారు. అన్నిటికీ తమకు తెలియదు, మర్చిపోయామని వారు సమాధానాలు చెప్పారని పేర్కొన్నారు. సాంకేతిక సాక్ష్యాధారాల కోసం సెల్‌ఫోన్లను ఇవ్వాలని కోరగా కోర్టు ఉత్తర్వులుంటేనే ఇస్తామని చెప్పారని, పైగా అప్పటి సెల్‌ఫోన్లు తమ వద్ద లేవని బదులిచ్చారని అన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు 28 మందిని అరెస్ట్ చేయగా వారిలో ఎక్కువ మంది వీరిద్దరికి చెందిన వారే ఉన్నారన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందని, బుధవారం మరో ఇద్దరిని విచారిస్తామని చెప్పారు.

తిరుమలలో సమాచార హక్కు పునరుద్ధరించండి

- టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల తిరుపతి దేవస్థానంలో మరింత పారదర్శకత పెంచడానికి సమాచార హక్కు చట్టాన్ని పునరుద్ధరించాలని మంగళవారం టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో కోరారు. గతంలో సమాచార హక్కు చట్టం ద్వారా అనేక అవకతవకలను వెలికి తీసిన విషయాలను గుర్తు చేశారు. అనంత పద్మనాభ స్వామి ఆలయంలో సమాచార హక్కు చట్టం ఒక అంశానికి వర్తించదని కోర్టు ఇచ్చిన ఆదేశాన్ని అనుసరించి అది టిటిడికీ వర్తిస్తుందని, ఆ చట్టాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో టిటిడి చైర్మన్ ఏడాదిలో మూడున్నర లక్షల దర్శనాల లేఖలు ఇచ్చినట్టు మీడియాలో వెల్లడి అయిందని, ఒక్క చైర్మన్ వ్యవహారంలోనే ఇంత పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, కేంద్ర, రాష్ట్ర స్థాయి సంస్థల నుంచి ఎన్ని రకాల వత్తిడిలు ఉంటాయో అంచనా వేయవచ్చని వివరించారు. విఐపిలకు ఇచ్చే దర్శనాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ముగింపు దశకు పొగాకు కొనుగోళ్లు

- 206 మిలియన్ కిలోల అమ్మకాలు
- గతేడాది కన్నా రూ.65 అధికం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో



వేలం కేంద్రంలో పొగాకును పరిశీలిస్తున్న మంత్రి రవికుమార్

రాష్ట్రవ్యాప్తంగా పొగాకు కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఏడాది 142 మిలియన్ కిలోల పంటకు బోర్డు అనుమతినిచ్చింది. అయితే అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు రెండు, మూడుసార్లు నాట్లు వేశారు. ఆఖరులో సాగు చేసిన పంటకు వాతావరణం అనుకూలించడంతో పంట దిగుబడి పెరిగింది. సాగుకు బోర్డు అనుమతించిన దాని కన్నా 60 మిలియన్లకు పైగానే దిగుబడి వచ్చింది. ఇప్పటికే 206 మిలియన్ కిలోల పంటను వ్యాపారులు కొనుగోళ్లు చేశారు. కిలో గరిష్ట ధర రూ.358, సగటు ధర రూ.290.69 పలికింది. గతేడాది కంటే రూ.65 అదనపు ధర లభించింది. అంతర్జాతీయంగా పొగాకు పంట సాగు తగ్గిపోవడంతో రైతులకు మంచి ధర లభించిందని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు ప్రజాశక్తికి తెలిపారు. ఇంకా రెండు లేదా మూడు మిలియన్ కిలోల పొగాకు రైతుల వద్ద ఉండొచ్చన్నారు.

ప్రస్తుతం కర్ణాటకలో పొగాకు విక్రయానికి రావడంతో మన రాష్ట్రంలో లో గ్రేడ్ సరుకుకు ధర తగ్గించారు. క్వింటా లోగ్రేడుకు రూ.27వేలు ధర పలకగా ప్రస్తుతం రూ.17,000 చెల్లిస్తున్నారు. లో గ్రేడు సరుకును వ్యాపారులు తిరస్కరిస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు మంగళవారం రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులు తెచ్చిన పొగాకునంతా కొనుగోళ్లు చేసేలా చూడాలని బోర్డు అధికారులను ఆదేశించారు. రైతులు తెచ్చిన ప్రతి బేదును కొనాలని వ్యాపారులకూ సూచించారు.

సంపాదకీయం

బుస కొడుతున్న కులవివక్ష!

'కసిరి బుసకొట్టు నాతని గాలిసోక.. నాల్గు పడగల హైందవ నాగరాజు'...అంటూ సమాజంలో ఉన్న కుల దురహంకారాన్ని అనేక దశాబ్దాల క్రితమే నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా ఈసడించాడు. నాటి బుసలు.. నేడు కాలకూట విషంగా మారి.... ప్రాణాలు తీసే స్థాయికి పెచ్చుమీరడం సిగ్గుచేటు. మన రాష్ట్రంలో ఇలాంటి దాడులు తరచూ చోటుచేసుకుంటుండగా, బిజెపి పాలిత రాష్ట్రాలు దేశంలోనే దళితులపై దాష్టీకాల్లో ముందువరసలో ఉన్నాయి.

సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరులో ఓ ఇంటి అరుగుపై ఓ దళిత వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడు. మనిషిని మనిషిగా చూడలేని పెత్తందారీ కులానికి చెందిన ఆ ఇంటి యజమాని బాధితుడిని కర్రతో కొట్టడంతోపాటు మరిగే నూనె పోసేశాడు. మనం ఏ సమాజంలో ఉన్నాం... అంటూ భయపడేలా చోటుచేసుకుంటున్న ఇలాంటి మరిన్ని ఘటనలూ మన రాష్ట్రంలో చోటుచేసుకున్నాయి. దళిత యువకుడు, బిసి యువతి ప్రేమించుకుని ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. ఇటీవల ఆ యువకుడి తల్లి తన స్వగ్రామానికి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పెత్తందారులు యువతి కుటుంబ సభ్యులను రెచ్చగొట్టారు. యువకుడి తల్లిపై దాడి చేయకపోతే గ్రామ బహిష్కారం చేస్తామని హెచ్చరించారు. పెత్తందారులు, యువతి కుటుంబ సభ్యులు కలిసి యువకుడి తల్లిని చెట్టుకు కట్టేసి పాశవికంగా కొట్టారు. కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం కల్లుకూటలో ఈ అఘాయిత్యం జరిగింది. అగ్రవర్ణ బాలికను ప్రేమించాడని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో దళిత బాలుడిని స్తంభానికి కట్టేసి కొట్టారు. ఇక అదే జిల్లాలో జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ రంగరాయ కళాశాలకు చెందిన దళిత ప్రొఫెసర్‌పై దాడి చేశారు. బీహార్‌లోని నవాడా జిల్లాలో దళితులు నివాసముంటున్న 21 ఇళ్లకు ఇటీవల నిప్పు పెట్టారు. ఉత్తర ప్రదేశ్‌లో ఇలాంటి నేరాలకు అంతేలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్కు అభివృద్ధి పేరిట రాంపూర్ జిల్లా సిలాయ్ బరగామ్‌లో లాఠీఛార్జి, కాల్పులు జరిపి పదో తరగతి చదువుతున్న దళిత విద్యార్థిని పొట్టనపెట్టుకుంది.


కేంద్ర, సామాజిక న్యాయం, సాధికార శాఖ 2022కు సంబంధించి ఇటీవల విడుదల చేసిన నివేదిక మరిన్ని వాస్తవాలను కళ్లకు కట్టింది. ఆ ఏడాది దళితులపై దాష్టీకాలకు సంబంధించి 51,656 కేసులు దేశవ్యాప్తంగా నమోదయ్యాయి. బిజెపి పాలనలోని ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 12,287 కేసులతో.. 23.78 శాతం నేరాలతో యోగి పాలనలోని ఉత్తరప్రదేశ్ మొదటి స్థానాన్ని వెలగబెట్టింది. 8,661 కేసులు, 16.75 శాతం నేరాలతో రాజస్థాన్, 7,732 కేసులతో 14.97 శాతం నేరాలతో మధ్యప్రదేశ్ ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఆ తరువాత స్థానాల్లో బీహార్, ఒడిశా, మహారాష్ట్ర ఉన్నాయి. ఈ ఆరు రాష్ట్రాల్లోనే 81 శాతం కేసులు నమోదయ్యాయి. ఇక మన రాష్ట్రం 2,190 కేసులతో ఏడో స్థానంలో ఉంది. ఎస్‌టిలపై వేధింపుల కేసులు దేశవ్యాప్తంగా 8,330 నమోదు కాగా, 379 కేసులతో రాష్ట్రం ఎనిమిదో స్థానంలో ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని 15 మండలాలు, విజయనగరం జిల్లాలో 15 గ్రామాలు సహా రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో అత్యధికంగా ఎస్‌సి, ఎస్‌టిలపై వేధింపులు జరుగుతున్నాయి. ఈ కేసులలో నిందితులు దర్జాగా తిరుగుతుండగా, బాధితులు బిక్కుబిక్కుమంటున్నారు. మొత్తంగా దళితులకు సంబంధించి 97.7 శాతం కేసులు 13 రాష్ట్రాల్లోనూ, అవే రాష్ట్రాల్లో ఎస్‌టిలపై 98.91 కేసులు నమోదయ్యాయి. ఈ విషయాలపై పెదవివిప్పని బిజెపి అగ్రనేత అమిత్‌షా... గురివిందగింజ తన నలుపెరగదన్నట్టు ఇతర పార్టీల దళిత వ్యతిరేకత గురించి మాట్లాడుతున్నారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలపై నిత్యం విషం చిమ్ముతూ... సమాజంలో చీలికలు సృష్టించి లబ్ధి పొందాలని కాచుక్కూర్చున్న సంఘపరివార్, బిజెపి శక్తులకు గట్టిగా బుద్ధి చెప్పాలి. 'అన్నదమ్ముల వలెను జాతులు, మతములన్నీ మెలగవలెనోయి...మతం వేరైతేను యేమోయి.. మనసు వొకటై మనుషులుంటే..' అన్న గురజాడ స్ఫూర్తితో ముందడుగు వేయడమే మన కర్తవ్యం.

మహనీయుల మాట



కర్మ, నుదిటిరాత, పూర్వజన్మ సుకృతం అనే నమ్మకాలు దేశ ప్రగతికి అవరోధం. కులం, మతం ప్రాతిపదికగా గాక... లౌకికవాదం ప్రాతిపదికగా, సమానత్వం ఆధారంగా భారత పౌరులు మెలగాలి.

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య




తిరుపతి లడ్డు - మత రాజకీయం

విశ్లేషణ



వి. రాంభూపాల్

తిరుపతి లడ్డు కల్తీ విషయం చినికి చినికి గాలివానగా మారింది. ఈ కల్తీపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'సిట్' వేసింది. విచారణ జరిపించాలని దేశ ప్రధానికి జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరం రాశారు. ముఖ్యమంత్రి ఆరోపణలపై బిజెపి మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి, టిటిడి మాజీ ఛైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి లతో సహా అనేకమంది విడివిడిగా సుప్రీంకోర్టుకు వెళ్ళారు. ఈలోపు పాలక, ప్రతిపక్ష పార్టీల పరస్పర విమర్శలు, ప్రమాణాల సవాళ్ళు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 11 రోజుల ప్రాయశ్చిత దీక్ష, వైసిపి కేంద్ర కార్యాలయంపై బిజెపి అనుబంధ యువజన సంఘం కార్యకర్తల దాడి ఒకదాని తర్వాత ఒకటి శరవేగంగా జరిగిపోతున్నాయి. తాము ఎంతో పవిత్రంగా భావించి, పూజించి, భుజించిన స్వామివారి లడ్డు అపవిత్రమైనదా! జంతువుల కొవ్వు కలిపిన లడ్డు తిన్నామా! అంటూ దేశవ్యాపితంగా వున్న కోట్లాది తిరుమల భక్తులు తీవ్ర ఆందోళనకు, ఆవేదనకు గురవుతున్నారు. లడ్డులో కల్తీ జరిగివుంటే కచ్చితంగా చర్యలు తీసుకోవాలి, దోషులపై కేసులు పెట్టాలి, కఠిన శిక్షలు విధించాలి. అందుకు చట్టం తన పని తాను చేయాలి. ఈ పని సక్రమంగా చేయాల్సిన పాలకులు ఇతర మతాలను రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతూ మత సామరస్యతను దెబ్బ తీస్తున్నారు. ఇలాంటి చర్యలు మతోన్మాద శక్తులు బలపడడానికి తోడ్పడతాయనే స్పృహను పాలక పార్టీలు కోల్పోతున్నాయి. దీన్ని అవకాశంగా తీసుకుని మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయి. దేశమంతా ఇంత చర్చ జరుగుతున్న ఈ కల్తీ వ్యవహారంపై చట్టం, ముఖ్యంగా ఆలయ అర్చకులు, ఆలయ తనిఖీ నిపుణులు ఎందుకు మౌనంగా వుంటున్నారు? జులై 23న వచ్చిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్.డి.డి.బి) రిపోర్టును సుమారు రెండు నెలలు ఎందుకు దాచిపెట్టారు? ఇప్పటికైనా కేసు పెట్టారా? లేదా? ఇలాంటి అనేక సందేహాలను వెంటనే తీర్చాలి. లడ్డుతో పాటు టిటిడిలో జరుగుతున్న అనేక అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి. టిటిడిలో అనేక అక్రమాలు జరుగుతుంటే ఆ బోర్డులో సభ్యులుగా వున్న బిజెపి నాయకులు ఏం చేస్తున్నారు? భక్తులకు కావలసింది మతోన్మాద చర్యలు కాదు. సవాళ్ళు, ప్రతి సవాళ్ళు కాదు. దీక్షలు, ప్రమాణాలు అసలే కాదు. నిజం కావాలి. లడ్డుల తయారీలో ఏం జరిగిందనే నిజం కావాలి. ఆ నిజం నిపుణులు చేసే పరీక్షల ద్వారా నిర్ధారణ కావాలి. ఆ నిజం తేలేవరకు రాజకీయ నాయకుల నోళ్ళు మూతపడాలి, మతోన్మాద ఉన్మాద ప్రకటనలు ఆగాలి.



దేశమంతా ఇంత చర్చ జరుగుతున్న ఈ కల్తీ వ్యవహారంపై చట్టం, ముఖ్యంగా ఆలయ అర్చకులు, ఆలయ తనిఖీ నిపుణులు ఎందుకు మౌనంగా వుంటున్నారు? జులై 23న వచ్చిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్.డి.డి.బి) రిపోర్టును సుమారు రెండు నెలలు ఎందుకు దాచిపెట్టారు? ఇప్పటికైనా కేసు పెట్టారా? లేదా? ఇలాంటి అనేక సందేహాలను వెంటనే తీర్చాలి. లడ్డుతో పాటు టిటిడిలో జరుగుతున్న అనేక అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి. టిటిడిలో అనేక అక్రమాలు జరుగుతుంటే ఆ బోర్డులో సభ్యులుగా వున్న బిజెపి నాయకులు ఏం చేస్తున్నారు? భక్తులకు కావలసింది మతోన్మాద చర్యలు కాదు. సవాళ్ళు, ప్రతి సవాళ్ళు కాదు. దీక్షలు, ప్రమాణాలు అసలే కాదు. నిజం కావాలి. లడ్డుల తయారీలో ఏం జరిగిందనే నిజం కావాలి. ఆ నిజం నిపుణులు చేసే పరీక్షల ద్వారా నిర్ధారణ కావాలి. ఆ నిజం తేలేవరకు రాజకీయ నాయకుల నోళ్ళు మూత పడాలి, మతోన్మాద ఉన్మాద ప్రకటనలు ఆగాలి. ఈ కుట్రలకు ప్రజలు, భక్తులు బలి కాకుండా ప్రజాతంత్రవాదులు కాపాడుకోవాలి.

ఈ కుట్రలకు ప్రజలు, భక్తులు బలి కాకుండా ప్రజాతంత్రవాదులు కాపాడుకోవాలి.

తిరుమల తిరుపతి దేవస్థానం దేశంలోనే అత్యంత ధనిక దేవాలయాల్లో ఒకటి. ప్రతి సంవత్సరం ఐదు వేల కోట్ల బడ్జెట్, 18 వేల కోట్ల డిపాజిట్లు, వెయ్యి కిలోల బంగారం కలిగివుంది. ఇక్కడ ప్రతిరోజు కోట్ల రూపాయల కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతున్నాయి కాబట్టే టిటిడి ఛైర్మన్, దాని సభ్యులుగా వుండడానికి రాజకీయ నిరుద్యోగులు, బడా వ్యాపారులు, అవినీతి మాజీ అధికారులు పెద్ద ఎత్తున పోటీలు పడుతున్నారు. అధికార పార్టీల నాయకులకు కోట్ల రూపాయలు ఇచ్చి టిటిడి పదవులు దిక్కించుకుంటున్నారనే విమర్శలు వున్నాయి. వ్యక్తిగత విశ్వాసంగా వుండాల్సిన భక్తిని వ్యాపారంగా, రాజకీయంగా మార్చి సొమ్ము చేసుకుంటున్న పార్టీలు ఇప్పుడు లడ్డు గురించి గగ్గోలు పెట్టడంలో భక్తి కంటే స్వార్థ వ్యాపార, రాజకీయ ప్రయోజనాలే ప్రధానం. ఇక్కడికి వచ్చిన భక్తులు లడ్డు తీసుకోకుండా తిరిగి వెళ్లడమనేది ఉండదు. అందుకే తిరుమలలో ప్రతిరోజు సగటున 15 వేల కిలోల నెయ్యితో సుమారు మూడున్నర లక్షల లడ్లు తయారు చేస్తుంటారు. ఈ లడ్డులను తయారు చేయడానికి ఆవు నెయ్యితో పాటు శెనగపిండి, చక్కెర, యాలకులు, ఎండు ద్రాక్ష, కలకండ, ముంతమామిడి పప్పు వాడుతారు. ఈ సరుకులన్నింటిని టిటిడి పాలకమండలి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ-టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తుంది. ఇలా చేరుతున్న సరుకుల నాణ్యతను పరీక్షించడానికి టిటిడి చాలా సంవత్సరాల క్రితమే ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. ఏడు ఎనిమిది దశల్లో తనిఖీలు చేస్తారు. 2024 మార్చి 12న నిర్వహించిన టెండర్లలో నెయ్యి సరఫరా కాంట్రాక్టు పొందిన తమిళనాడుకు చెందిన ఎ.ఆర్ డెయిరీ ఫుడ్స్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ జులై 6న, జులై 12న నాలుగు ట్యాంకర్ల నెయ్యిని తిరుమలకు పంపింది. ఈ నెయ్యే ఇప్పటి వివాదానికి కేంద్రంగా వుంది. తిరుమలలో జరిగే లడ్డు తయారీతో పాటు, ఆలయంలో ఉపయోగించే అన్ని రకాల సరుకులను టెండర్ల ద్వారానే కొనుగోలు చేస్తారు. తక్కువ ధరకు టెండర్ వేసిన వారితో సరుకులు సప్లయి చేయించుకుంటారు. ప్రస్తుతం లడ్డుల కోసం ఉపయోగించే నెయ్యిని ప్రీమియర్ అగ్రి ఫుడ్స్, కృపరామ్ డెయిరీ, వైష్ణవిశ్రీ పరాగ్ మిల్క్, ఎ.ఆర్ డెయిరీ అనే ఐదు సంస్థలు సప్లయి చేస్తున్నాయి. నెయ్యి సరఫరా చేసే ఏ సంస్థ అయినా ట్యాంకర్ తిరుపతికి బయలుదేరే ముందే సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సి.ఎఫ్.టి.ఆర్.ఐ) మైసూర్‌లో నమూనా పరీక్షలు చేయించుకుని, వారి సర్టిఫికెట్ వెంటపెట్టుకుని తిరుపతికి వస్తారు. అక్కడకు వచ్చిన ట్యాంకర్లను కొండ కింద ఒకసారి, కొండపైన మరోసారి టిటిడి తనిఖీ నిపుణులు నాణ్యతను పరీక్షిస్తారు. ఇలా పరీక్షలు చేయడానికి ప్రస్తుతం 12 మంది ల్యాబ్ నిపుణులు, సి.ఎఫ్.టి.ఆర్.ఐలో పదవీ విరమణ చేసిన సీనియర్ శాస్త్రవేత్త ఒకరు కలిసి 13 మంది సిబ్బంది వున్నారు. సరుకుల నాణ్యతలో వీరికి ఏ మాత్రం అనుమానం వచ్చినా నమూనాలు తీసి వివిధ ల్యాబ్‌లకు పంపి నిర్ధారించుకుంటారు.

ఈ సంవత్సరం జూన్ 14న టిటిడి ఈవో గా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు అదేరోజు తిరుమలలో మీడియాతో మాట్లాడుతూ లడ్డు నాణ్యతపై భక్తులు, లడ్డు తయారీ కార్మికులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, లడ్డు నాణ్యతను కాపాడడంలో రాజీ పడే ప్రసక్తే లేదని ప్రకటించారు. ఆయన అన్నట్లుగానే ఎ.ఆర్ డెయిరీ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యి నుండి నాలుగు నమూనాలు గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు చెందిన సి.ఎ.ఎల్.ఎఫ్ కు పంపారు. అనేక ల్యాబ్‌లు అందుబాటులో వుండగా, ఎప్పుడూ పంపని ఈ గుజరాత్ ల్యాబ్‌కు శ్యాంపిళ్లు ఎందుకు పంపారనే అనుమానాలు వున్నాయి. గుజరాత్ ల్యాబ్ పరీక్షించి ఈ నెయ్యి వెజిటబుల్ ఆయిల్, జంతువుల కొవ్వు, చేప నూనె, ఇతర పదార్థాల వల్ల కల్తీ అయినట్లు ఎన్.డి.డి.బి రిపోర్టు ఇచ్చారని తెలుగుదేశం నాయకులు, ఆ తర్వాత టిటిడి ఈవో సెప్టెంబర్ 20న, ఆ వెంటనే ముఖ్యమంత్రి చెప్పడంతో దేశమంతటా సంచలనమైంది.

ఒక్క లడ్డులోనే కాదు, ఏదైనా ఎందుకు కల్తీ జరుగుతుందీ అంటే లాభం కోసమే కదా. నాణ్యమైన దానికంటే కల్తీ చేయడం వల్ల ఖర్చు తగ్గుతుంది, లాభం పెరుగుతుంది. తిరుపతికి సరఫరా అవుతున్న సరుకుల్లో నాణ్యత ప్రమాణాలు వుండడం లేదంటే అక్కడి భక్తుల మనోభావాల కంటే తమ లాభాలే ముఖ్యమని కొంతమంది వ్యాపారులు భావించడమే. లాభం వస్తుందంటే దేన్నైనా, ఏం కలిపైనా కల్తీ చేస్తారు. కేంద్ర హోంమంత్రి సిఫారసుతో ఏడు సంవత్సరాలుగా టిటిడి బోర్డు మెంబర్‌గా వున్న ప్రముఖునికి తెలియకుండా ఏదీ కొనుగోలు కాదన్నది జగమెరిగిన సత్యం. బిజెపి అగ్ర నాయకులకు తెలిసిన నిజం. అందుకే జగన్‌మోహన్‌రెడ్డి 'టిటిడిలో ఏం జరుగుతుందో బిజెపి వారికి తెలియదా, మీ బిజెపి వారు ఎంతమంది అందులో సభ్యులుగా వున్నారో మీకు తెలియదా' అని వేస్తున్న ప్రశ్నల అంతరార్థం సాధారణ భక్తులకు అర్థం కాకపోవచ్చు కానీ, భక్తుల వేషం వేసుకున్న మోసకారులకు బాగా అర్థమవుతుంది.

బిజెపి కూటమిలో చేరిన తర్వాత పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న పోకడలు ఆంధ్ర రాష్ట్రంలో మతతత్వాన్ని పెంచి పోషించేందుకు తోడ్పడుతున్నాయి. హిందూత్వకు తానే నిజమైన ప్రతినిధిని అనిపించుకోవడానికి ఆయన యజ్ఞాలు, యాగాల పేరుతో చేస్తున్న హంగామా అంతిమంగా మతోన్మాద శక్తులకే తోడ్పడుతుంది. ఇప్పటి వరకు మన రాష్ట్రంలో బిజెపి బలపడకపోవడానికి, మత సామరస్యం కొనసాగడానికి ప్రధాన కారణం మన జీవన విధానంలో భాగంగా వున్న భిన్నత్వంలో ఏకత్వ భావన. పీర్ల పండుగ అయినా, వినాయకచవితి అయినా హిందువులు, ముస్లింలు కలిసి మెలసి చేసుకుంటున్నారంటే అది మన తెలుగువారి సత్ సాంప్రదాయం. పవిత్రమైన అలాంటి ప్రజా ఐక్యతా భావాలకు నష్టం కలిగించే విధంగా ఆయన ప్రవర్తన వుండడం ఆంధ్రప్రదేశ్‌కు రానున్న ప్రమాదానికి సంకేతం. ఆయన చర్యలు తాత్కాలికంగా బిజెపి మన్ననలు పొందు తాయేమోగానీ, అంతిమంగా తన పార్టీని మింగేస్తాయని గుర్తించలేకపోతున్నారు. గతంలో బిజెపి కంటే తీవ్రమైన మత పార్టీగా వ్యవహరించిన శివసేన పరిస్థితి ఇప్పుడు ఏమిటో జనసేన నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకోవాలి. తమ నాయకుడు అనుసరిస్తున్న మతతత్వ విధానాల నుండి బయటకు వచ్చేలా ఆయనపై ఒత్తిడి తేవాలి. ఒకనాడు లౌకిక, ప్రజాస్వామిక భావాలకు కట్టుబడి దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలలో భాగస్వామిగా వున్నందునే దేశంలో చక్రం తిప్పే అవకాశం వచ్చిందనే విషయాన్ని తెలుగుదేశం మరచిపోరాదు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం నేడు మత రాజకీయాలకు వత్తాసుగా మారుతుండడం ఆత్మహత్యా సదృశ్యమే అవుతుంది. బిజెపి లాంటి మత రాజకీయాలు ప్రజలకు ఎంత నష్టం కలిగిస్తాయో తెలిసి కూడా ఆ కొరివితో తల గోక్కోవాలనుకుంటున్నది. గత ఐదేళ్ళుగా కేంద్రంలో బిజెపి ని బలపరచినా చివరకు తనకు దక్కింది ఏమిటో వైసిపి గుర్తించాలి. బిజెపి మత రాజకీయాల పట్ల ఇప్పటికీ సన్నాయి నొక్కులు నొక్కి ఏం సాధిస్తారో వైసిపి నేతను ఆ పార్టీ కార్యకర్తలు ప్రశ్నించాలి. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మతతత్వాన్ని పెంచి పోషించే చర్యలను ప్రశ్నిస్తున్నది, ప్రతిఘటిస్తున్నది వామపక్షాలు మాత్రమే. రాష్ట్రంలో మతోన్మాద ప్రయత్నాలను నివారించాలి. ప్రజల ఐక్యతను కాపాడటం ప్రజాతంత్ర, లౌకికవాదుల తక్షణ కర్తవ్యం. మత సామరస్యాన్ని కాపాడాలని, వివిధ మతాల విశ్వాసాలకు అనుగుణంగా వ్యక్తిగత మత స్వేచ్ఛను పరిరక్షించాలని, మతాన్ని రాజకీయాల నుండి వేరు చేయాలని వామపక్షాలు కోరుతున్నాయి.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

దిసనాయకె ముందున్న సవాళ్లు

అంతర్జాతీయం



ఎం.కోటేశ్వరరావు

శ్రీలంక నూతన అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయకె సోమవారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు. 1948లో బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన లంకలో ఒక కమ్యూనిస్టు పాలనా బాధ్యతలు చేపట్టటంతో చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. ఐదు సంవత్సరాల క్రితం నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్.పి.పి) అభ్యర్థిగా కేవలం 3.16 శాతం ఓట్లు తెచ్చుకున్న వామపక్ష నేత ఇప్పుడు 42.3 శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో నిలవటం, రెండవ ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపులో 55.89 శాతం ఓట్లతో విజయం సాధించటం చిన్న విషయమేమీ కాదు. సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా సోషలిస్టు రాజ్యాల పతనం తరువాత ప్రపంచంలో కమ్యూనిస్టులకు ఎదురుగాలి వీచిందన్నది వాస్తవం. కమ్యూనిస్టులపై ప్రచ్ఛన్న యుద్ధంలో విజేతలం తామే అని ప్రకటించుకున్న వారి కలలు కల్లలే అని తరువాత జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. వాటిలో తాజాగా శ్రీలంక చరిత్రకెక్కింది.

తాజా ఎన్నికలలో ఎన్‌పిపి అభ్యర్థి తొలి రౌండ్‌లో 42.3 శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో, ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ ఎస్‌ఎల్‌పి అభ్యర్థి సాజిత్ ప్రేమదాస 32.76 శాతం, ప్రస్తుత అధ్యక్షుడు రానిల్ విక్రమ సింఘే 17.27 శాతం ఓట్లతో మూడవ స్థానంలో ఉన్నారు. మిగిలిన ఓట్లను 35 మంది ఇతర అభ్యర్థులు తెచ్చుకున్నారు. అక్కడి విధానం ప్రకారం ప్రతి ఓటరూ ముగ్గురికి ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేయవచ్చు. సగానికి పైగా ఓట్లు తెచ్చుకున్న వారినే విజేతగా ప్రకటిస్తారు. అలా రాని పక్షంలో మొదటి ఇద్దరిని మినహాయించి మిగిలిన వారిని పోటీ నుంచి తొలగిస్తారు. వారికి వచ్చిన ఓట్లలో రెండవ ప్రాధాన్యతా ఓట్లు ఎవరికి వేశారో వారికి కలిపి 50 శాతం పైగా తెచ్చుకున్నవారిని విజేతగా నిర్ధారిస్తారు. ఆ ప్రకారం వామపక్ష నేతకు 55.89 శాతం రావటంతో ఎన్నికైనట్లు ప్రకటించారు.

ప్రపంచం నిరంతరం మారుతూ ఉంటున్నపుడు ప్రతిదీ మార్పుకు గురవుతుందన్నది నమ్మకం కాదు, ఒక శాస్త్రీయ భౌతిక వాస్తవం. ఎక్కడైతే కమ్యూనిజం విఫలమైందని విజయ గీతాలాపన



2022లో ఏర్పడిన ప్రభుత్వం ఐ.ఎం.ఎఫ్, ఇతర అంతర్జాతీయ సంస్థల షరతులన్నింటికీ తల ఊపి రుణాలు తీసుకుంది. దాని వలన పౌర సంక్షేమానికి నిధుల కోత ఒకటైతే భారాల మోత మరొకటి. ఐ.ఎం.ఎఫ్ ఒప్పందాల నుంచి తక్షణమే వైదొలిగితే మరోసారి లంక చెల్లింపులతో పాటు ఇతర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటుంది. దాని షరతుల నుంచి ఉపశమనం కలిగించకపోతే జనంలో అసంతృప్తి తలెత్తటం అనివార్యం. ఈ పరిస్థితిని వామపక్ష ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది.

చేశారో అదే అమెరికాలో, ఇతర అలాంటి దేశాల్లో ఇప్పుడు పెట్టుబడిదారీ విధానం విఫలమైందని వినిపిస్తోంది. అందుకే ప్రత్యామ్నాయంగా సోషలిజం గురించి ఆసక్తి వ్యక్తమౌతున్నది. పలు రకాల భావజాలాలు కలిగిన వారందరికీ అవకాశం ఇచ్చిన జనం తగిన సమయం వచ్చినపుడు వామపక్ష శక్తులకు మాత్రం ఎందుకు ఇవ్వరంటూ అనేక మంది తగిలిన ఎదురుదెబ్బలను తట్టుకొని అరుణ పతాకను అలాగే సమున్నతంగా ఎగరేస్తూ అచంచల విశ్వాసంతో ఉన్నారు. అలాంటి వామపక్ష శక్తులు లంకలో జన సమ్మతిని పొందాయి. అనేక రకాలుగా విష ప్రచారం చేస్తున్నప్పటికీ లాటిన్ అమెరికా దేశాల్లో అనేక చోట్ల వామపక్ష శక్తుల మీద జనం విశ్వాసం ఉంచారు. దక్షిణాఫ్రికా అధికార కూటమిలో కమ్యూనిస్టులు ఒక ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. నేపాల్లో తిరుగులేని శక్తిగా వామపక్షాల ఉన్నాయి. ఇప్పుడు వాటి సరసన శ్రీలంక చేరింది. దాని గురించి ఇరుగుపొరుగు దేశాలన్నింటా ముఖ్యంగా మన దేశంలో దీని గురించి చర్చ జరగటం అనివార్యం.

తప్పుడు విధానాలు అనుసరించి శ్రీలంకను దివాలా తీయించిన పాలకులను రెండు సంవత్సరాల క్రితం లంకేయులు తరిమికొట్టారు. ఆ పరిణామాల గురించి ఎంతో చర్చ జరిగింది. అలాంటి చోట కమ్యూనిస్టులను ఎలా ఎన్నుకున్నారబ్బా అని అదేమాదిరి జనం ఇప్పుడు ఆలోచిస్తారు. అలాంటి మధనం మన దేశంతో సహా ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రతిదేశ పాలకుల్లో వణుకు పుట్టించటం అనివార్యం. మార్క్సిజం-లెనినిజం ఒక శాస్త్రీయ సిద్ధాంతం. దాన్ని అన్ని చోట్లా రూళ్ల కర్రలా ఒకే మాదిరి వర్తింపచేయాలని చూసిన కొన్ని పార్టీలకు ఎదురు దెబ్బలు తగిలాయి. ప్రతి దేశ విప్లవం తనదైన పద్ధతిలో ఉంటుంది తప్ప ఏదో ఒక నమూనాలో జరగదు. చైనా మార్గంలోనో రష్యా మాదిరో వస్తుందని భావించిన వారు దుందుడుకు, మితవాద చర్యలకు పాల్పడటంతో అనేక చోట్ల ఉద్యమం దెబ్బతిన్నది. యూనిఫాం అంటే ఏకరూపం ఉండాలి తప్ప అందరికీ ఒకే కొలతలని కాదు. అలాగే మార్క్సిస్టు శాస్త్రీయ సిద్ధాంతాన్ని కమ్యూనిస్టు పార్టీలు తమ దేశాలు, పరిస్థితులకు అన్వయించుకోవాల్సి ఉంది. ఆ అవగాహనపై వచ్చిన తేడాలే పలు కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల ఏర్పాటుకు దారితీశాయి. అలాంటిదే శ్రీలంకలో జనతా విముక్తి పెరుమన (సంఘటన). దానితో పాటు మరో 27 వామపక్ష పార్టీలు, సంస్థలు, ప్రజాసంఘాలు కలసి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్.పి.పి) పేరుతో ఒక కూటమిగా పోటీ చేశాయి.

ఏడున్నరద శాబ్దాలుగా వివిధ పార్టీలను చూసిన జనం వాటి మీద విశ్వాసం కోల్పోయి వామపక్ష అభ్యర్థికి ఓట్లు వేశారు. గతంలో తుపాకి చేతపట్టి విప్లవాన్ని తీసుకువచ్చేందుకు రెండుసార్లు జనతా విముక్తి పెరుమున విఫలయత్నం చేసింది. ఇప్పుడు బాలట్ ద్వారా అధికారాన్ని పొందింది. తాజా విజయం దాని చరిత్రలో ఒక ప్రధాన మలుపు.

అధ్యక్ష పదవిలో కొలువుదీరిన వామపక్ష కూటమి పార్లమెంటులో కూడా ఆధిక్యతను సంపాదించాల్సి ఉంది. లాటిన్ అమెరికాలో అధికారానికి వచ్చిన వామపక్షాలు అధ్యక్ష, ప్రధాని పదవులు పొందుతున్నప్పటికీ పార్లమెంట్లలో మెజారిటీ తెచ్చుకోలేని కారణంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అంతకు ముందున్న వ్యవస్థ పునాదుల మీదనే అవి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. అయితే వాటికి ఉన్న పరిమితుల కారణంగా కొన్ని చోట్ల ఎన్నికల్లో ఎదురు దెబ్బలు కూడా తగిలాయి. వాటి నుంచి లంక వామపక్ష ఎన్‌పిపి తగిన పాఠాలు తీసుకోవాలి. 2022లో ఏర్పడిన ప్రభుత్వం ఐ.ఎం.ఎఫ్, ఇతర అంతర్జాతీయ సంస్థల షరతులన్నింటికీ తల ఊపి రుణాలు తీసుకుంది. దాని వలన పౌర సంక్షేమానికి నిధుల కోత ఒకటైతే భారాల మోత మరొకటి. ఐ.ఎం.ఎఫ్ ఒప్పందాల నుంచి తక్షణమే వైదొలిగితే మరోసారి లంక చెల్లింపులతో పాటు ఇతర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటుంది. దాని షరతుల నుంచి ఉపశమనం కలిగించకపోతే జనంలో అసంతృప్తి తలెత్తటం అనివార్యం. ఈ పరిస్థితిని వామపక్ష ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది. మన దేశంలో బిజెపి రెండు సీట్ల నుంచి మూడు వందలకు పైగా సీట్లతో అధికారం పొందామని గర్వంగా, ఘనతగా చెప్పుకుంటుంది. దానికి ఆ పార్టీకి మూడు దశాబ్దాలు పట్టింది. జె.వి.పి ఐదేళ్లలోనే అలాంటి అధికారాన్ని పొందింది. రాజకీయాల్లో బళ్లు ఓడలు, ఓడలు బళ్లు అవుతాయి. సింహళ హృదయ సామ్రాట్టులుగా పేరు తెచ్చుకున్న రాజపక్సే సోదరులు 2019 ఎన్నికల్లో 52.25 శాతం ఓట్లు తెచ్చుకున్నారు. అనుసరించిన విధానాల కారణంగా వారు 2022లో జనం ఇళ్ల నుంచి తరిమికొట్టారు. తాజా ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు కేవలం 2.57 శాతమే. అందువలన జనానికి దూరమైతే ఎవరికైనా ఇదే గతి అని లంక జనాలు చెప్పారు. మన దేశంలోని పార్టీలు దీన్ని గుణపాఠంగా తీసుకుంటాయా?

★

కవిత్వం

మాతృ హృదయ విలాపం

కొవ్వొత్తుల వెలుగులో
కరిగిన రెండు
కన్నీటి బొట్లు...
రుజువుల పర్వాల
బూజులు దులపలేని
ర్యాలీలు...
లింగ బేధమే కానీ
వయోబేధ మెరుగని
మదాంధుల
కిరాతక కీకారణ్యంలో...
జన్మించిన
స్థానం కోసం
నిర్లజ్జగా రాస్తున్న
మరణ శాసనం...
భారమైన మనసుతో
మసక బారినకళ్ళతో
తడబడే అక్షరాల నడుమ...
మళ్ళీ మళ్ళీ
అదే పాత కథనే
కొత్త శీర్షికతో చదివే
చేతకాని చవటలం...
భవిష్యత్తు తరాలకు
వారధిగా నిలిచే
అమ్మను ఆటబొమ్మలా
చిదిమేస్తుంటే...
నిస్సహాయంగా
గుండెలు అలిసేలా
మాతృ హృదయ విలాపం...
ఓం శాంతి అనికాదు
జై శక్తి అని నినదిద్దాం
నిద్రాణమై ఉన్న
ఆది పరాశక్తిని మేల్కొలుపుదాం...
ప్రతీ తల్లి
అపర సత్యభామై
పరాక్రమించాల్సిన తరుణం.

- శుభామహి నూచెర్ల

దసరాకు రాయదుర్గం మీదుగా ప్రత్యేక రైళ్లు

రాయదుర్గం : విజయదశమి పండుగ పురస్కరించుకుని బెంగళూరు నుంచి రాయదుర్గం మీదుగా విజయపుర నగరానికి ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు నైరుతి రైల్వే ముఖ్య సమాచార అధికారి మంజునాథ్ కనమడి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైన్ నెంబర్ 06501 ప్రత్యేక దసరా రైలు బెంగళూరులోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య టర్మినల్ (ఎస్ఎంవిటి) స్టేషన్ నుంచి అక్టోబర్ 9, 12వతేదీల్లో బెంగళూరు నుంచి సాయంత్రం 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2:20కు రాయదుర్గం స్టేషన్, 10:30కు విజయపుర స్టేషన్ చేరుతుందన్నారు. అలాగే ట్రైన్ నెంబర్ 06502 విజయపుర స్టేషన్ నుంచి ఆది, గురువారాల్లో సాయంత్రం గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2-28కి రాయదుర్గం, ఉదయం 11:15కు బెంగళూరు ఎస్ఎంవిటి స్టేషన్‌కు చేరుతుందన్నారు.

ప్రధాన నిందితుడు మైనరట!

- ఐదో తరగతి మార్కుల లిస్టు చూసి నిర్ధారించారట
- అయోధ్య సామూహిక లైంగికదాడి కేసులో కొత్త ట్విస్ట్
- బిజెపి నేత కుమారుడైనందునే కేసు నీరుకార్చేందుకు ఖాకీల ప్రయత్నం

అయోధ్య : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య జిల్లా సోహావల్ తాలూకాలో గత నెల ఓ దళిత యువతిపై సామూహిక లైంగికదాడి ఘటన నుంచి ఆ కుటుంబం ఇప్పటికీ తేరుకోలేపోతోంది. సర్వస్వం కోల్పోయామని యువతి తల్లి రోదిస్తోంది. కుటుంబ సభ్యులెవ్వరూ ఇంటి నుంచి బయటికి రావడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాలకు వెళ్లిన చిన్న కుమార్తెకు వేధింపులు తప్పడం లేదు. గత నెల 16-25 తేదీల మధ్య దళిత యువతిని అతిథి గృహంలో, గ్యారేజీలో నిర్బంధించి ఆమెపై పలుమార్లు సామూహిక లైంగికదాడి జరిపిన ఉదంతం సంచలనం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమె స్నేహితుడు సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడైన బాధిత యువతి స్నేహితుడు స్థానిక బిజెపి నేత కుమారుడు. అయోధ్య పోలీసులు అతనిని బాల నేరస్థుడిగా పేర్కొంటూ కేసు పెట్టారు. వివాహం చేసుకుంటానని నమ్మించి అతను తనతో శారీరక సంబంధం ఏర్పరచుకున్నాడని బాధిత యువతి తెలిపింది. యువతి ఫిర్యాదును స్వీకరించేందుకు తొలుత పోలీసులు నిరాకరించారు. ప్రధాన నిందితుడు బాల నేరస్థుడు కాదని ఆమె చెబుతున్న మాటలను వారు నమ్మడం లేదు. పైగా అతనిపై నమోదు చేసిన అభియోగాలు ప్రశ్నార్థకంగా ఉన్నాయి. మొత్తం తొమ్మిది మంది నిందితుల్లో ముగ్గురిపై సామూహిక ఆత్యాచారం కేసు, మరో ముగ్గురిపై లైంగిక వేధింపుల కేసు పెట్టారు. ప్రధాన నిందితుడిని బాల నేరస్థుడిగా ఎందుకు పరిగణించారని డిఎస్‌పి శైలేంద్ర సింగ్‌ను ప్రశ్నించగా, అతని ఐదో తరగతి మార్కుల జాబితా ఆధారంగా ఆ నిర్ధారణకు వచ్చామని బదులిచ్చారు. నేరం రుజువైతే బాల నేరస్థుడికి మూడేళ్లకు మించి జైలు శిక్ష పడదు.

సీనియర్ అధికారులను కలిసి, పరిస్థితిని వివరించిన తర్వాతే స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారని బాధిత యువతి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రధాన నిందితుడి కుటుంబ సభ్యులు అతని వయసును తక్కువగా చెప్పారని బాధితురాలి తల్లి తెలిపారు. 'అతను నాలుగేళ్లుగా మా అమ్మాయికి తెలుసు. మా అమ్మాయి 12వ తరగతి చదువుకునేటప్పుడు అతను కలిశాడు. ఆమెకు 20 సంవత్సరాల వయసు ఉంటే అతనికి పదహారున్నర సంవత్సరాలు ఎలా ఉంటాయి? అతని తండ్రి బిజెపి నాయకుడు. అందుకే ఆ పార్టీ వారెవ్వరూ మా ఇంటికి రావడం లేదు. మిగిలిన పార్టీల వారందరూ వచ్చి సాయం అందిస్తామని చెబుతుంటే బిజెపి నుంచి ఎవరూ రాలేదు' అని తెలిపారు. ప్రధాన నిందితుడి తండ్రి అయోధ్య బిజెపి విభాగం సమావేశాలకు హాజరయ్యేవాడని ఆయన ఫేస్‌బుక్ ప్రొఫైల్ చెబుతోంది. అయోధ్య ఎంపీ లల్లూ సింగ్, మాజీ ఎమ్మెల్యే వేద్ ప్రకాష్ గుప్తాతో అతను దిగిన ఫొటోలు కూడా ఉన్నాయి. అయితే వాటిని ఆ తర్వాత తొలగించారు.

హోటళ్లకు సిసి టివిలు

- చెఫ్‌లు, వెయిటర్లకు మాస్కులు
- యుపి సర్కారు ఆదేశాలు

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటోంది. పని సమయంలో చెఫ్‌లు, వెయిటర్లు మాస్కులు, గ్లౌవ్స్ ధరించాలని, ఆహార శాలల వద్ద సిసి టివిలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హోటళ్లు, జ్యూస్ షాప్‌ల వద్ద వాటి నిర్వాహకులు, మేనేజర్లు తమ పేర్లు, చిరునామాలు ప్రదర్శించాలని పేర్కొంది. లఖ్‌నవూలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో భాగంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. "ఆహారపదార్థాల్లో మానవ వ్యర్థాలు రావడం అసహ్యకరం. అవి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఆ తరహా ప్రవర్తనకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని సూచించారు. ఆహార పదార్థాల స్వచ్ఛతను కాపాడేలా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్‌కు తగిన సవరణలు చేయాలి" అని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

కదిరి కో-ఆపరేటివ్ సొసైటీలో అక్రమాలు

- సెంట్రల్ స్టోర్ నిధులు రూ.24 లక్షల స్వాహా .!
- ఎన్‌పి.కుంట మండలంలో రూ.28 లక్షలు
- నల్లచెరువు ఎస్.మొలకలపల్లి సొసైటీలో రూ.32 లక్షలు గోల్‌మాల్
- ఉద్యోగుల అరియర్స్‌లోనూ చేతివాటం



ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి డివిజన్‌లోని కదిరి రూరల్ మల్లయ్య గారి పల్లి 10, గొల్లొళ్లచెరువు, నల్లచెరువు ఎస్.మొలకల పల్లి 36, తలుపుల, నబులపులకుంట మండలంలో 28, గాండ్లపెంట మండలాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పంట పెట్టుబడి కోసం రైతులు పంట రుణాలు తీసుకున్నారు. వారు తీసుకున్న పంట రుణాలకు సంబంధించి సకాలంలో సహకార సంఘాల్లో సిబ్బందికి అసలు, వడ్డీ చెల్లించారు. ఇక్కడే సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. రైతుల నుంచి తీసుకున్న సొమ్ముకు సంబంధించి రసీదు ఇచ్చి భూమికి సంబంధించిన కంప్యూటర్ పోర్టల్‌లో కేవలం కంటితుడుపుగా చూపించి ఆ మొత్తం బ్యాంక్‌కు చెల్లించకుండా వారే స్వాహా చేసేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది రైతులు బ్యాంక్‌లో రుణం మంజూరుకు వెళ్తే సహకార సంఘాల్లో రుణం బకాయి ఉన్నట్లు చూపించడంతో అన్నదాతలు ఖంగుతిన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా వారు విచారణకు ఆదేశించారు.

అయితే ఈ విచారణ నామమాత్రంగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది. పంట రుణాల రెన్యూవల్ కాకపోవడంతో ప్రభుత్వం ద్వారా రైతులకు అందించాల్సిన రాయితీలు అందకుండా పోతున్నాయి.

ఉన్నతాధికారులకూ చేయి తడపాల్సిందే..!

కదిరి కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకులో పనిచేసే కొందరు ఉద్యోగస్తులకు అరియర్స్ ఇతరత్రా వ్యవహారాల్లో జిల్లా స్థాయి అధికారులకు చేయితడపందే చెల్లింపులు కాని పరిస్థితి ఉన్నట్లు సమాచారం. చేయితడపకపోతే ఉద్యోగులకు అరియెర్స్, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ చెల్లించని పరిస్థితులు ఉన్నాయి.

బైలాలో లేని చట్టం అమలు.!

డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్‌కు చేయి తడిపితే బైలాలో లేని చట్టాన్ని కూడా యథేచ్ఛగా అమలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని మండలాల సీఈవోలు ఉద్యోగ విరమణ వయస్సు దాటినా వారి నుంచి ముడుపులు పుచ్చుకుని మరో రెండేళ్లు పొడిగించేలా నిర్ణయం చేసేశారు. కొత్తగా ఉద్యోగ నియామకాలు లేకపోయినా, కొన్ని మండలాల్లో అనధికారికంగా నియమించినట్లు తెలుస్తోంది. సొసైటీ అభివృద్ధి కోసం నిజాయితీగా కష్టపడి పని చేసే వారికి మాత్రం ఉద్యోగోన్నతులు నేటికీ దక్కని పరిస్థితి ఉంది.

ఎస్ఆర్‌లోనూ అవకతవకలు

సొసైటీలో సిబ్బంది విధుల హాజరుకు సంబంధించిన ఎస్ఆర్‌లోనూ అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. సెంట్రల్ స్టోర్‌కు సంబంధించి సొంత ఇంట్లో పని చేస్తున్న సిబ్బంది 24 లక్షల రూపాయల రికవరీ చేయకుండా రూ.18 లక్షలు మాత్రమే చూపించి రైతులకు సంబంధించిన డబ్బులు సొసైటీ సిబ్బంది అడ్డగోలుగా బొక్కేసినట్లు విశ్వసనీయ సమాచారం. వీటిన్నింటిపై సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే అవినీతి అక్రమాలు పెద్ద ఎత్తున బయటకు వస్తాయని రైతులు చెబుతున్నారు.

జూన్‌కు పోర్టులో మొదటి షిప్ ల్యాండ్

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - నౌపడ (శ్రీకాకుళం)

వచ్చే ఏడాది జూన్ 12వ తేదీ నాటికి మూలపేట పోర్టులో మొదటి షిప్ ల్యాండ్ కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సంతబొమ్మాళి మండలంలోని మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. నిర్వాసితులు మంత్రికి పలు సమస్యలను విన్నవించారు. గతంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ఆర్మీ ఉద్యోగులకు పూర్తిస్థాయి పరిహారం ఇప్పిస్తామని చెప్పి సంతకాలు తీసుకున్నారని, నిబంధనలు పేరు చెప్పి సగం సొమ్ము మాత్రమే చెల్లించారని పలువురు ఆర్మీ ఉద్యోగులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయం గత ప్రభుత్వం ఉద్యోగులకు చెప్పలేదని, అయితే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ఉన్న నిబంధనలు మేరకే పరిహారం అందిస్తామని మంత్రి చెప్పారు. తనకు 11 ఎకరాలు ఉంటే కేవలం రెండు ఎకరాలే రికార్డుల్లో చూపిస్తున్నారని గ్రామానికి చెందిన నారంనాయుడు వాపోయారు. దీనిపై మంత్రి స్పందిస్తూ నష్టపరిహారంపై అధికారులతో క్రాస్ చెక్ చేయించి గ్రామసభలో వినిపిస్తామని హామీనిచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పోర్టు కోసం ఇచ్చిన 350 ఎకరాల పంట పొలాల రీ సర్వే కోసం కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలలో జీడి, మామిడి చెట్లకు గతంలో కొంతమందికి పోర్టు యాజమాన్యం చెల్లింపులు చేసిందని, మిగతా వారి వివరాలనూ సేకరించి వారితోనే పరిహారం చెల్లిస్తామని చెప్పారు. మిగిలిన 41 ఎకరాలు వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. ఇప్పటివరకు పరిహారం అందుకోని నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం తక్షణమే అందజేస్తామన్నారు. అనంతరం విజయవాడ వరద బాధితులకు డిసిసిబి ఉద్యోగులు సిఎం సహాయనిధికి ఒక్కరోజు వేతనం విరాళంగా రూ.5,02,846 చెక్కును మంత్రికి అందజేశారు. సమావేశంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, ఆర్‌డిఒ సుదర్శన్ దొర, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, రెవెన్యూ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

తన భూమికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తూ సోమవారం ఉదయం అనంతపురం కలెక్టరేట్లో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తీవ్ర అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఈ రైతు మంగళవారం ఉదయం మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణకు సంబంధించి తన తండ్రి నుంచి వారసత్వంగా 1.54 ఎకరాల వ్యవసాయ భూమి వచ్చింది. ఈ భూమికి సంబంధించి తనకు పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని పలుమార్లు మండల, జిల్లా రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. ఇదే సమస్యపై సోమవారం నాడు కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసేందుకు రైతు సూర్యనారాయణ వచ్చారు. అక్కడ కూడా తనకు న్యాయం జరగదన్న మనస్థాపనతో కలెక్టర్ కార్యాలయం ఆవరణలోనే పురుగుల మందు తాగాడు. వెంటనే అక్కడున్నవారు స్పందించి అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం ఆయన మరణించాడు. సూర్యనారాయణ మృతికి అధికారులే కారణం అంటూ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పట్టాదారు పాసు పుస్తకం సమస్యను పరిష్కరించాలని ఎన్నిమార్లు అధికారులకు మొర పెట్టుకున్న ఎవరూ పట్టించుకోలేదని కన్నీటి పర్యంతమయ్యారు.

లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ

- నిజానిజాలు నిగ్గు తేల్చాలి
- మాజీ స్పీకర్ తమ్మినేని డిమాండ్

ప్రజాశక్తి - ఆమదాలవలస (శ్రీకాకుళం)

తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగిస్తున్నారన్న ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని మాజీ స్పీకర్, వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతానికి పైగా హిందువులున్నారని, వారి మనోభావాలను దెబ్బతీసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతారహితంగా మాట్లాడడం తగదన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను ఉన్నతస్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. ప్రసాదం కోసం వాడే పదార్థాల్లో నాణ్యత విషయంలో లోపభూయిష్టంగా ఉన్నట్లు అధికారులు గుర్తిస్తే, సదరు కాంట్రాక్టు సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టేవారని చెప్పారు. టిటిడి ప్రయోగశాలలో నిర్వహించిన పరీక్షల్లో నాణ్యత సరిగా లేని నెయ్యి ట్యాంకర్లను 14 సార్లు చంద్రబాబు హయాంలో వెనక్కి పంపిస్తే, జగన్ పాలనలో 18 సార్లు వెనక్కి పంపించారని తెలిపారు. జంతువుల కొవ్వు కలిపిన నెయ్యితో తయారు చేసే లడ్డూలు గానీ ఇతర ఆహార పదార్థాలు గానీ దుర్వాసన వస్తుందని ఆహార పరిశోధకులు స్పష్టం చేశారన్నారు. సాధారణంగా కల్తీ చేయాలనుకునే వ్యాపార సంస్థలు పామాయిల్, హైడ్రోజనేటెడ్ కూరగాయల కొవ్వు కలుపుతారని... దీనివల్ల తక్కువ వ్యయంతో ఎక్కువ లాభార్జనకు అవకాశముంటుందన్నారు. లడ్డూ తయారీకి మెటీరియల్ ఎవరు సరఫరా చేసినా నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్ సర్టిపై చేయాల్సి ఉంటుందని తెలిపారు. వైసిపి పాలనలో లడ్డూ కోసం వాడిన ప్రతి పదార్థాన్నీ ఈ లేబొరేటరీ నిర్ధారణ చేసిందన్నారు. టిటిడి విశిష్టతను నలుదిక్కులా చాటి చెప్పాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయాల కోసం నిస్సిగ్గుగా వాడుకోవడం బాధాకరమన్నారు.

మద్యంలో సగం వాటా మాకే..!

- మద్యం దుకాణాలపై గుత్తాధిపత్యం కోసం ప్రజాప్రతినిధుల ప్లాన్
- లాటరీ ఎవరేయాలో సైతం వారే నిర్ణయం
- లాటరీలో పాల్గొనాలనుకునే వ్యాపారులను గుర్తించి ముందుగానే ఫోన్లు
- డెల్టాలోని ఓ ప్రజాప్రతినిధి కుమారుడు నిర్వాకంపై సర్వత్రా చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మద్యం పాలసీని మార్పు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మద్యం దుకాణాలపై గుత్తాధిపత్యం కోసం ప్రజాప్రతినిధులు ప్రణాళికలు రచిస్తున్నారు. మద్యం దుకాణం ఎవరు దక్కించుకున్నా సగంవాటా తమకు ఇవ్వాల్సిందేనంటూ ఇప్పటి నుంచే హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. డెల్టాలోని ఓ ప్రజాప్రతినిధి కుమారుడు కొంతమంది వ్యాపారులకు ముందుగానే ఫోన్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రతిచోటా ఇదేవిధంగా ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో గత ప్రభుత్వం అనుసరించిన మద్యం పాలసీని మార్పు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటి వరకూ ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం అమ్మకాలు సాగాయి. ఇక నుంచి మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అక్టోబర్ 15వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేసింది. దీంతో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు మద్యం దుకాణాలు తమ కనుసన్నల్లో నడిచేలా వ్యూహాలు రచిస్తున్నారని సమాచారం. గతంలో లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించినప్పుడు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 473 మద్యం దుకాణాలు ఉండేవి. జిల్లాల విభజన జరగడంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని 47 మండలాల పరిధిలో 400కుపైగా మద్యం దుకాణాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. రెండు జిల్లాల్లో 14 నియోజకవర్గాలు ఉండగా తక్కువగా లెక్కించినా నియోజకవర్గ పరిధిలో 30 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నట్లు అంచనా వేస్తున్నారు. మద్యం దుకాణాలపై ఆధిపత్యం తెచ్చుకుంటే ఐదేళ్లపాటు భారీగా సొమ్ము దండుకోవచ్చునని ప్రజాప్రతినిధులు ప్రణాళికలు రచించి ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

లాటరీలోనూ సిండికేట్ విధానానికి ప్లాన్

కొత్త మద్యం పాలసీ ప్రకారం లాటరీ విధానంలో మద్యం దుకాణాల కేటాయింపు ఉంటుంది. లాటరీలో పాల్గొనేవారు రూ.రెండు లక్షలు నాన్ రిఫండబుల్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. లాటరీలో దుకాణం దక్కినా, దక్కకపోయినా ఆ సొమ్ము తిరిగివ్వరు. లాటరీలో ఎంత ఎక్కువమంది పాల్గొంటే అంత పెద్దమొత్తంలో సొమ్ము ప్రభుత్వానికి లభిస్తుంది. దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు కాలపరిమితి రెండేళ్లు ఉంటుంది. లైసెన్స్ ఫీజు కింద ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షల వరకూ ఉండనుంది. జనాభా ప్రాతిపదికన దుకాణాల కేటాయింపు జరగనుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. లాటరీలో ఎక్కువ మంది పాల్గొనకుండా సిండికేట్ విధానానికి ప్రజాప్రతినిధులు ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. మద్యం దుకాణాల లాటరీలో పాల్గొనాలని ఆలోచిస్తున్న వ్యాపారులను ముందుగానే గుర్తించి ప్రజాప్రతినిధులు వారికి తమ అనుయాయులతో ఫోన్లు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. దుకాణం ఎవరు దక్కించుకున్నా వ్యాపారంలో 50 శాతం తమకు ఇవ్వాలని వ్యాపారులకు ముందుగానే చెబుతున్నట్లు తెలిసింది. లేకపోతే తీవ్ర ఇబ్బందులు వస్తాయని హెచ్చరిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ప్రజాప్రతినిధులు సిండికేట్ విధానంతో ముందుకు సాగితే లాటరీలో పాల్గొనే వారి సంఖ్య తగ్గిపోతుంది. దీంతో ప్రభుత్వానికి నాన్ రిఫండబుల్ ఫండ్ రూపంలో వచ్చే ఆదాయానికి భారీగా గండిపడనుంది. గౌడ్ సామాజిక వర్గానికి 10 శాతం దుకాణాలను కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆ దుకాణాలు సైతం ఎవరికి రావాలో ప్రజాప్రతినిధులే నిర్ణయిస్తున్నట్లు చర్చ సాగుతోంది. మద్యం దుకాణాల ఆదాయంలో 50 శాతం ప్రజాప్రతినిధులకు ఇవ్వాలన్న నిబంధనపై వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు సైతం ప్రజాప్రతినిధుల ప్రణాళికలకు వంత పాడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో పాటు మద్యం దుకాణాల వ్యాపారులు నిబంధనలతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా రెచ్చిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ముందుగానే ప్రజాప్రతినిధుల జోక్యాన్ని అడ్డుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

10 మంది డిఎస్‌పిలు బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పది మంది డిఎస్‌పిలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు డిజిపి ద్వారకా తిరుమలరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డి లక్ష్మణరావు, సిహెచ్ రవికాంత్, ఎం సుధాకర్‌రావుతో పాటు నర్సీపట్నం డిఎస్‌పి జికెఆర్ మోహన్‌ను ఇంటెలిజెన్స్ డిఎస్‌పిగా వేశారు. ఎసిబి డిఎస్‌పి బివిఎస్‌ఎస్ రమణమూర్తి, వెయిటింగ్‌లో ఉన్న ఎస్ కోటారెడ్డి, మత్యా శ్రీనివాసరావు, మచిలీపట్నం డిఎస్‌పి ఎమ్‌డి అబ్దుల్ సుభానీను సిఐడి డిఎస్‌పిలుగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న పి రామచంద్రరావును విజయవాడ ట్రాఫిక్ 1 ఎసిపిగా, విజయవాడ ఎస్‌బిలో ఉన్న కెవివిఎన్‌వి ప్రసాద్‌ను నూజివీడు డిఎస్‌పిగా బదిలీ చేశారు.

రెరా అథారిటీలో సభ్యుల సంఖ్య పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీలో సభ్యుల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉండగా, దాన్ని ఐదుగురికి పెంచారు. ఇప్పుడు ఏడుగురు సభ్యులు ఉండేలా రెరా చట్టంలో సవరణలు చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రూల్స్ 2017కు సవరణలు చేశారు.

ఉచితంగా డూప్లికేట్ డాక్యుమెంట్స్

● జిఓ ఎంఎస్ నెంబరు 14 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, భారీ వర్షాలతో డాక్యుమెంట్లు, సర్టిఫికెట్స్, డ్రైవింగ్ లైసెన్సులు నీటిలో నానిపోవడం, పనికిరాకుండాపోయిన సంగతి తెలిసిందే. అటువంటి వారి సర్టిఫికెట్లు ఒరిజనల్ స్థానంలో డూప్లికేట్ డాక్యుమెంట్లను ప్రభుత్వం వారికి ఉచితంగా ఇవ్వనుంది. ఇందుకు సంబంధించిన జిఓ ఎంఎస్ నెంబరు 14ను మంగళవారం విడుదల చేసింది.

నేడు జమ్ముకాశ్మీర్ రెండో దశ ఎన్నికలు

● బరిలో ఒమర్‌సహా పలువురు ప్రముఖులు

రాజౌరి : జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నిక రెండో దశ పోలింగ్ బుధవారం జరగనుంది. ఈ నెల 18న మొదటిదశ పోలింగ్ జరగ్గా, అక్టోబర్ 1న మూడో దశ పోలింగ్ జరగనుంది. ఆరు జిల్లాల్లో 26 అసెంబ్లీ స్థానాలకు బుధవారం పోలింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికలు జరిగే ప్రాంతాలకు భద్రతా దళాలు మోహరించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాయి. కంగన్ (ఎస్‌టి), గందర్‌బల్, హజ్రత్‌బాల్, ఖన్యార్, హబ్బకదల్, లాల్ చౌక్, చన్నపోరా, జదిబాల్, ఈద్గా, సెంట్రల్ షాల్టెంగ్, బుద్గామ్, బీర్వా, ఖాన్ సాహిబ్, చ్రార్-ఇ-షరీఫ్, చదూరా, గులాబ్‌గఢ్ (ఎస్‌టి) వంటి కీలక స్థానాలకు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. రెండో దశలో పలువురు ప్రముఖులు పోటీ చేస్తున్న స్థానాలు కూడా ఉన్నాయి. జమ్ము కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తున్న రెండు స్థానాలు బుద్గామ్, గందర్‌బల్ స్థానాలకు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. జమ్ముకాశ్మీర్ బిజెపి చీఫ్ రవీందర్ రైనా బరిలో నిలిచిన నౌషెరా స్థానానికి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తారిఖ్ హమీద్ కర్రా పోటీ చేస్తున్న సెంట్రల్ - షాల్ టెంగ్ స్థానానికి బుధవారం పోలింగ్ జరగనుంది.

ఇసుక రవాణాలో నిర్దేశించిన ధరలే వసూలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఉచిత ఇసుక రవాణాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన రవాణా ఛార్జీలను మాత్రమే వసూలు చేయాలని, అలాగే ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఇసుక రవాణాకు సంబంధించి లారీల యజమానులు.. ప్రభుత్వం తరపున మంత్రి కొల్లు రవీంద్ర, ముఖేష్‌కుమార్ మీనాతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ప్రభుత్వం నిర్దేశించిన విధానంలోనే రవాణా కార్యకలాపాలు నిర్వహించేందుకు వారు అంగీకరించారు. లారీ యజమానుల సంఘాలతో ఉదయం నుండి పలు దఫాలుగా చర్చలు జరిపి, వారి

● లారీ యజమానులతో ఎంకె మీనా

అనుమానాలను నివృత్తి చేశారు. ప్రధానంగా ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం కోసం లారీ యజమానులకు డీజిల్, అఫిడవిట్ విధానం ప్రవేశపెట్టగా, దాని నుండి మినహాయించాలని వారు కోరారు. దానికి ప్రభుత్వ పక్షాన మంత్రి రవీంద్ర అంగీకరిస్తూ దాని స్థానంలో రిజిస్ట్రేషన్ విధానం అమలవుతుందన్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనని, ఇందుకు అవసరమైన సవరణ మార్గదర్శకాలను బుధవారం జారీ చేస్తామన్నారు. జిపిఎస్ ఆధారిత విధానం తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా ఛార్జీలను పాటించాలని, రిజిస్ట్రేషన్ తప్పనిసరని ముఖ్యమంత్రి ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారన్నారు. యాప్ ద్వారా మాత్రమే ఎగుమతి అనుమతులు మంజూరవుతాయని ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. రవాణా వర్గాల గత రెండు, మూడు రోజులుగా ఏర్పడిన స్వల్ప అడ్డంకులు తొలగిపోయాయని, బుధవారం నుండి పెండింగ్‌లో ఉన్న ఇసుక లోడింగ్‌ను కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఈ చర్చల్లో గనులు, భూగర్భశాఖ సంచాలకులు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్‌గా టిడిపి సీనియర్ నాయకుడు, మచిలీపట్నం మాజీ ఎంపి కొనకళ్ల నారాయణను టిడిపి కూటమి నియమించింది. అలాగే వైస్ ఛైర్మన్‌గా కుప్పం నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకుడు పిఎస్ మునిరత్నంను ప్రకటించింది. కొనకళ్ల నారాయణ టిడిపిలో సీనియర్ నాయకుడు. 2009, 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టిడిపి టికెట్‌పై రెండు పర్యాయాలు పార్లమెంటుకు ఎన్నికయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి బాలశౌరి చేతిలో ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పొత్తులో భాగంగా మచిలీపట్నం సీటును జనసేనకు కేటాయించడంతో కొనకళ్ల నారాయణకు పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. ఎంపి సీటును త్యాగం చేసినందుకే ఆయనకు కీలకమైన ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్ పదవిని సిఎం చంద్రబాబు కట్టబెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే వైస్ ఛైర్మన్‌గా కుప్పం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పిఎస్ మునిరత్నంను నియమించింది.

ఉద్యోగ, కార్మిక సంఘాల హర్షం

ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్‌గా మాజీ ఎంపి కొనకళ్ల నారాయణను నియమించడం పట్ల ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్, ఎపిపిటిడి నేషనల్ మజ్దూరు యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య, ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, వై శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. కొనకళ్ల నారాయణ ఆర్‌టిసి బలోపేతానికి పూర్తి సహకారం అందించాలని వారు కోరారు.

కాంతిరాణా టాటా పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి
సినీ నటి కాదంబరి జత్వానీ కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఐపిఎస్ అధికారి కాంతిరాణా టాటా, ఇబ్రహీంపట్నం నాటి సిఐ ఎం సత్యనారాయణ వేర్వేరుగా వేసిన పిటిషన్లలో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇదే కేసులో టాటాకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదంటూ ఇంప్లీడ్ పిటిషన్ వేసిన నటి జత్వానీకి కూడా నోటీసులిచ్చింది. విచారణను అక్టోబరు ఒకటికి వాయిదా వేస్తూ జస్టిస్ విఆర్ కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మరో ఐపిఎస్ అధికారి విశాల్ గున్నీ వేసిన పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ జరపనుంది.

రిటైర్డు అదనపు ఎస్‌పికి చుక్కెదురు

మాజీ ఎంపి, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ సిఐడి రిటైర్డు అదనపు ఎస్‌పి విజయ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ విఆర్ కృపాసాగర్ తీర్పు చెప్పారు. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలకు సంబంధించినదని, నిందితుడిగా కస్టడీలో ఉన్న వ్యక్తి తన హక్కులకు ముప్పు వాటిల్లుతోందని ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. పోలీస్ అధికారిగా విజయ్‌పాల్‌పై అభియోగాలు తీవ్రమైనవని, ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ఎఫ్‌ఐఆర్‌లోని ఆరోపణలు తీవ్రమైనవని చెప్పారు. రెండు వైపులా వాదనలు విన్న తర్వాత ఈ కేసులో రాజకీయ కుట్ర ఉందని స్పష్టం అవుతోందని అభిప్రాయపడ్డారు. పోలీసు అధికారులు నిందితులుగా ఉన్నప్పుడు ముందస్తు బెయిల్ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల ప్రకారం పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో నమోదైన కేసులో తనను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారంటూ రఘురామ కృష్ణరాజు గుంటూరు నగరపాలెం సిఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న విజయ్‌పాల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది.

గోదావరి నిషేధిత ప్రాంతంలోఅక్రమంగా చేపల వేట

ప్రజాశక్తి- దేవీపట్నం (అల్లూరి జిల్లా)
పోలవరం ప్రాజెక్టు కాపర్ డ్యాం నుంచి పాపికొండల అభయారణ్యం వరకు గోదావరిలో అక్రమంగా చేపల వేట సాగుతోంది. ఇది చేపల వేట నిషేధిత ప్రాంతం కాగా, కొంత మంది మాఫీయాగా ఏర్పడి, బయట నుండి వేటగాళ్లను, పడవలను, వందల కొద్దీ వలలను తీసుకొచ్చి దర్జాగా వేట సాగిస్తున్నారు. చిన్న చేపలతో సహా అన్నింటిని ఊడ్చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో గోదావరిలో మత్స్య సంపద ఉనికికే ప్రమాదం ఏర్పడింది. ఇంత జరుగుతున్నా ముడుపుల మత్తులో ఉన్న అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం (కాపర్ డ్యామ్) నుంచి పాపికొండల వరకు అభయారణ్యం కింద ప్రకటించింది. ఈ ప్రాంతంలోని గోదావరిలో చేపల వేటను నిషేధించింది. అయితే కొంతమంది మాఫియాగా ఏర్పడి చేపల వేట నిషేధం ఉన్న అభయారణ్య ప్రాంతంలో వేట సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రధానంగా నక్కపల్లి, కొవ్వూరు, కాకినాడ వంటి ప్రాంతం నుండి పడవలను, వేటగాళ్లను, వందల కొద్దీ వలలను తీసుకొచ్చి ఇష్టానుసారంగా గోదావరిని జల్లెడ పడుతున్నారు. అతి చిన్న చేప పిల్లల నుంచి పెద్ద చేపల వరకు పట్టి వీరవరం నుంచి ఐస్ బాక్సుల్లో పెట్టి దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అధికారులకు లక్షల రూపాయలు దళారులు ముట్టజెబుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయంటే ఇది ఎంత పెద్ద వ్యవహారమో ఇట్టే అర్థమవుతుంది. ఇలా నిషేధిత ప్రాంతంలో అక్రమంగా చేపల కొనసాగితే గోదావరి నదిలో మత్స్య సంపద పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉందని స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాపికొండల అభయారణ్య ప్రాంతం గోదావరిలో సాగుతున్న అక్రమ చేపల వేటను నిలువరించాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే నానాజీపై కేసు నమోదు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్
ఆర్‌ఎంసి వైద్యులు డాక్టర్ ఉమామహేశ్వరరావుపై దాడి సంఘటనకు బాధ్యుడుగా చేస్తూ ఎంఎల్‌ఎ పంతం నానాజీపై సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వైద్యుడు ఉమామ హేశ్వరరావును అసభ్య పదజాలంతో దూషించి, ఎంఎల్‌ఎతోపాటు, అతని అనుచరులు కలిసి భౌతికంగా దాడికి పాల్పడ్డారని వచ్చిన ఫిర్యాదుపై ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో సర్పవరం సిఐ బొక్కా పెద్దిరాజు 485/2024, 292, 115(2), 351, 126(2) రెడ్‌విత్ 3(5)సెక్షన్లతో కూడిన ఎఫ్‌ఎఆర్‌ను ఫైల్ చేసి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా అట్రాసిటీ యాక్ట్ కూడా నమోదు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) కోరింది.

బంగారం భగభగలు

● అందనంత స్థాయికి ఎగిసిన ధర

న్యూఢిల్లీ : బంగారం సామాన్యుడు కొనలేని స్థాయికి చేరింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధానాలతో ప్రపంచ మార్కెట్‌లో అపరంజి ధర అందనంత స్థాయికి ఎగుస్తోంది. మంగళవారం అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం ధర 0.22 శాతం పెరిగి 2658.30 డాలర్లకు చేరి ఆల్‌టైం గరిష్ట స్థాయిని తాకింది. మున్ముందు వడ్డీ రేట్లను మరింత తగ్గిస్తామని యుఎస్ ఫెడ్ రిజర్వు ప్రకటించడంతో పసిడిపై పెట్టుబడులు పెరుగుతున్నాయి. దీంతో ధర పెరుగుతోంది. సోమవారం ఔన్స్ బంగారం 0.04 శాతం పెరిగి 2647.30 డాలర్లుగా చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లోనూ మంగళవారం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.210 పెరిగి ఏకంగా రూ.76,510కి చేరింది. 22 క్యారెట్లపై రూ.200 పెరిగి రూ.70,150గా నమోదయ్యింది. కిలో వెండి ధర రూ.93వేలకు ఎగిసింది. అమాంతం ఎగిసిన బంగారం, వెండి ధరలు ప్రస్తుత పండగ సీజన్‌లో వినియోగదారులను తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయి.

లడ్డూ వివాదం.. ఏమాత్రం తగ్గని సేల్స్

అమరావతి : తిరుపతి లడ్డూ కల్తీ వివాదం జరుగుతున్న నేపథ్యంలో.. తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూలు రికార్డు స్థాయిలో అమ్ముడుపోయాయి. కేవలం నాలుగు రోజుల్లోనే పద్నాలుగు లక్షల లడ్డులు అమ్ముడుపోయాయని సమాచారం. సెప్టెంబర్ 19 తేదీన 3.59 లక్షలు, సెప్టెంబర్ 20వ తేదీ 3.17 లక్షలు, సెప్టెంబర్ 21 3.671 లక్షలు, సెప్టెంబర్ 22వ తేదీన 3.60 లక్షల లడ్డూలు అమ్ముడుపోయాయని తాజాగా న్యూస్ పోర్టల్ నివేదిక వెల్లడించింది. ఈ లడ్డూ వివాదం కాకముందు ప్రతిరోజూ 3.50 లక్షల లడ్డూలు అమ్ముడుపోయేవి. ఈ వివాదం రాజుకున్న తర్వాత అత్యధికంగా అమ్ముడుపోయాయి. తిరుపతికి భక్తులు కూడా వేలాది మంది తరలి వస్తున్నారు. ప్రతిరోజూ 60 వేల మంది భక్తులు వస్తున్నారని న్యూస్ పోర్టల్ నివేదిక తెలిపింది. కాగా, గత ప్రభుత్వం వైఎస్‌ఆర్‌సిపి హయాంలో తిరుపతి లడ్డూ తయారీలో స్వచ్ఛమైన నెయ్యికి బదులు, జంతువుల కొవ్వుని ఉపయోగించారని సాక్ష్యాత్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. దీంతో లడ్డూపై మీడియాలోనూ, ఇటు పార్టీల్లోనూ చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే.

తెలంగాణలో పలు జిల్లాల్లో నేడు, రేపు పలుచోట్ల భారీ వర్షాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ రాష్ట్రంలో బుధ, గురు వారాల్లో పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. 25వ తేదీకి సంబంధించి ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాలకు, 26న ఆదిలాబాద్, కొమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. అదే సమయంలో రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లోనూ గంటకు 30 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో మోస్తరు వానలు అక్కడక్కడా పడే అవకాశముందని పేర్కొన్నారు.

‘భోగాపురం’ నిర్వాసితుల సంగతేంటి?

● అదనపు భూములకు అందని పరిహారం ● రిజిస్ట్రేషన్లకు నోచని ఆర్ అండ్ ఆర్ ఇళ్లు ● 18 ఏళ్లు నిండిన యువతకు అందని ప్యాకేజీ



మరడపాలెంలో ఇల్లు కూల్చివేయడంతో సామగ్రితో బయట వేచి ఉన్న మహిళ (ఫైల్)

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి
భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పనులు వేగవంతంగా జరుగుతున్నా దీని నిర్మాణానికి భూములు, ఊళ్లు త్యాగం చేసిన నిర్వాసితుల్లో కొందరికి పరిహారం, యువతకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నేటికీ అందలేదు. తమకు న్యాయం చేయాలని కోరుతూ అధికారులు, మంత్రుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకుండా ఉంది. విమానాశ్రయం కోసం భోగాపురం మండలంలో 2,700 ఎకరాలు భూమి సేకరించారు. దీంతో, బొల్లెంకులపాలెం, ముడసర్లపేట, మరడపాలెం, రెల్లిపేట పూర్తిగా కనుమరుగయ్యాయి. మరికొన్ని ఊళ్లకు చెందినవారు తాతదండ్రుల నుంచి సాగు చేసిన భూములు వదులు కోవాల్సి వచ్చింది. వీరిలో కొంతమంది నష్టపరిహారానికి, మరికొంతమంది పునరావాసానికి, ఇళ్ల రిజిస్ట్రేషన్లకు నోచుకోలేదు. అదనంగా సేకరించిన భూములకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. పరిహారం ఇచ్చినప్పటికీ స్థానికంగా రేషన్ కార్డు లేదనే సాకుతో 74 కుటుంబాలకు పునరావాసం కల్పించలేదు. సుమారు 200 ఎకరాల ప్రభుత్వ, బంజరు భూములను 60 ఏళ్లకుపైగా సాగు చేసుకున్న 70 రైతు కుటుంబాలకు పట్టాలు లేవనే సాకుతో నష్టపరిహారం ఇవ్వలేదు. భూసేకరణలో భాగంగా గ్రామాలను తరలించేనాటికి 18 ఏళ్లు నిండిన యువతకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేస్తామని టిడిపి ప్రభుత్వం అప్పట్లో హామీ ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదు. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నా దీనిపై నోరు మెదపడం లేదు. సుమారు 62 మంది యువతీ, యువకులు ఆర్ అండ్ ప్యాకేజీ కోసం ఎదురుచూస్తున్నారు. పవర్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ (పిఒటి) ల్యాండ్స్ సాగుదారులు కూడా నేటికీ పరిహారానికి నోచుకోలేదు. పునరావాస కాలనీల్లోని ఇళ్లను నిర్వాసితుల పేరున రిజిస్ట్రేషన్ చేయలేదు. దీంతో, ఆ ఇళ్లను పెళ్లిళ్లు, వైద్య ఖర్చులు వంటి అత్యవసర పరిస్థితుల్లోనూ తాకట్టుపెట్టేందుకుగానీ, విక్రయించుకునేందుకుగానీ వీలు కావడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, కేంద్ర విమానాయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వారు ఇటీవల వినతిపత్రాలు అందజేశారు.

సబ్-డివిజన్ చేయడంలోనూ నిర్లక్ష్యమే


ఒకే సర్వే నెంబర్‌లో ప్రభుత్వం సేకరించగా మిగిలిన భూమిని సబ్-డివిజన్ చేయలేదు. దీంతో, రైతులు క్రయవిక్రయాల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బైరెడ్డిపాలేనికి చెందిన బైరెడ్డి రామకృష్ణకు కంచేరు రెవెన్యూ పరిధిలో ఒకే సర్వే నెంబరులో 2.7 ఎకరాల భూమి ఉండేది. ఇందులో 2.5 ఎకరాలను ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం తీసుకుంది. మిగిలిన రెండు సెంట్ల భూమిని సబ్-డివిజన్ చేసి అప్పగించలేదు. ఎ.రావివలస, కంచేరు, కంచేరుపాలెం, గూడెపువలస తదితర గ్రామాల్లో ఇలాంటి బాధితులు ఎక్కువమందే ఉన్నారు. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అదనంగా 39.86 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. అప్పటి ఆర్‌డిఒ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా పాత రికార్డుల (ఎఫ్‌సిఒల) ఆధారంగా రైతుల జాబితాను తయారు చేశారు. ఆ ప్రకారం సుమారు రూ.22.50 కోట్లు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అవార్డులు ప్రభుత్వం పాస్ చేసింది. ఆయా రైతుల్లో కొంతమంది చనిపోవడం, మరికొంతమంది భూములు విక్రమించుకోవడం వంటివి జరిగినట్టు తేలడంతో వారి ఖాతాల్లో డబ్బులు జమచేయడం కుదరలేదు. ఆ డబ్బులను విశాఖపట్నం ట్రిబ్యునల్ కోర్టులో అప్పటి ఆర్‌డిఒ తిరిగి జమచేశారు. పరిహారం కోసం రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఎయిర్‌పోర్టు నిర్వాసితుల oదరికీ పరిహారం చెల్లించాం. పునరావాసం కల్పించాం. 2015 ఆగస్టు 31 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఆర్ అండ్ ఆర్ కింద పరిహారం ఇచ్చాం. స్థానికంగా రేషన్ కార్డులు ఉన్న వారందరికీ పునరావాసం కల్పించాం. భూమి పట్టాలున్న వారికి నష్టపరిహారం చెల్లించాం. ఆధారాలు లేని వారు వినతులు ఇస్తున్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

-ఎంవి సూర్యకళ, ఆర్‌డిఒ


ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో అవస్థలు



విమానాశ్రయం నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోయాం. ఇంటికి బదులు స్థలం కేటాయించి, ఇంటిని నిర్మించి ఇచ్చినా మా పేరున రిజిస్ట్రేషన్ చేయలేదు. ఇది కేవలం నా సమస్య మాత్రమే కాదు. ఆర్ అండ్ ఆర్ కాలనీలోని అందరూ ఇదే సమస్య ఎదుర్కొంటున్నారు.

-కోరాడ రాము, ఆర్ అండ్ ఆర్ కాలనీ, మరడపాలెం

ఇబ్బంది పడుతున్నాం



మేము నలుగురు అన్నదమ్ములం. ఉమ్మడిగా ఒకే సర్వే నెంబర్‌లో 4.10 ఎకరాల భూమి ఉండేది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 4.4 ఎకరాలు ప్రభుత్వం తీసుకుంది. మిగిలిన ఆరు సెంట్ల భూమిని సబ్-డివిజన్ చేసి మాకు అప్పగించలేదు. దీంతో, దాన్ని పంచుకోవడానికిగానీ, విక్రయించుకోవడానికిగానీ వీలు లేకుండాపోయింది.

-పిన్నింటి అప్పన్న, కౌలువాడ రెవెన్యూ పరిధి

సీతారాం ఏచూరికి ఘన నివాళి



అగర్తలాలో సీతారాం ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రకాశ్‌కరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం నేత సీతారాం ఏచూరికి లండన్‌లోనూ, త్రిపుర రాజధాని అగర్తలాలోనూ మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ యునైటెడ్ కింగ్‌డమ్ ఆధ్వర్యాన లండన్‌లోని మార్క్స్ మెమోరియల్ లైబ్రరీలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ మంగళవారం జరిగింది. ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మాజీ అధ్యక్షుడు సీతారాం ఏచూరి జీవితం, వారసత్వాన్ని కొనసాగిస్తామని, అదే ఆ మహానేతకు మనమిచ్చే ఘనమైన నివాళి అని నేతలు పేర్కొన్నారు. సభలో ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, ఇండియన్ వర్కర్స్ అసోసియేషన్ (జిబి) వైస్ ప్రెసిడెంట్ హర్సేవ్ బెయిన్స్, నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్, మారిటైమ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ నేషనల్ ప్రెసిడెంట్ అలెక్స్ గోర్డాన్, క్యూబా ఎంబసి నుండి ఎకనామిక్ కౌన్సెలర్ కామ్రేడ్ మార్తా కాస్టిల్లో ప్రసంగించారు. ఎస్‌ఎఫ్‌ఐ యుకె సెక్రటరీ నిఖిల్ మాథ్యూ, యంగ్ కమ్యూనిస్ట్ లీగ్ ఆఫ్ బ్రిటన్ లండన్ సెక్రటరీ బెన్ వుడ్‌వర్డ్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ బ్రిటన్ లండన్ సెక్రటరీ రాబిన్ టాల్బోట్, సోషలిస్ట్ చైనా ఫ్రెండ్స్ కో-డైరెక్టర్ కార్లోస్ మార్టినెజ్ తదితరులు పాల్గొన్నారు. సభ తరువాత ఎస్‌ఎఫ్‌ఐ, వైసిఎల్ మధ్య ద్వైపాక్షిక చర్చ జరిగింది. రెండు సంస్థల మధ్య అంతర్జాతీయ సంఘీభావ తక్షణ ఆవశ్యకతపై మార్క్స్ మెమోరియల్ లైబ్రరీలో వైసిఎల్ ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ ప్రసంగించారు.



లండన్ సభలో మాట్లాడుతున్న హర్సేవ్ బెయిన్స్

త్రిపుర రాజధాని అగర్తలలో మంగళవారం నిర్వహించిన సీతారాం ఏచూరి సంస్మరణ సభలో పలువురు నేతలు ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, మాణిక్ సర్కార్, కేంద్ర కమిటీ సభ్యులు జితేంద్ర చౌదరి తదితరులు ప్రసంగించారు. 'సీతారాం చాలా చిన్న వయసులో మార్క్సిజాన్ని అర్థం చేసుకోవడంలో, దానిని ఎలా విశ్లేషించడంలో, సమాజానికి దానిని అన్వయించడంలో దిట్ట అని అన్నారు. మన వర్గ పోరాటం మన దేశానికే పరిమితం కాదన్న విషయాన్ని కమ్యూనిస్టు, మార్క్సిస్టు దృక్కోణంలో సీతారాం చాటిచెప్పారని అన్నారు. మన పోరాటం కూడా అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఉండాలని స్పష్టం చేశారు. మార్క్సిజం-లెనినిజం కోసం మాత్రమే కాకుండా, ప్రపంచం మొత్తం మీద సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, నయా వలసవాదానికి వ్యతిరేకంగా ఎక్కడ పోరాటం జరిగినా, ఆ పోరాటాలన్నింటితో సిపిఎం ముడిపడి ఉందని, వాటికి సంఘీభావం తెలిపామని అన్నారు. హరికిషన్ సింగ్ సూర్జిత్ తరువాత సీతారాం పార్టీ అంతర్జాతీయ విభాగ బాధ్యతలు నిర్వర్తించారని, ప్రపంచంలోని అన్ని కమ్యూనిస్ట్ పార్టీలతో, అన్ని విప్లవ ఉద్యమాలతో, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులతో సంబంధాలను పెంపొందించిన ఏకైక నాయకుడు సీతారాం ఏచూరి అని అన్నారు. 'పార్టీ రాజకీయ అవగాహనలో ఇతర లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నింటినీ ఏకం చేయగల పార్టీ సామర్థ్యంతో నిరంకుశత్వం, హిందూ మతవాదానికి వ్యతిరేకంగా సమగ్ర వేదికను రూపొందించడంలో సీతారాం సహకారాన్ని అన్ని లౌకిక ప్రజాస్వామ్య శక్తులు గుర్తించాయి. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, హిందుత్వ మతతత్వ, నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా విశాల ఐక్యత సాధించేందుకు సీతారాం ఎంతో కృషి చేశారు' అని అన్నారు.

త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు మాణిక్ సర్కార్ మాట్లాడుతూ దేశంలో నియంతృత్వ పోకడలపై ఏచూరి అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. తిపురలో శాంతిభద్రతల పరిస్థితిని "నాగరికతకు అవమానం, ప్రజాస్వామ్యానికి దెబ్బ" అని అభివర్ణించారు. ప్రజల అవసరాలపై ప్రభుత్వం దృష్టిపెట్టేలా ప్రజా ఉద్యమాలు నిర్వహించడమే ఏచూరికి మనమిచ్చిన ఘనమైన నివాళి అని అన్నారు. సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అలాంటి వ్యక్తి గవర్నరా..?

- రవి 'లౌకికతత్వం' వ్యాఖ్యలపై బృందాకరత్ ఆగ్రహం
- ఖండించిన కాంగ్రెస్, డిఎంకె, సిపిఐ

న్యూఢిల్లీ : 'లౌకికతత్వం' ఐరోపా వాడి భావనని తమిళనాడు గవర్నర్ చేసిన వ్యాఖ్యలపై సిపిఐ(ఎం) నాయకురాలు బృందా కరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు వంటి ముఖ్యమైన రాష్ట్రానికి అలాంటి వ్యక్తిని నియమించడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. రవి వ్యాఖ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అది ఆర్‌ఎస్‌ఎస్ అవగాహన అని అన్నారు. రాజ్యాంగం కూడా విదేశీ భావనేనని ఆయన రేపు అనవచ్చునని ఎత్తి పొడిచారు. బృందా కరత్ ఏఎన్‌ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'ఈ గవర్నర్ రాజ్యాంగం పేరిట ప్రమాణస్వీకారం చేశారు. మన రాజ్యాంగంలో లౌకికతత్వం అనేది ఓ భాగమని నేను అనుకుంటున్నాను. రాజకీయాల నుంచి మతాన్ని వేరు చేయడం మన రాజ్యాంగంలో భాగమే. మన రాజ్యాంగం విదేశీ భావన అని రేపు ఆయన చెబుతారు. అది ఆర్‌ఎస్‌ఎస్ అవగాహన. తమిళనాడు వంటి ముఖ్యమైన రాష్ట్రానికి అలాంటి వ్యక్తిని గవర్నరుగా నియమించడం సిగ్గుచేటు' అని అన్నారు.

రవి ఏమన్నారు?

లౌకికతత్వం అనేది యూరోపియన్ భావన అని, అది భారత్‌కు చెందినది కాదని తమిళనాడు గవర్నర్ రవి సోమవారం చేసిన వ్యాఖ్య దుమారం రేపింది. కన్యాకుమారిలోని తిరువత్తూర్‌లో జరిగిన హిందూ ధర్మ విద్యా పీఠం సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ 'ఈ దేశంలో ప్రజలకు అనేక మోసాలు జరిగాయి. లౌకికతత్వంపై వారికి తప్పుడు అర్థం చెప్పడం అందులో ఒకటి. లౌకికతత్వం అంటే ఏమిటి? అది యూరోపియన్ భావన. భారతీయ భావన కాదు' అని చెప్పారు. దేశంలో లౌకికతత్వం అవసరమే లేదని కూడా అన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తమిళనాడు గవర్నర్ రవికి ఇదేమీ కొత్త కాదు. ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్న వ్యక్తులు లౌకికతత్వానికి వక్ర భాష్యం చెబుతున్నారని గతేడాది ఆయన చెప్పారు.

ప్రతిపక్షాల ఆగ్రహం

రవి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత చిదంబరం స్పందిస్తూ ఫెడరలిజం, ఒకే దేశం ఒకే ఎన్నిక, ప్రజాస్వామ్యానికి కూడా ఇదే లాజిక్ వర్తిస్తుందా అని ప్రశ్నించారు. ఇవన్నీ యూరప్ నుంచి వచ్చినవేనని గుర్తు చేశారు. ఫెడరలిజం యూరోపియన్ భావన అని, అలాంటప్పుడు దానికి భారత్‌లో స్థానం లేదని ప్రకటించగలమా అని నిలదీశారు. జమిలి ఎన్నికలు, ప్రజాస్వామ్యం కూడా అక్కడి భావనలేనని, వాటికి కూడా మన దేశంలో చోటులేదని ప్రకటించగలమా అని ప్రశ్నించారు. గవర్నర్ వ్యాఖ్యలను డిఎంకె ఖండించింది. లౌకికతత్వం గురించి రవికి ఏం తెలుసని సిపిఐ నేత డి.రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు.

బ్యాంకింగ్‌లో భయాలు..!

- తగ్గుతున్న డిపాజిట్లు
- పెరుగుతున్న రుణాల జారీ
- మార్కెట్లు, ఎంఎఫ్‌ల్లో పెట్టుబడుల ఎఫెక్ట్
- ఇతర నిధుల సమీకరణపై దృష్టి



న్యూఢిల్లీ : భారత బ్యాంకింగ్ రంగం డిపాజిట్ల సేకరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. ఇటీవల డిపాజిట్లు తగ్గడం, రుణాలు పెరగడం పట్ల ఆర్‌బిఐ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఎఫ్‌డిలపై వడ్డీ రేట్లు తక్కువగా ఉండటంతో డిపాజిట్‌దారులు బ్యాంక్‌లకు క్రమంగా దూరం అవుతున్నారు. ఇదే విషయంపై గత నెల ఆర్‌బిఐ హెచ్చరించింది. ఈ అంశం బ్యాంకింగ్ రంగంలో పెద్ద చర్చకు దారితీయడంతో పాటుగా ఆ రంగంలోని వారిని ఆందోళనకు గురి చేస్తోంది. చాలా మంది స్టాక్ మార్కెట్లు, ఐపిఒలు, మ్యూచువల్ ఫండ్స్ వంటి అధిక రాబడుల వైపు డబ్బును మళ్లిచటంతో బ్యాంక్‌ల్లో డిపాజిట్లు సన్నగిల్లుతోన్నాయి. మరోవైపు రుణాలకు డిమాండ్ పెరగడంతో బ్యాంక్‌లు సమతూల్యం చేయలేని పరిస్థితి నెలకొంది.

ఆర్‌బిఐ తాజా గణాంకాల ప్రకారం.. ఇటీవలి కాలంలో బ్యాంకుల్లో డిపాజిట్ల సంఖ్య తగ్గిపోతోంది. బ్యాంకుల్లో డబ్బు జమ చేసే వేగం మందగిస్తోంది. దీన్ని అధిగమించడానికి బ్యాంక్‌లు చొరవ తీసుకోవాలని సూచించింది. దీంతో అప్రమత్తమైన భారతీయ బ్యాంకులు ఈ లోటును పూడ్చేందుకు నిధుల సమీకరణకు వెళుతున్నాయి. ప్రత్యామ్నాయంలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బాండ్లను జారీ చేయడం ద్వారా బ్యాంకులు రూ.1.3 లక్షల కోట్ల వరకు సమీకరించవలసి వస్తుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా నివేదించింది.

ఇక్రా రిపోర్ట్ ప్రకారం.. దేశీయ బ్యాంకులు బాండ్ల జారీ మార్గంలో దాదాపు రూ.1.2 నుంచి రూ.1.3 లక్షల కోట్లను సమీకరిస్తాయని అంచనా. వాస్తవానికి ఇదే ఇప్పటి వరకు అత్యధికం కావటం గమనార్హం. డిపాజిట్లు, క్రెడిట్ వృద్ధి మధ్య నిరంతర అంతరం నెలకొనడంతో ఈ మార్గాన్ని ఎంచుకోవాల్సి వస్తోంది. దాదాపు 85 శాతం బాండ్లను ప్రభుత్వ రంగ బ్యాంకులే జారీ చేయనున్నాయని నివేదిక పేర్కొంది. దీనికి ముందు 2023-24 ఆర్థిక సంవత్సరంలో బాండ్లను జారీ చేయడం ద్వారా బ్యాంకులు రూ.లక్ష కోట్లు సమీకరించాయి. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.1 లక్షల కోట్లు సేకరించాయి. రుణాల వృద్ధి స్థిరంగా డిపాజిట్‌ల పెరుగుదలను మించిపోవడం వల్ల బ్యాంకులు ప్రత్యామ్నాయ వనరుల నుంచి నిధులను సేకరించాల్సిన అవసరం పడుతోందని ఇక్రా విశ్లేషించింది.

బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్లు తగ్గుతున్న నేపథ్యంలో ఆకర్షణీయ, వినూత్న డిపాజిట్ పథకాలను ప్రవేశపెట్టాలని ఇటీవల ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్‌బిఐ బోర్డు సమావేశంలో బ్యాంకర్లకు సూచించారు. డిపాజిట్లు, రుణాలు బండికి రెండు చక్రాల లాంటివని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. డిపాజిట్లుగా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా సమకూర్చాలన్నారు. అప్పుడే డిపాజిట్లకు, రుణాలకు మధ్య ఉన్న అంతరం తగ్గుతుందన్నారు. ఇందుకోసం వినూత్న, ఆకర్షణీయ డిపాజిట్ పథకాలు అవసరమన్నారు. బ్యాంకుల్లో వడ్డీ రేట్లు కూడా తక్కువగా ఉన్నాయని అన్నారు. అనేక ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రి బ్యాంకర్లకు సూచించారు.

ఎగిసి.. పడిన మార్కెట్లు

- ఇంట్రాడేలో 85వేల మార్క్‌కు సెన్సెక్స్

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు ఆల్‌టైం రికార్డులను కొనసాగిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మంగళవారం ఇంట్రా ట్రేడింగ్‌లో సెన్సెక్స్ తొలిసారి 85వేల మార్క్‌ను అధిగమించింది. ఆల్‌టైం గరిష్ట స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో తుదకు 14.57 పాయింట్ల నష్టంతో 84,914 వద్ద ముగిసింది. ఉదయం 84,861 వద్ద ప్రారంభమైన సూచీ.. ఇంట్రాడేలో 85,163 గరిష్టాలను నమోదు చేసింది. ఇదే బాటలో నిఫ్టీ ఇంట్రాడేలో 26,011.55 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి ఒక్క పాయింట్ లాభంతో 25,940 వద్ద ముగిసింది. సూచీలు రోజంతా ఒడుదొడుకులను ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు హిందుస్థాన్ యూనిలీవర్, అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టైటాన్ షేర్లు అధికంగా నష్టపోయాయి.

జెలెన్‌స్కీతో మోడీ భేటి

న్యూఢిల్లీ: అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ న్యూయార్క్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోల్డోమిర్ జెలెన్‌స్కీని కలిశారు. ఇరుదేశాధినేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. గత నెల ఆగస్టు 23న ప్రధాని మోడీ ఉక్రెయిన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఈ ఇరువురు నేతలు మరోసారి భేటీ అయ్యారు. అమెరికాలో న్యూయార్క్‌లో జరుగుతున్న 'సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్' సమావేశంలో పాల్గొనేందుకు అమెరికాకు వెళ్లారు. ఈ సమ్మిట్ సందర్భంగా ఈ ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి కూడా చర్చించుకున్నారు. రష్యా - ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో దౌత్యం, చర్చల ద్వారా శాంతియుత పరిష్కారాన్ని ఆశిస్తున్నట్లు మరోసారి ప్రధాని మోడీ తెలిపారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు భారత్ సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు మోడీ చెప్పారు. గడిచిన మూడు నెలల్లో మోడీ, జెలెన్‌స్కీ కలుసుకోవడం ఇది మూడవ సారి.

అమిత్‌షా వ్యాఖ్యల పట్ల బంగ్లాదేశ్ నిరసన

న్యూఢిల్లీ : జార్ఖండ్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల చేసిన వ్యాఖ్యల పట్ల బంగ్లాదేశ్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ప్రతి ఒక్క బంగ్లాదేశ్ చొరబాటుదారుని తలకిందులుగా వేలాడదీసి పరిస్థితిని చక్కదిద్దుతామని అమిత్ షా వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్ జాతీయుల గురించి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా వున్నాయని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ నిరసన తెలియజేసింది. ఈ మేరకు ఢాకాలో భారత హై కమిషనర్‌కు లేఖను అందజేసింది. ఈ వ్యాఖ్యలు తమను తీవ్రంగా బాధించాయని అంటూ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి ఆమోదయోగ్యం కాని, అభ్యంతరకరమైన వ్యాఖ్యలను చేయకుండా రాజకీయ నేతలు సంయమనం పాటించేలా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించింది. బాధ్యతాయుతమైన స్థానాల్లో వున్న నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఇరు దేశాల మధ్య గల పరస్పర గౌరవం, అవగాహన దెబ్బతింటాయని పేర్కొంది.

ఇజ్రాయిల్ దాడుల్లో 558కి పెరిగిన మృతులు

- లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వ శాఖ వెల్లడి
- ప్రపంచ నేతల ఆందోళన



ఇజ్రాయిల్ దాడితో దక్షిణ లెబనాన్‌లోని ఖియామ్ గ్రామంలో ధ్వంసమైన భవనాలు

బీరుట్, గాజా : సోమ, మంగళవారాల్లో లెబనాన్‌పై ఇజ్రాయిల్ సాగించిన రాక్షస దాడుల్లో మృతుల సంఖ్య 558కి పెరిగింది. వీరిలో 50మంది చిన్నారులు, 94మంది మహిళలు వున్నారు. మరోవైపు ఖాన్ యూనిస్ నగరంలో జరిపిన తాజా దాడిలో ఏడుగురు మరణించారని గాజాలోని పాలస్తీనా అధికారులు తెలిపారు. గాజాలో హమాస్‌పై దాడులు ఆరంభించినప్పటి నుండి లెబనాన్‌తో కూడా ఇజ్రాయిల్ ఘర్షణ పడుతూనే వస్తోంది. సోమవారం దక్షిణ, తూర్పు లెబనాన్‌ల్లో వందలాది స్థావరాలపై వైమానిక దాడులకు తెగబడింది. లెబనాన్ ఆరోగ్య శాఖ మంత్రి ఫిరాజ్ అబిద్ విలేకర్లతో మాట్లాడుతూ, సోమవారం తెల్లవారు జామునుండి కొనసాగుతున్న దాడుల్లో ఇప్పటివరకు 1835మంది గాయపడ్డారని, వారందరినీ 54 ఆస్పత్రుల్లో చేర్పించినట్లు తెలిపారు. దాడుల నేపథ్యంలో దక్షిణ లెబనాన్ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న వేలాది నిర్వాసిత కుటుంబాలు బీరుట్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో రాత్రి తలదాచుకున్నారు. అక్కడ కూడా ఆశ్రయం దొరకని వారు కారుల్లో, పార్కుల్లో రోడ్ల పక్కనా, బీచ్‌ల్లో పడుకున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బీరుట్‌లో ఖాళీగా వున్న గ్యాస్ స్టేషన్ వద్ద నిర్వాసితుల కోసం వలంటీర్లు వండి పెట్టారు. తమ ఇళ్లలో తల దాచుకోవాల్సిందిగా కోరుతూ అనేకమంది సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. మంగళవారం కూడా దాడులు చోటు చేసుకున్న నేపథ్యంలో నిత్యావసరాల కొరత ఏర్పడుతుందనే భయంతో తూర్పు ప్రాంత నగరమైన బాల్‌బెక్‌లో బేకరీలు, గ్యాస్ స్టేషన్ల వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు బారులు తీరి నిలుచోవడం కనిపిస్తోంది.

మరోవైపు ఇజ్రాయిల్‌లో 8చోట్ల తాము క్షిపణులను, రాకెట్లను ప్రయోగించామని హిజ్బుల్లా తెలిపింది. సరిహద్దుకు 60 కిలోమీటర్ల దూరంలో గల పేలుడు పదార్థాల ఫ్యాక్టరీపై కూడా దాడి చేసినట్లు తెలిపింది. ఉత్తర ఇజ్రాయిల్‌పై ఉదయం నుండి వంద వరకు రాకెట్లు పడ్డాయని ఇజ్రాయిల్ మిలటరీ మంగళవారం ప్రకటించింది.

ప్రపంచ నేతల భయాందోళనలు

మధ్య ప్రాచ్యంలో తాజా పరిణామాల పట్ల ప్రపంచ నేతలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేశారు. వీటివల్ల అనూహ్యమైన పర్యవసానాలు తలెత్తే ప్రమాదముందని హెచ్చరించారు. తక్షణమే ఉద్రిక్తతలు సమసిపోయేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

లెబనాన్, ఇజ్రాయిల్ మధ్య గల విభజన రేఖ బ్లూ లైన్ పొడవునా, ఆక్రమిత గోలన్ హైట్స్‌లో నెలకొన్న పరిస్థితుల పట్ల ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో అమాయకులు మరణించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దౌత్య మార్గాలకు మళ్ళాల్సిన అవసరం వుందని గుటెరస్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ పేర్కొన్నారు. పూర్తి స్థాయి యుద్ధాన్ని ప్రస్తుత తరుణంలో ఏ దేశమూ, ప్రజలు భరించలేరని అన్నారు.

ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం ప్రతినిధి రవీనా షామ్‌దాసాని మాట్లాడుతూ, పౌర లక్ష్యాలు, సైనిక లక్ష్యాల మధ్య తేడాను గుర్తించాలని అంతర్జాతీయ మానవతా చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయని, కానీ వాటిని ఎక్కడా ఎవరూ పాటించడం లేదని ఆవేదన వ్యకం చేశారు. యునిసెఫ్ డైరెక్టర్ కేథరిన్ రౌసెల్ మాట్లాడుతూ ఈ ఘర్షణల్లో లెక్కలేనంత మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

ఏడాదిన్నరలో ఎన్నికలు

బంగ్లా ఆర్మీ చీఫ్ ప్రకటన

ఢాకా: బంగ్లా దేశ్ ఒకటిన్నర సంవత్సరాల్లో ఎన్నికల ప్రజాస్వామ్యంలోకి తిరిగివస్తుందని ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్ ఉజ్ జమాన్ మంగళవారం పేర్కొన్నారు. రాయిటర్స్ వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. సంస్కరణల అమలులో తాత్కాలిక ప్రభుత్వానికి మద్దతు ఇస్తానని చెప్పారు. బంగ్లా దేశ్ సైన్యం ప్రొఫెషనల్ అని రాజకీయాలకు దూరంగా ఉంటుందని చెప్పారు. ఆగస్టు 5న షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం పతనం కావడంతో బంగ్లాదేశ్ తీవ్ర రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది.

అమెరికా ఆధిపత్యం కోసమే క్వాడ్ : చైనా విమర్శ

బీజింగ్ : చైనాను అదుపు చేయడానికి, అమెరికా ఆధిపత్యాన్ని శాశ్వితం చేసేందుకు క్వాడ్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకుంటోందనిచైనా విమర్శించింది. ఈ ప్రాంతానికి వెలుపల ఉన్న కొన్ని దేశాలు ప్రత్యేక సర్కిల్స్‌గా ఏర్పడి చైనా ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోడానికి, ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి యత్నిస్తున్నాయని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వ్యాఖ్యానించారు. దక్షిణ, తూర్పు చైనా సముద్ర ప్రాంత జలాల్లో తమ సార్వభౌమాధికారాన్ని, సముద్రజలాల హక్కులను పరిరక్షించుకోవాలన్న కృత నిశ్చయాన్ని ఈ విదేశీ శక్తుల జోక్యం ఏ రకంగానూ దెబ్బతీయలేదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ స్వంత పట్టణమైన విల్మింగ్టన్‌లో క్వాడ్ సదస్సు ముగిసిన రెండు రోజుల తర్వాత చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్‌జియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సముద్రజలాలపై ఆందోళనలు అన్న ముసుగులో మిలటరీ మద్దతును కూడగట్టుకోవడానికి, భద్రతా సహకారాన్ని పెంచుకోవడానికి అమెరికా ప్రయత్నిస్తోందని, అందుకే క్వాడ్ సదస్సును నిర్వహించిందని విమర్శించారు.

వాషింగ్టన్ గుత్తాధిపత్యాన్ని శాశ్వతం చేయడానికి క్వాడ్‌ను ఒక సాధనంగా వాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. నేరుగా చైనా పేరును ప్రస్తావించకుండా తూర్పు, దక్షిణ చైనా సముద్ర జలాల్లో పరిస్థితుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ క్వాడ్ సంయుక్త ప్రకటన వెలువరించింది. గతేడాది కన్నా పరుషమైన భాషను ఈసారి ఉపయోగించారు. అక్కడ పరిస్థితి సుస్థిరంగా వుందని లిన్ స్పష్టం చేశారు. ఆ ప్రాంతానికి వెలుపల వుండే కొన్ని దేశాలు చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఎవరు ఎంతలా జోక్యం చేసుకున్నా, రెచ్చగొట్టినా చైనా నిబద్ధతను, దీక్షను, కృత నిశ్చయాన్ని సడలించలేరని స్పష్టం చేశారు.

విభజన తరువాత రాష్ట్రం వెనుకబాటు

- శాసనమండలి ఛైర్మన్ మోషేను రాజు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర విభజన తరువాత నుంచి అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడిపోయిందని, పరిశ్రమలన్నీ హైదరాబాద్‌లో ఉండిపోయాయని శాసనమండలి ఛైర్మన్ మోషేను రాజు పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా నేతృత్వంలో ఢిల్లీలో రెండు రోజులపాటు కామన్ వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ రీజియన్ సదస్సుకు మోషేను రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సదస్సులో సమగ్ర అభివృద్ధి, కేంద్రం తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం వంటి అంశాలపై చర్చ జరిగిందన్నారు. ఇప్పటివరకూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు ఎన్‌డిఎలో ఉన్నారని, కావున రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు. గత పదేళ్లుగా రాజధాని లేకపోవడంతో కొంచెం అభివృద్ధికి ఆటంకం కలిగిందని పేర్కొన్నారు. సభాపతులు, శాసనమండలి ఛైర్మన్లకు బడ్జెట్ ఖర్చు పెట్టే అధికారాలు ఉండాలన్నారు. సమావేశంలో కూడా అందరూ ఇదే అంశాన్ని లేవనెత్తారన్నారు. శాసనసభ, శాసనమండలి 60 రోజులపాటు జరగాలని సమావేశంలో చర్చించామన్నారు. రాష్టానికి రావాల్సిన నిధులు కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. తిరుపతి లడ్డూ వివాదంపై స్పందించిన ఆయన.. సిబిఐ విచారణ కోరుతున్నానని అన్నారు.

శివశంకర్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో శివశంకర్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. శివశంకర్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలన్న వైఎస్ సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. శివశంకర్‌రెడ్డి బెయిల్ రద్దుతోపాటు, మిగిలిన నిందితులపై దాఖలైన పిటిషన్‌లన్నీ కలిపి విచారించాలని కోరారు. మిగిలిన నిందితులపై దాఖలైన పిటిషన్‌లు నవంబరు 4న లిస్ట్ అయినట్లు రిజిస్ట్రీలో చూపుతోందని అందుకని, అన్ని కలిపి నవంబరు 5న ఒకేసారి విచారణ చేపట్టాలని కోరారు. శివశంకర్ రెడ్డి కొడుకు జైలులో ఉన్న అప్రూవర్‌ను బెదిరించిన వ్యవహారం, వైఎస్ అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్‌లను కూడా కలిపి విచారించాలని కోరారు. శివశంకర్ రెడ్డి కొడుకు జైలులో బెదిరింపులకు పాల్పడిన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతించాలని సిద్దార్థ లూథ్రా కోరారు. సునీత తరపున విజ్ఞప్తులను ధర్మాసనం అనుమతించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతివాదిగా ఉందని, బెయిల్ రద్దుకు బెదిరించిన విషయానికి సంబంధం లేదని, వేర్వేరుగా విచారించాలని శివశంకర్ రెడ్డి తరపున న్యాయవాది రంజిత్ కుమార్ కోరారు. నవంబరు 5న అన్ని పిటిషన్లు ఒకేసారి విచారణ చేపడతామని, బాధితులే కోరుతున్నారు కాబట్టి, అదేరోజు విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

హైకోర్టులో సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ

బెంగళూరు : ముడా కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మంగళవారం హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ (ముడా)లో సిద్ధరామయ్య తన భార్యకు స్థలాలు కేటాయించడంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ అనుమతించారు. ఈ అంశాన్ని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. జస్టిస్ ఎం నాగప్రసన్న నేతృత్వంలోని బెంచ్ ఈమేరకు మంగళవారం తీర్పును ఇచ్చింది.

అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ కింద తనపై దర్యాప్తునకు అనుమతిస్తూ.. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్‌ఎస్‌ఎస్) 2023లోని సెక్షన్ 218 ప్రకారం ప్రాసిక్యూషన్‌ను అనుమతిస్తూ గవర్నర్ మంజూరు చేసిన అనుమతిని సిద్ధరామయ్య తన పిటిషన్‌లో ప్రశ్నించారు. ముడా కేసులో బెంగళూరుకు చెందిన సామాజిక కార్యకర్తలు ప్రదీప్ కుమార్ ఎస్‌పి, టిజె అబ్రహం, మైసూరుకు చెందిన స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన దరఖాస్తులపై ఆ రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ఆ రాష్ట్ర సిఎం సిద్ధరామయ్యని విచారించేందుకు ఆగస్టు 17న అనుమతి మంజూరు చేశారు. ఈ అంశంపై హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయనున్నట్లు రాష్ట్రప్రభుత్వం తెలిపింది.

రాజ్యసభ సభ్యత్వానికి ఆర్ కృష్ణయ్య రాజీనామా

- ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో వైసిపి ఓటమి తరువాత ఒక్కొక్కరూ పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ఇద్దరు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేయగా... తాజాగా బిసి సంక్షేమ సంఘం నేత ఆర్ కృష్ణయ్య తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆ రాజీనామాను ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఆమోదించినట్లు మంగళవారం రాజ్యసభ సెక్రటేరియట్ ఒక బులెటిన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రం నుంచి మరో సీటు ఖాళీ అయినట్లు వెల్లడించింది. బిసి సంక్షేమ సంఘం జాతీయ నేతగా ఉన్న ఆర్ కృష్ణయ్యను వైసిపి తమ పార్టీ తరపున 2022లో ఎపి నుంచి రాజ్యసభకు పంపింది. మరో రెండేళ్లకు పైగా పదవీ కాలం ఉండగానే ఆయన రాజీనామా చేశారు. ఆయన బిజెపిలో చేరుతున్నట్లు వార్తలు వినిపించాయి. ఈ వార్తలు, తాజా రాజీనామాపై ఆర్ కృష్ణయ్య స్పందించలేదు. వైసిపి నుంచి రాజ్యసభకు ఎన్నికైన మోపిదేవి వెంకట రమణ, బీద మస్తాన్‌రావు ఆగస్టు చివరి వారంలో రాజీనామా చేయగా, ఛైర్మన్ కార్యాలయం ఆగస్టు 29న ఆమోదించింది. ఈ రాజీనామాలను ఆమోదించడంతో, వీరి పేర్లను రాజ్యసభ జాబితా నుంచి సెక్రటేరియట్ తొలగించింది. రాజ్యసభలో వైసిపి ఎంపిల సంఖ్య ఎనిమిదికి తగ్గింది.

సెకీ ఒప్పందం ఉన్నా కొత్తగా సోలార్ ప్లాంట్లు

(మొదటి పేజీ తరువాయి

2027లో 3వేల మెగావాట్ల చొప్పున అందించనుంది.

అప్పుడు భారం.... ఇప్పుడు ఆమోదమా?

అదానీకి అనుకూలంగా ప్రజలపై భారాలు మోపే ఈ ఒప్పందాన్ని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు మాత్రం అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది. సెకీ విద్యుత్‌పై అప్పటి పిఎసి ఛైర్మన్, ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హైకోర్టులో పిటిషన్ కూడా వేశారు. యూనిట్ విద్యుత్ ధర రూ.2ల లోపే లభిస్తున్న సమయంలో సెకీ నుంచి రూ.2.49లకు ఎందుకు కొనుగోలు చేశారని పిటిషన్‌లో పయ్యావుల ప్రశ్నించారు. ఇప్పుడు అదే సెకీ నుండి అదానీకి చెందిన విద్యుత్‌ను తీసుకునేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో ప్రజలపై భారాలు వేస్తారా అని విద్యుత్ రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు

శ్రీలంక ప్రధానిగా హరిణి అమరసూర్య

(మొదటి పేజీ తరువాయి)


స్వీకారం చేయించారు. తనతోపాటు మరో ముగ్గురిని కేబినెట్ మంత్రులుగా నియమించారు. న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి శాఖలను ప్రధానికే అప్పగించారు. హక్కుల కార్యకర్త, యూనివర్శిటీ లెక్చరర్ అయిన అమరసూర్య దేశ 16వ ప్రధానిగా, దేశ చరిత్రలో మూడో మహిళా ప్రధానిగా రికార్డు సృష్టించారు. ఎన్‌పిపి పార్లమెంట్ సభ్యులు విజిత హీరత్, లక్ష్మణ్ నిపునరాచ్చి కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తాత్కాలిక కేబినెట్‌గా వీరు పనిచేస్తారు. పార్లమెంట్‌ను రద్దు చేసి, తక్షణ ఎన్నికలకు పిలుపివ్వనున్నారు. నవంబరు చివరిలో ఎన్నికలు జరగవచ్చని అధికారులు తెలిపారు. అలాగే 15 కీలక మంత్రిత్వ శాఖలకు కొత్త కార్యదర్శులను కూడా నియమించారు. వీరిలో ప్రధాన మంత్రి కార్యదర్శిగా జిపి సపుతంత్రి, కేబినెట్ కార్యదర్శిగా డబ్ల్యుఎండిజె ఫెర్నాండో ఉన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు యుఎన్‌పి నేత రణిల్ విక్రమ సింఘె పోటీ చేయరని ఆ పార్టీ ఉప నాయకుడు రువాన్ జయవర్ధనే ప్రకటించారు

సూకీకి ఆశ్రయమిస్తాం

- పోప్ ఫ్రాన్సిస్ హామీ



వాటికన్ సిటీ : నిర్బంధానికి గురైన మయన్మార్ మాజీ నేత ఆంగ్‌సాన్ సూకీకి తమ వాటికన్ సిటీలో ఆశ్రయమిస్తామని పోప్ ఫ్రాన్సిస్ హామీ ఇచ్చారని ఇటలీ మీడియా మంగళవారం తెలిపింది. సూకీని విడుదల చేయాలని తాను కోరానని, ఆమె కుమారుడిని ఇటీవలే రోమ్‌లో కలిశానని, వాటికన్ భూభాగంలో ఆమెకు ఆశ్రయం కల్పించేందుకు తాము సిద్ధంగా వున్నామని చెప్పామని పోప్ తెలిపారు. ఈ నెల ఆరంభంలో ఆసియా ప్రాంత పర్యటన సందర్భంగా రోమన్ కేథలిక్కులతో పోప్ పలు సమావేశాలు జరిపారు. ఈ ప్రైవేట్ సమావేశాల వివరాలను ఇటలీ దినపత్రిక ప్రచురించింది. ఈ నెల 2 నుండి 13 వరకు ఇండోనేషియా, తూర్పు తైమూర్, సింగపూర్‌ల్లో పోప్ పర్యటించారు. మయన్మార్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై మౌనంగా వుండలేమని, ఏదో ఒకటి చేయాలనుకుంటున్నామని చెప్పారు. అవినీతి ఆరోపణలు, కోవిడ్ నిబంధలను గౌరవించకపోవడం వంటి పలు అభియోగాలపై సూకీ 27 ఏళ్ల జైలు శిక్షను అనుభవిస్తున్నారు. 2021లో కుట్ర పన్నారన్న అభియోగాలపై మిలటరీ గృహ నిర్బంధంలో వుంచింది.




మీకోసం

రాజ్మా గింజలు ఉడికించేటప్పుడు కొద్దిగా ఇంగువ, శొంఠిపొడి వేస్తే అవి తిన్నవారికి గ్యాస్ ఫామ్ అవ్వకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఎవరైనా మనకిచ్చేది తాత్కాలికమే. కృషితో మనం సంపాదించుకున్నదే శాశ్వతం.

ఆరు బయట నిద్ర!



ఆరు బయట నిద్ర
ఆకాశపు పందిరి క్రింద
విశాలమైన వీధిలో
గగనపు నక్షత్ర పంటలో..

అందమైన వెన్నెల్లో
నింగి సొగసుల పందిరిలో
చందమామ చక్కదనం
విశాలమైన నింగితనం..

చుక్కల నడుమ చంద్రుడు
రాత్రి అతడే ఇంద్రుడు
వెన్నెల కుండలో అన్నం
అతని రంగేమో సున్నం..

మనసు నిండా భాగ్యం
అనంత ఆకాశ సౌభాగ్యం
రెండు కళ్ళకు పర్వం
నింగిని చూస్తుంటే గర్వం..

ఊహలకు రెక్కల హారం
నింగి దారుల్లో విహారం


చీకట్లో సౌందర్యం
చిలిపితనానికి అదే ధైర్యం..

లెక్క పెట్టినా తేలని నక్షత్రాలు
కోట్ల సంఖ్యల రెక్కల పువ్వులు
రాత్రంతా కనిపించే కనువిందు
హృదయాలకు అదే విందు..

కళ్లనిండా మెరుపు
కనుగుడ్లే ఆకాశపు తలుపు
హృదయము నిండా సంబరం
అన్ని కలిస్తేనే అంబరం..

– కొప్పుల ప్రసాద్, నంద్యాల,
98850 66235.

దారి చూపరూ!



పిల్లలూ.. ఇక్కడ పిల్ల డైనోసార్ తప్పిపోయి దారి మరిచిపోయింది. దానికి తల్లి డైనోసార్ దగ్గరికి వెళ్లే దారి చూపరూ..!

నేను గీసిన బొమ్మ





తిరుకోటి మోక్షిత,
4వ తరగతి,
ఎంపిపి స్కూల్, కుండలేశ్వరం,
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రాత్రుళ్లు ఆఫీసు పనా!

ఈ జాగ్రత్తలు తీసుకోండి..



రాత్రిపూట నిద్రలేమి వున్న మహిళలకు మిగతావారితో పోల్చితే రొమ్ము కేన్సర్ వచ్చే అవకాశాలు మూడురెట్లు ఎక్కువగా వున్నట్లు ఓ సర్వేలో వెల్లడైంది. ఈ సర్వే ప్రకారం 24 గంటల సమయంలో శరీరం చేసే పనుల్లో అంతరాయం కలిగించడం వల్ల శరీరంలో క్యాన్సర్ కణితులు ఏర్పడే అవకాశాలు అధికం ఉంటుందని తేలింది.

మెలటోనిన్...

రేడియేషన్ ఆంకాలజిస్టల అభిప్రాయం ప్రకారం నైట్ షిఫ్ట్ కార్మికులలో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచడానికి అనేక కారణాలు ఉన్నాయని చెబుతున్నారు. వాటిలో మొదటిది మెలటోనిన్ ఉత్పత్తి కాకపోవడం. ఇది ఒక రకమైన హార్మోన్. ఇది రాత్రి నిద్రపోయేటప్పుడు శరీరంలో ఉత్పత్తి అవుతుంది. ఈ హార్మోన్ శరీరంలో క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడుతుంది. దీని కారణంగా శరీరంలో క్యాన్సర్ కణాలు ఏర్పడవు. ఈ హార్మోన్ కణితుల అభివృద్ధికి సంబంధించిన జన్యువులను కూడా ప్రభావితం చేస్తుంది. అలాంటి ఈ హార్మోన్ రాత్రి నిద్రపోకపోవడం వల్ల శరీరంలో ఉత్పత్తి అవ్వదు. ఈ పరిస్థితే క్యాన్సర్‌కు కారణమవుతుందని నిపుణులు అంటున్నారు. కాబట్టి రాత్రిపూట నిద్రపోవడం చాలా ముఖ్యం.

అధిక ధూమపానం..

రాత్రంతా మెలకువగా ఉండి పనిచేసేందుకు చాలామంది ధూమపానాన్ని ఆశ్రయిస్తారు. రాత్రి షిఫ్టులలో పనిచేసే వ్యక్తులు పగటిపూట కంటే రాత్రిపూట ఎక్కువగా పొగ తాగడం గమనించవచ్చు. ఈ అధిక ధూమపానం కూడా శరీరంలో క్యాన్సర్ కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. అందువల్ల అధిక ధూమపానం, నిద్రపోకపోవడం రెండూ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.

జంక్ ఫుడ్, పానీయాల వినియోగం..

పగటిపూట పనిచేసే వారి కంటే రాత్రిపూట పనిచేసేవారు జంక్ ఫుడ్, శీతల పానీయాలు, కాఫీ, టీ ఎక్కువగా తీసుకుంటారని వైద్యులు చెబుతున్నారు. పగటిపూట పండ్లు, సలాడ్లు, మొలకలు తింటుంటారు. రాత్రిపూట పనిచేసే వ్యక్తులు ఉప్పుతో కూడిన స్నాక్స్, పిజ్జా, బర్గర్లు, కోలా మొదలైన వాటిని ఎక్కువగా తీసుకుంటారు. ఇది ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలను పెంచుతుంది. దీనితో పాటు క్యాన్సర్ కూడా వస్తుంది.

ప్రోస్టేట్ క్యాన్సర్..


రాత్రి షిఫ్ట్ కారణంగా మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుండగా, పురుషులలో ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. ఈ తరహా కేసులు చాలా చివరి దశలో, చాలా పెద్ద వయస్సులో కనిపిస్తాయి. అయితే ఇతర క్యాన్సర్‌లకు, ఈ నైట్ షిఫ్ట్‌కు సంబంధం ఇంకా కనుగొనబడకపోవడం కాస్త ఉపశమనం కలిగించే విషయం.

ఎలా నివారించాలి..

తప్పనిసరి పరిస్థితుల్లో రాత్రి షిఫ్టుల్లో పని చేసేవారు పని మధ్య విరామం తీసుకోవాలి. రాత్రిపూట కాఫీ, టీలు ఎక్కువగా తాగకూడదు. రోజూ వ్యాయామం చేయాలి. ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.



తమలపాకుతో ఆరోగ్యానికి మేలు



ఈ కాలంలో విరివిగా దొరికే తమలపాకులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు అంటున్నారు. తమలపాకులోని ఔషధ గుణాలు అన్ని రకాల సమస్యల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. తమలపాకులో శరీరానికి అవసరమైన విటమిన్ సి, థయామిన్, నియాసిన్, రైబోఫ్లావిన్, బీటా కెరోటిన్, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫైబర్, కాపర్, ఫాస్పరస్, ఐరన్ వంటి పలు పోషకాలు ఉన్నాయి.

- తమలపాకులోని ఔషధ గుణాలు దగ్గు, బ్రాంకైటిస్, ఉబ్బసం వంటి శ్వాసకోశ వ్యాధుల చికిత్సలో ఉపయోగపడతాయి. భోజనం తర్వాత తమలపాకులను నమలడం వల్ల ఈ ఔషధ గుణాలు నేరుగా శరీరానికి లభించి ఆయా సమస్యలను దూరం చేస్తాయి.
- తమలపాకులోని యాంటీ హైపర్‌గ్లైసీమిక్ లక్షణాలు రక్తంలోని షుగర్ లెవెల్స్‌ను అదుపులో ఉంచడానికి సహాయ పడతాయి.
- ఒత్తిడి, ఆందోళన సమస్యలకు తమలపాకులతో ఉపశమనం పొందవచ్చు.
- తమలపాకులలోని ఫినాలిక్ సమ్మేళనాలు శరీరం నుంచి కాటెకోలమైన్‌లు అనే ఆర్గానిక్ సమ్మేళనాలను విడుదల చేయడం వల్ల మనసుకు ఆహ్లాదంగా ఉంటుంది.
- భోజనం తర్వాత తమలపాకును తినడం వల్ల నోటి దుర్వాసన, పసుపు దంతాలు, దంత క్షయం సమస్యలు దూరం అవుతాయి.
- తమలపాకులు జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. భోజనం తర్వాత తమలపాకు తీసుకోవడం వల్ల మలబద్ధకం, అజీర్తి, కడుపు మంట, ఎసిడిటీ వంటి జీర్ణ సమస్యలు దూరం అవుతాయి.



ఉసిరి వల్ల ఎన్ని లాభాలో ...

ఇంకొన్ని రోజుల్లో మార్కెట్లో ఉసిరి కాయలు లభ్యమవుతాయి. చాలామంది ఈ ఉసిరితో నిల్వ పచ్చళ్లు చేసుకుంటారు. కొందరైతే గింజలను తీసేసి కాయలను ఎండబెట్టి నిల్వ చేసుకుంటారు. బోలెడు ప్రయోజనాలున్న ఉసిరిని ప్రతి ఒక్కరూ తప్పక వాడాలి. ఎండబెట్టిన ఉసిరికాయ ముక్కలను రోజుకి 1 లేదా 2 తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

విటమిన్లు-మినరల్స్ : తాజా ఉసిరికాయలోనే కాదు.. ఎండిన ఉసిరి ముక్కల్లోనూ యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి. ఉసిరిలో ఉండే విటమిన్ సి ఎండిన తర్వాత యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది శరీరాన్ని ఫ్రీ ర్యాడికల్స్ నుంచి రక్షిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులు రావు.

అజీర్తి దూరం చేస్తుంది : ప్రతిరోజూ ఎండిన ఉసిరి తింటే.. అజీర్తి సమస్య తగ్గుతుంది. జీర్ణశక్తి మెరుగుపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరు కూడా మెరుగ్గా ఉంటుంది.

జుట్టు సమస్య ఉండదు : జుట్టు రాలడం వంటి సమస్యతో బాధపడే వారికి ఎండిన ఉసిరి మంచి పరిష్కారం. ఉసిరి ముక్కల్ని తినడం వల్ల శిరోజాలు రాలడం తగ్గి.. ఆరోగ్యంగా, పొడవుగా పెరుగుతాయి. కుదుళ్లు కూడా దృఢంగా ఉంటాయి.

వాపులకు చెక్ : ఎండిన ఉసిరి ముక్కల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంపై వచ్చే వాపులు, ఒత్తిడిని తగ్గిస్తాయి. అలాగే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించడంలో సహాయపడుతాయి.

చర్మానికి మేలు : రోజూ రెండు ఎండిన ఉసిరి ముక్కలను తింటే.. చర్మం కాంతివంతంగా ఉంటుంది. చర్మంపై త్వరగా ముడతలు రావు. మొటిమలు, మచ్చలు తగ్గి యవ్వనంగా కనిపిస్తారు. ఆందోళన, వణుకు, మతిమరుపు, నరాల బలహీనత వంటి అనారోగ్య సమస్యలు సైతం తగ్గుతాయి.



భారత్ నుంచి ఆస్కార్‌కు నామినేట్ చిత్రాలివే...

ఆస్కార్ అవార్డుల రేసులో ఈ ఏడాది దక్షిణ భారత దేశంలో భారీగానే సినిమాలు పోటీపడుతున్నాయి. తెలుగు, తమిళం, మలయాళం నుంచి పలు సినిమాలు ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ ఏడాదికి మన భారతీయ చిత్ర పరిశ్రమ నుంచి మొత్తం 29 చిత్రాలను గుర్తించి వాటిని ఆస్కార్ అవార్డులకు నామినేట్ చేసింది. ఈ మేరకు ఇండియాన్ ఫిలిం ఫెడరేషన్ కార్యవర్గం అధికారికంగా ప్రకటించింది. 2025 ఆస్కార్‌కు లాపతా లేడీస్ ఎంపికైనట్లుగా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించింది. భారత్ నుంచి పలు భాషలకు చెందిన 29 చిత్రాల్లో లాపతా లేడీస్‌ను మాత్రమే ఎంపిక చేశారు. టాలీవుడ్ నుంచి 'కల్కి 2898 ఏడీ', హనుమాన్, మంగళవారం ఉన్నాయి. ఈ ఏడాదిలో 6 తమిళ చిత్రాలు నామినేట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి. వాటిలో నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన మహారాజా, విక్రమ్ హీరోగా నటించిన తంగలాన్, సూరి ప్రధాన పాత్రను పోషించిన కొట్టుక్కాళి, రాఘవలారెన్స్, ఎస్‌జే సూర్య కలిసి నటించిన జిగర్తండా డబుల్ ఎక్స్, మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన వాళై, పారి ఎలవళగన్ కథానాయకుడిగా నటించి, దర్శకత్వం వహించిన జమ చిత్రాలు చోటు చేసుకున్నాయి. మలయాళం నుంచి ఆట్టం, ఆడుజీవితం (ది గోట్ లైఫ్), ఆల్ వి ఇమాజిన్ యూజ్ లైట్, ఉళ్ళోజుక్కు వంటి చిత్రాలు ఉన్నాయి. ఇలా మొత్తంగా సౌత్ ఇండియా నుంచి 13 సినిమాలు ఆస్కార్ కోసం నామినేట్ అయ్యాయి. అయితే భారతీయ చిత్ర పరిశ్రమ ఎంపిప 29 సినిమాల్లో 'లపతా లేడీస్' మాత్రమే ఆస్కార్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. త్వరలో మిగిలిన సినామాల గురించి అధికారంగా ప్రకటన రానుంది.



'జటాధర' కొత్తపోస్టర్ విడుదల

సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రం 'జటాధర'. 2025 శివరాత్రికి ఈ సినిమా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి కొత్తపోస్టర్‌ను మేకర్లు విడుదల చేశారు. పౌరాణిక, ఫాంటసీ, డ్రామా అంశాల కలయికగా ఈ చిత్రం తెరకెక్కనున్నట్లుగా పోస్టర్‌ను చూస్తే అర్థమవుతుంది. సుధీర్‌బాబు సరికొత్త లుక్‌తో శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ 'జటాధర ఫస్ట్ లుక్ పోస్టర్‌కు వచ్చిన ఆదరణ చూసి ఆశ్చర్యపోయా. ఇంత గొప్ప స్పందన రావడంతో సంతోషమేసింది. ఆ సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. ఈ సినిమాలో అడుగుపెట్టడం అనేది ఓ సరికొత్త ప్రపంచాన్ని నాకు పరిచయం చేసింది. నాకు ఇది ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. శాస్త్రీయ, పౌరాణిక అంశాల కలయిక స్క్రిప్ట్‌ను రాశారు. ఈ రెండో జోనర్లకు చెందిన ప్రపంచాలను ఆడియన్స్ వెండితెరపై చూస్తున్నపుడు ఓ సరికొత్త సినిమా అనుభూతిని పొందుతారు. ఓ సినిమా సక్సెస్‌కైనా కారణం బలమైన స్క్రిప్ట్. దీనికి మంచి టీమ్ తోడైతే అది మంచి అది మంచి సినిమాగా ప్రాణం పోసుకుంటుంది. మా సినిమా విషయంలోనూ అదే జరుగుతుంది' అంటూ వివరించారు. సుధీర్‌బాబు నటించిన 'మా నాన్న' సూపర్ హీరో సినిమా అక్టోబర్ 11ప విడేదల కానుంది.



'నింద' నిర్మాత, దర్శకుడికి దిల్‌రాజు అభినందన

వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'నింద'. ఓటీటీలో ఈ సినిమా విడుదలైన బాగా ట్రెండింగ్‌లో నిలిచింది. ఓటీటీలో ఈ సినిమాను చూసిన నిర్మాత దిల్‌రాజు ఆ సినిమా నిర్మాత, దర్శకుడిని ప్రత్యేకంగా అభినందించారు. ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేశ్ జగన్నాదం నిర్మిస్తూ దర్శకత్వం వహించారు. ది ఫెర్వెంట్ ఇండది ఫెర్వెంట్ ఇండి ప్రొడక్షన్స్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు.కాంద్రకోట మిస్టరీ అనే క్యాప్షన్‌తో యదార్థ సంఘటనల ఆధారంగా ఈ మూవీని తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఆయన విజన్, మేకింగ్‌కు దిల్‌రాజు ఫిదా అయ్యారు. తాజాగా ఆయన నింద మూవీని వీక్షించి నిర్మాత్ రాజేష్‌తో మాట్లాడి అభినందించారు. సినిమా బాగుందనీ, బాగా తీశారని ఆయన్ను అభినందించారు.

చెస్ ఛాంపియన్స్‌కు ఘన స్వాగతం

- చెన్నైలో గుకేశ్ సహా ప్రజ్ఞానంద, వైశాలి, శ్రీనాథ్‌లకు



చెన్నై: చెస్ ఒలింపియాడ్-2024 టైటిల్‌ను చేజిక్కించుకున్న భారత పురుషుల, మహిళల గ్రాండ్‌మాస్టర్లకు ఘన స్వాగతం లభించింది. చెన్నై విమానాశ్రయంలో ఆర్. ప్రజ్ఞానంద, వైశాలి, శ్రీనాథ్‌లకు ప్రభుత్వం తరపున క్రీడామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయంలో తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో గ్రాండ్‌మాస్టర్లకు మెడలో పూలదండలు వారు ఘన స్వాగతం పలికారు. భారత చెస్ ఒలింపియాడ్ జట్టు కెప్టెన్ శ్రీనాథ్ మాట్లాడుతూ.. 45వ చెస్ ఒలింపియాడ్‌లో ఈ ఏడాది రెండు విభాగాల్లో భారత్‌కు స్వర్ణ పతకాలు దక్కడం పట్ల సంతోషంగా ఉన్నామని, ఇంతకుముందు రష్యాతో సంయుక్త విజేతగా మాత్రమే నిలువగలిగామని, కానీ ఈసారి ఒంటరిగా బంగారు పతకం సాధించడం మరింత ఉత్సాహాన్నిచ్చిందన్నారు. వైశాలి మాట్లాడుతూ.. స్వర్ణ పతకం సాధించడం పట్ల చాలా ఆనందంగా ఉంది. గతసారి చెన్నైలో జరిగిన చెస్ ఒలింపియాడ్ లో కాంస్య పతకం సాధించాం. అప్పుడు గోల్డ్ మెడల్ గెలవకపోవడం చాలా బాధగా ఉంది. కానీ ఇప్పుడు గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. భారత పురుషుల జట్టు గెలిచింది. అయితే అత్యధిక పాయింట్ల తేడాతో మహిళల జట్టు ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది మరియు మిగిలిన రెండు మ్యాచ్‌లను గెలుచుకుంది, రెండు మ్యాచ్‌లు గెలిచి పతకాన్ని గెలుచుకుంది. ఘన స్వాగతం లభించింది. భారత పురుషుల బృందానికి కెప్టెన్‌గా రమేశ్‌బాబు ప్రజ్ఞానంద కెప్టెన్ గా ఉన్నారు. వీరు మంగళవారం నగరానికి చేరుకో గా వీరికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

ఇక ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గుకేశ్ మాట్లాడుతూ.. ఈ సిరీస్‌లో తామంతా సమిష్టిగా రాణించామని, అందరూ మంచి ఫామ్‌లో ఉండడం కలిసొచ్చిందని చెప్పుకొచ్చాడు. 11వ రౌండ్‌లో తొలి 3 రౌండ్లు ముగిసేసరికి ఫలితం తేలిపోయిందన్నాడు. చైనాకు చెందిన డిఫెండింగ్ ప్రపంచ ఛాంపియన్ డింగ్ లిరెన్ తాను ఆడాలని ఆశించానని చెప్పుకొచ్చాడు. అతను రానప్పటికీ, నేను కూడా ప్రత్యామ్నాయం కోసం సిద్ధంగా ఉన్నాను. కెప్టెన్ శ్రీనాథ్ వ్యూహంతో తాను మొదటి బోర్డ్‌లో ఆడించేలా చేసాడు. అందుకే తాను, అర్జున్ ఎరిగైసి నిలకడగా గెలవగలిగామన్నాడు. చెన్నైలో జరిగిన చివరి చెస్ ఒలింపియాడ్‌లో మేము చేసాము. ఇది వ్యక్తిగత ఈవెంట్‌లో స్వర్ణం గెలవడం అదనపు ఆనందంగా ఉంది. ఫలితంగా మేము ఇప్పుడు స్వర్ణం సాధించగలిగాము ఇది భారత జట్టు ఉమ్మడి కృషికి దక్కిన ఫలితం అని చెప్పుకొచ్చాడు.

రిఫరీగా జిఎస్ లక్ష్మి, అంపైర్‌గా వ్రిందా

మహిళా అంపైర్లతోనే యుఎఇ వేదికగా టి20 ప్రపంచకప్: ఐసిసి సంచలన నిర్ణయం



జిఎస్ లక్ష్మి



వ్రిందా రథీ

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) సంచలన నిర్ణయం తీసుకుంది. అక్టోబర్‌లో యుఎఇ వేదికగా జరిగే టి20 ప్రపంచకప్ బాధ్యతలన్నీ మహిళా అంపైర్లకు అప్పగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో మహిళా ఐసిసి రిఫరీ జిఎస్ లక్ష్మికి, అంపైర్ల ప్యానెల్‌లో వ్రిందా రథీకి చోటు లభించింది. ఈ టోర్నీకి ఐసిసి ముగ్గురు మ్యాచ్ రిఫరీలను ప్రకటించగా.. అందులో జిఎస్ లక్ష్మి ఒకరు. ఇక 10మందితో అంపైర్ల ప్యానెల్‌ను ప్రకటిం చగా.. అందులో వ్రిందాకు చోటు లభించింది. ఈసారి టోర్నమెంట్ మొత్తం అంపైర్లు, రిఫరీ, థర్డ్ అంపైర్లను ఐసిసి మహిళలనే ప్రకటించడం విశేషం. వరల్డ్ కప్ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేయనున్న వాళ్లలో క్లెయిర్ పొలొసాక్ అనుభవజ్ఞురాలు. ఆస్ట్రేలియాకు చెందిన ఆమె గతంలో నాలుగు వరల్డ్ కప్ పోటీలకు అంపైర్‌గా వ్యవహరించారు. గత వరల్డ్ కప్‌లో టీవీ అంపైర్‌గా పనిచేసిన సూ రెడ్‌ఫెర్న్ మరోసారి అదే పాత్ర పోషించనుంది. ఇక.. జింబాబ్వేకు చెందిన సారాహ్ దంబనవన తొలిసారి మహిళల టి20 వరల్డ్ కప్ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేయనుంది. అక్టోబర్ 3న యుఎఇ వేదికగా మహిళల టి20 వరల్డ్ కప్ మొదలవ్వనుంది.

'స్కిల్స్ క్యాంప్' పట్ల హర్మన్ సంతృప్తి

ప్రపంచకప్ దృష్ట్యా ఆటగాళ్లకు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) ఏర్పాటు చేసిన సన్నాహాల పట్ల కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సంతృప్తి వ్యక్తం చేసింది. మెగా టోర్నీ దృష్ట్యా ఆటగాళ్లకు యోగ, స్పోర్ట్స్ సైకాలజీ, అథ్లెటిక్స్ 'స్కిల్స్ క్యాంప్'లను తదితరు ఏర్పాట్లను చేసింది. ఈ సందర్భంగా హర్మన్ మాట్లాడుతూ.. ఆటగాళ్ల ఒత్తిడి జయించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడింది. 2009 నుంచి ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌ను నిర్వహిస్తుండగా.. ఈ టోర్నీలో భారత్ అత్యుత్తమ ప్రదర్శన 2020 టోర్నీలో ఫైనల్‌కు చేరడమే. ఆ ఏడాది జరిగిన ఫైనల్లో భారతజట్టు ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. అలాగే 2017లో ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరినా.. ఆ ఏడాది ఇంగ్లండ్ చేతిలో ఓటమిపాలై రన్నరప్‌కే పరిమితమైంది. 2020 నుంచి హర్మన్ ప్రీత్ కౌర్ భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తోంది.

అంపైర్లు : రెన్ అగెన్‌బ్యాగ్(ద.ఆఫ్రికా), కిమ్ కాటన్(న్యూజిలాండ్), సారాహ్ దంబనవన(జింబాబ్వే), సూ రెడ్‌ఫెర్న్, అన్నా హ్యారీస్(ఇంగ్లండ్), నిమలి పెరీరా(శ్రీలంక), ఎలోసీ షెరిడాన్, క్లెయిర్ పొలొసాక్(ఆస్ట్రేలియా), వ్రిందా రథీ(భారత్), జాక్విలిన్ విలియమ్స్(వెస్టిండీస్).

మ్యాచ్ రిఫరీలు : శాంద్రే ఫ్రిట్జ్(ద.ఆఫ్రికా), జిఎస్ లక్ష్మి(భారత్), మిచెల్ పెరీరా(ఇంగ్లండ్).

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68